
శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


పాక్‌ను తిప్పేసిన దీప్తి, చరణి.. **10**



వరల్డ్‌కప్‌ను ఘనంగా ఆరంభించిన భారత్..!


సంపుటి 09, సంచిక: 195 | సోమవారం | 15-06-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## భారీ మోసం..

- 'అన్నదాత సెంటర్' పేరుతో నిరుద్యోగ నిర్వాహకులు
- 213 మంది ఉద్యోగులు, 259 మంది క్యాంటిన్ నిర్వాహకుల నుంచి కోట్ల రూపాయల వసూళ్లు
- 'సేవ్ ఎర్త్ మిషన్' ఎన్‌జిఒ సంస్థపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగాలు,తక్కువ ధరలకు నిత్యావసర వస్తువుల సరఫరా పేరుతో వందలాది మంది నిరుద్యోగులు, క్యాంటిన్ నిర్వాహకుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'సేవ్ ఎర్త్ మిషన్' అనే ఎన్‌జిఒపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, గద్వాల పట్టణానికి చెంది న సూర్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. 2025 మే నెలలో ఓపత్రికలో ప్రచురితమైన ఉద్యోగ ప్రకటన చూసి ఆమె హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సేవ్ ఎర్త్ మిషన్ తరువాయి 8లో



'నీట్, సిబిఎస్ఇ'లో అవకతవకలపై

# తక్షణమే చర్యలు

ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' భారీ బహిరంగ సభ నిరసన ప్రదర్శన

- పాల్గొన్న సోనమ్ వాంగ్‌చుక్, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్,ఆకునూరి మురళి తదితరులు
- పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యావ్యవస్థలో మార్పులు వచ్చేవరకూ చైతన్య పోరాటాలు సాగాలని పిలుపు
- కేంద్రానికి వ్యతిరేకంగా నినదించిన యువత, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాపక్షం/హైదరాబాద్

'నీట్, సిబిఎస్ఇ' తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తామని వారు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)' ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ సభ, నిరసన ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణవేత్త, విద్యా సంస్కరణల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి, సిజెపి ప్రతినిధి విజేత్ దహియా, తరువాయి 8లో

## మంత్రి ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

నీట్, యుజిసి నెట్ పరీక్షల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతుంటే, పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దులతో కేంద్ర ప్రభుత్వం వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు. 2019 నుండి 2026 మధ్య దేశంలో 65 జాతీయ స్థాయి పరీక్షలు లీకేజీలు, తరువాయి 8లో

# సన్నద్ధం కండి



- వ్యవసాయ సీజన్ ప్రారంభంతో అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధమవ్వాలి
- విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలి
- రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలి
- అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలి
- వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

> వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందే. అవసరమైతే నేను కూడా రోడ్డుపైకి వస్తా
>
> – ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని సిఎం సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్నవడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సిఎం హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై సిఎం రేవంత్ రెడ్డి ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలోని బోధి పేవిలియన్‌లో ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్‌తో తరువాయి 8లో

## కూనంనేనికి సిఎం శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పుట్టిన రోజును పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తరఫున శుభాకాంక్షల లేఖతో పాటు పుష్పగుచ్ఛాన్ని కూనంనేని సాంబశివరావుకు అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన, తనపై అభిమానానికి, ఆప్యాయతకు చూపిన రాష్ట్రంలోని కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు అందరికీ కూనంనేని సాంబశివరావు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## పసిడి గురి

**09**



అంతర్జాతీయ వేదికపై భారత ఆర్చర్లు అదరగొట్టారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్‌కప్ ఆర్చరీలో ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహొద్ పసిడి గురితో దేశం గర్వించేలా చేశారు.

## అమెరికాకు సేవకుడిలా ఆజ్ఞలు పాటిస్తున్నారు!

- రాజీపడిన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు
- మోదీపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు
- అమెరికా జరిపిన దాడుల్లో భారత పౌరులు మరణించడంపై కాంగ్రెస్ తీవ్ర నిరసన



**న్యూఢిల్లీ:** అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన తర్వాత, అమెరికా చేసిన ప్రకటనలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మన రాజీపడిన ప్రధాని ఒక విధేయుడైన సేవకుడిలా వింటూ ఆజ్ఞలను పాటిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని అవమానించే వారికి రుణపడి ఉంటారు కాబట్టి, రాజీపడిన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరని అన్నారు. హోర్ముజ్ జల సంధిలో తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘించినా, ఇరాన్ చమురు అక్రమ రవాణాను సహించబోమని భారత్‌కు తెలియజేసినట్లు అమెరికా ప్రకటించిన మరుసటి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్ తీరంలో నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో భారత పౌరులు మరణించడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో శుక్రవారం విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో మాట్లాడగా ఆయన ఈ విషయాన్ని రూబియోకు తెలియజేశారు. 'అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన కొద్ది రోజులకే విచారం గానీ, క్షమాపణ గానీ లేదు. దానికి విరుద్ధంగా, అమెరికా ఆదేశాలు జారీ చేస్తూనే ఉంది' అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'అమెరికా సైనిక ఆదేశాలను వెంటనే పాటించండి. ఎలాంటి ఉల్లంఘనను సహించబోము' అన్న యుఎస్ వ్యాఖ్యలను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉటంకించారు. ఏ సార్వభౌమ దేశం కూడా ఇటువంటి భాషను ఎన్నటికీ సహించదని, కానీ మన రాజీపడిన ప్రధాని మౌనం వహిస్తున్నారని, ఆయన ఒక విధేయుడైన సేవకుడిలా వింటూ, ఆదేశాలను పాటిస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. రాజీపడిన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరన్నారు. ఎందుకంటే ఆయన దేశాన్ని అవమానించే వారికి తరువాయి 8లో



# గంట మోగింది

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు

- తొలి విడతగా మొత్తం 1,302 విద్యా సంస్థల్లో ప్రారంభం
- ఈ విద్యాసంవత్సరం నుంచి 25 నిమిషాల పాటు డిజిటల్ పాఠాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

వేసవి సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా '2026–27' విద్యా సంవత్సరానికి గాను సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్(అల్పాహారం) పథకాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభించనుంది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి విడతలో మొత్తం 1,302 విద్యా సంస్థల్లో ప్రారంభించగా, ఇందులో 1,269 పాఠశాలలు,33 కళాశాలలు ఉన్నాయి. మొత్తంగా 1,44,610 మంది విద్యార్థులకు ఉదయం సమయంలో అల్పాహారం అందించనున్నారు. ప్రస్తుత నూతన విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలల్లో విడతల వారీగా అల్పాహారాన్ని ప్రారంభిస్తారు. ఈ నెల 12వ తేదీ నుంచే పాఠశాలలు పునః ప్రారంభంకావాల్సి ఉండగా, ఎండల తీవ్రత దృష్ట్యా ఈనెల 15న(సోమవారం) నుంచి పాఠశాలలను పునః పారంభించనున్నట్టు విద్యా శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు మాత్రం 12వ తేదీనే (శుక్రవారం ) పునః ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలలో డ్రాపౌట్ శాతం తగ్గించే దిశగా మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. ఇందులో భాగంగా ఉదయం విద్యార్థులకు అందించే అల్పాహారం మెనూ లోని మిల్లెట్ ఇడ్లీ సాంబార్, మిక్స్‌డ్ వెజ్ కుర్మాతో పూరీ, చట్నీతో బోండా, ఉక్మా చట్నీ అలాగే దోస అందించనున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయ. కాగా అల్పాహార కార్యక్రమాన్ని మంత్రులు ప్రారంభించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అన్ని తరగతుల తరువాయి 8లో



## 18 నుంచి భారీ వర్షాలు

- వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాబోయే ఏడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ప్రధానంగా వచ్చే గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాల తీవ్రత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని, పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ తరువాయి 12లో

# ఒప్పందంపై ఊగిసలాట



- ఇరాన్ తుది సమీక్ష
- చివరి సంప్రదింపుల కోసం టెహ్రాన్‌కు ఖతారీ మధ్యవర్తులు
- బీరూట్‌లో కొత్త దాడులు : ఇరాన్ ప్రతీకారం?
- సంతకాలకు ఆదివారం ముహూర్తంపై ఐఆర్‌జిసి విముఖత

**ఇస్లామాబాద్ :** సంతకాలకోసం అమెరికా ఎదురుచూస్తున్న ప్రాథమిక ఒప్పందాన్ని ఇరాన్ ఇంకా సమీక్షిస్తోంది. ఇరాన్ మీడియా నుండి ఆదివారం మధ్యాహ్నం ఈ వార్త వెలువడింది. చర్చల్లో ఉన్న ప్రతిపాదిత ముసాయిదా ఒప్పందం (ఎంఒయు) పై ఇరాన్ నిర్ణయం తీసుకోలేదని, అంగీకారం తెలియజేసేందుకు తుది సమీక్ష కొనసాగుతోందని ఇరాన్ సంప్రదింపుల బృందానికి సన్నిహితంగా ఉన్న విశ్వసనీయ వర్గాన్ని ఉటంకిస్తూ ఫార్స్ వార్తాసంస్థ తెలియజేసింది. మరోవైపు ఈ సమీక్షలో చివరిగా మార్పులు చేర్పులు, సంప్రదింపుల నిమిత్తం ఖతార్‌కు చెందిన మధ్యవర్తులు కూడా టెహ్రాన్‌కు చేకుని అందులో భాగం పంచుకున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య ఎంఒయు కడపటి దశకు చేరిందని ఇరు పక్షాలు,మధ్యవర్తి పాకిస్థాన్ కూడా ప్రకటించిన తర్వాత ఇరాన్ తనకున్న సందేహాలు తొలగించుకోవడానికి తుది సమీక్షలో ఉంది. ఇదిలా ఉండగా, ఆదివారం దక్షిణ బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడులు చేయడంతో ముగ్గురు మరణించారు. దీనిపై ఇరాన్ ఆగ్రహంతో ఉంది. దీనికి ప్రతీకార దాడులు జరుగుతాయని, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా ఇజ్రాయెల్ ఆదివారం రాత్రి ప్రకటించడంతో ఒప్పందం సంతకాల సమయంపై కొత్త తరువాయి 12లో

## సింగరేణిపై దోపిడీదారులు, డేగలనూ వాలనివ్వం

- సంస్థ ప్రతిష్ఠను, కార్మికుల ఆత్మగౌరవాన్ని బిఆర్‌ఎస్ నేతలు దెబ్బతీసున్నారు
- కేంద్రానికి లేఖలు రాయడం అవాస్తవం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్ పరిశీలన



ప్రజాపక్షం / శ్రీరాంపూర్

సింగరేణి సంస్థపై దోపిడీదారులు, డేగలు కన్నెత్తి చూస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెచ్చరించారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను ఆదివారం ఆయన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌస్‌ను తనిఖీ చేసి బొగ్గు రవాణా లెక్కలను, భద్రతా ప్రమాణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తరువాయి 12లో



శిక్షణ తరగతుల ముగింపులో మాట్లాడుతున్న కూనంనేని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా..

## పోరాటాలు మరింత ఉధృతం

- ఆగస్టు 6 నుంచి 15వరకు దేశ వ్యాప్తంగా ప్రచార పాదయాత్రలు నిర్వహించాలి : సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పిలుపు
- జనంలో సిపిఐ శ్రేణులు మమేకం కావాలి : సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**అమరావతి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మనం పోరాటాలు మరింత ఉధృతంగా తీసుకువెళ్లాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎపిలోని ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో మున్నేటి అవతల ఉన్న స్నేహా గార్డెన్స్‌లో సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కె.రామకృష్ణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు – సిపిఐ వైఖరి అనే అంశంతో పాటు దేశంలో బిజెపి తరువాయి 12లో

# శ్రామికవర్గ పక్షపాతి.. శ్రీశ్రీ

మహాకవి శ్రీశ్రీ గురించి రాయడానికేకాదు... ఆలోచించడానికి కూడా ఒక అర్హత కావాలి. సమజంలో కుళ్లును కూకటివేళ్లతో పెకలించే శక్తివంతమైన కవతా ప్రళయఘోషను భరించే శక్తి ఉండాలి. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు తలవంచని శ్రీశ్రీ మాటల ఛురకత్తుల దాడుల పదును భరించే ఆద్రత ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆయన కలం సృష్టించిన తిరుగుబాటు భావనలను ఒంటపట్టించుకోవడానికి అనంతమైన ధైర్యం కావాలి. స్వార్థపరులు... లంచగొండులు.. సాటి మనిషి శ్రమను దోచుకునే దుర్మార్గులు.. సమసమాజాన్ని ఒప్పుకోని నీచులకు సింహస్వప్నమైన శ్రీశ్రీ, పీడితులకు, తాడితులకు, అణగారిన వర్గాలకు మాత్రం ఆప్తుడు. సాహితీ ఉద్యమకారుడు... అక్షర ఉద్యమకారుడు శ్రీశ్రీ గురించి ఎంత చెప్పినా ... ఎన్ని విశేషణాలు జోడించినా తక్కువే. మనిషి ఆలోచనా సరళిని, ప్రవర్తనా విధానాన్ని విశ్లేషించడానికి ఎంతో మంది రచయితలు మహా గ్రంథాలే రాశారు. కానీ, అక్షరబ్రహ్మ శ్రీశ్రీ మాత్రం..

**'నిప్పులు చిమ్ముకుంటూ**
**నింగికి నే నెగిరిపోతే,**
**నిబిడాశ్చర్యంతో వీరు-**
**నెత్తురు కక్కుకుంటూ**
**నేలకు నే రాలిపోతే**
**నిర్దాక్షిణ్యంగా వీరే...'** అంటూ సగటు మనిషి ఆలోచనా సరళిని సూక్ష్మంగానేగానీ, ఎంతో లోతైన పరిశీలనగా చెప్పేశాడు. ఒక పుస్తకంలోనూ ఇమడని భావాన్ని, అంత తేలికగా, అంతే కఠినంగా చెప్పిన శ్రీశ్రీని ఎవరితో పోల్చగలం? 'ఇది నా యుగం.. శ్రీశ్రీ యుగం' అని ప్రకటించుకున్న అసమాన ప్రతిభావంతుడిని కొత్తగా ఎలా పరిచయం చేయగలం. ఇక్కడ కూడా మళ్లీ శ్రీశ్రీయే గుర్తుకొస్తాడు.

జూన్ 15 వర్ధంతి

**'ఏదో కాస్త భాషాజ్ఞానం**
**ఇంతో అంతో చ్ఛందస్సంపదా**
**ఐదోపదో అలంకారాలు**
**అరో అందులో సగమో ఆవేశం..**
*****
**ఇలాంటివేవో పోగుచేసి**
**ఇది వరకు నిన్నెప్పుడూ చూడనట్టు**
**ఇవ్వాళేదో కొత్తగా కనిపెట్టినట్టు**
**ఏమని వర్ణించను నిన్ను?**
*****
**ఏది రాసినా ఏం లాభం?**
**ఇదివరకెవడో అనే ఉంటాడు**
**బహుషా అనేదేదో నాకన్నా**
**బాగానే అని ఉండొచ్చు'** అనే శ్రీశ్రీ మాటలు స్మృతి పథంలో మెదలుతాయి. సందర్భం 'ఖడ్గసృష్టి' కావచ్చు.. చెప్పేది 'శరచ్చంద్రిక'పై కావచ్చు. కానీ, ఆ మాటలు శ్రీశ్రీకి కూడా అన్వయించుకోవచ్చు. నాలాంటి పాత్రికేయులకే కాదు.. రచయితలకు, మేధావులకు, చివరికి రాజకీయ నాయకులు కూడా శ్రీశ్రీయే గతి. ఆయనన అనుసరించక పోయినా, అనుకరించకపోయినా పూటగడవని స్థితి. పదునైన పదాలు కావాలంటే శ్రీశ్రీ. లోతైన భావం చెప్పాలంటే శ్రీశ్రీ. మస్తిష్కాలలోకి చొరబడి.. గుండెల్లో ఒదిగిపోయి.. ఆలోచనలో భాగమై, పలుకులకు మంత్రమై, మనిషిపై అపారమైన ముద్ర వేసిన ఏకైక రచయిత శ్రీశ్రీ అనడంలో అతిశయోక్తి లేనేలేదు. సాహితీ లోకంలో ఆయన ఓ అగ్నిశిఖ. ఓ మహా విస్ఫోటనం. హోరెత్తించే జలపాతం. ఉరుకులుపరుగుల జలప్రవాహం. ఆయన కవిత్వం నిరంతరం జ్వలిస్తునే ఉంటుంది. అందుకే, ఆ కవిత్వంలోని ఏదో ఒక మాటను లేదా వాక్యాన్ని లేదా భావాన్ని ప్రస్తావించకుండా అక్షరాలు ముందుకు సాగవు. ఏ సందర్భంలోనైనా శ్రీశ్రీ మన స్మృతి పథంలో మెదులుతాడు.... మెరుస్తాడు. కుళ్లి సమాజాన్ని చూసినప్పుడు శ్రీశ్రీ గుర్తుకొస్తాడు. పేదల కష్టాలను కాంచినప్పుడు శ్రీశ్రీ కనిపిస్తాడు. ఎర్ర రంగులో.. ఎత్తిన పిడికిలిలో.. వెల్లివిరిసిన చైతన్యంలో.. దైన్యాన్ని వీడిన ధైర్యంలో అగుపించేది శ్రీశ్రీ ఒక్కడే. కవిత్వం ఎలా ఉండాలో చెప్పే క్రమంలో, తన కవితా ధోరణిని తానే..












**'కదిలేది కదిలించేదీ,**
**మారేది మార్పించేదీ,**
**పాడేదీ పాడించేదీ,**
**పెనునిద్దుర వదిలించేదీ,**
**మునుముందుకు సాగించేదీ,**
**పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ'** అంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను నిరసించిన శ్రీశ్రీ, కార్మికులు, కర్షకుల పక్షాన నిలిచాడు. వారి సమస్యలు.. దుర్భరమైన జీవితాలను చూసి చలించిపోయాడు. వారి గొంతుకయ్యాడు. అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా నినదించాడు. అన్యాయాలను ఎదిరించే పదునైన అక్షర ఆయుధమయ్యాడు. ఛురకత్తులై చెడును చెండాడే శక్తి ఆయన కవిత్వానిది. ఆయనలో నవ సమాజ నిర్మాణానికి అంకిత భావం ఉంది. వేదనలు, రోదనలు ఎక్కడ ఉంటే శ్రీశ్రీ అక్కడ ప్రత్యక్షమవుతాడు. పోరాట స్ఫూర్తినింపుతాడు. చిన్నతనంలోనే రచనలకు శ్రీకారం చుట్టిన శ్రీశ్రీ, జీవితాంతం తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబట్టాడు. కొన్ని సినిమా పాటలను... ఒకటో రెండో రాజకీయ కవితలను కొంత మంది ప్రస్తావిస్తూ, విమర్శలు గుప్పించినంత మాత్రాన శ్రీశ్రీ ప్రతిష్ట మరసకబారదు. సామాన్య ప్రజలు నెత్తినపెట్టుకొని ఊరేగుతున్నప్పుడు, మేధావులిచ్చే భుజకీర్తులు ఆయనకు ఎందుకు? ఏడవ ఏటనే రచనా వ్యాసంగాన్ని మొదలుపెట్టిన ఆయన మొదట్లో భావ సాహిత్యంలో ఓలలాడాడు. ఆతర్వాత కమ్యూనిజంవైపు మొగ్గ చూపి, విప్లవ సాహిత్యంతో మమేకమయ్యాడు. ఆరంభంలో సాహిత్యమే శ్రీశ్రీని నడిపిస్తే, ఆతర్వాత శ్రీశ్రీయే తెలుగు సాహిత్యాన్ని నడిపించాడు. శ్రీశ్రీ తన 18వ ఏట 1928లో 'ప్రభవ' అనే కావ్య సంపుటిని ప్రచురించాడు. ఈ రచనను సాంప్రదాయ పద్ధతిలోనే రాసాడు. తరువాతి కాలంలో ఛందస్సు సంకెళ్లు తెంచుకొని, వాడుక భాషలో కవిత్వం రాశాడు. మార్పును 'గురజాడ అడుగుజాడ'గా పేర్కొన్నాడు.

1950లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. ఝంఝామారుతంలా తెలుగు సాహితీ లోకాన్ని చుట్టేసింది. ఆయనను మహాకవిగా నిలబెట్టింది. అప్పటి వరకూ ఎవరూ పట్టించుకోని, ఎవరికీ పట్టని కార్మికులకు, కర్షకులకు, పతితులకు, భ్రష్టులకు, బాధాసర్పద్రష్టులకు చోటు కల్పించాడు. కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా... ఏదీ కవిత్వానికి అనర్హం కాదని స్పష్టం చేశాడు. పొలాలు దున్నే రైతుల కష్టాన్ని చూసి చలించిపోయాడు. వారు చిందించే ఘర్మజలానికి (చెమటకు) ఖరీదు కట్టే షరాబు లేదని తేల్చి చెప్పాడు. ప్రపంచ వికాశం కోసం గనిలో, వనిలో, కార్ఖానాలో పరిక్లమించే, పరిష్లవించే కార్మిక లోకానికి జేజేలు పలికాడు. వారి కన్నుల నిండా కణకణమండే, గలగల

'రాసిందేదో రాస్తాం.. తీసుకొనుము తోచినంత.. తీపో చేదో.. సీసాపైనేగా మన ధ్యాస హమేషా.. గళాసు దాల్చిన ఏసూ, ఏ సోడా ఏ నీళ్ల వీసం కూడా కలపక విస్కీ.. సునాయాసంగా ఔపోసన చేసేస్తానోయ్ శబాసు శ్రీమాన్ ఏసూ' అంటూ మందుకోసం, సిగరెట్లు కోసం, సరదా కోసం కవిత్వం రాసిన శ్రీశ్రీకి భిన్నకోణాలున్నాయి. ఆయన చణుకులకు కవిత్వ తీవ్రతకు ఏమాత్రం పొంతన లేదు. ప్రాసలు ఎలావున్నా... ప్రయాస మాత్రం ప్రజాహితమే.

తొణకే, విలాపాగ్నులకు, విషాదాశ్రువులకు ఖరుదు ఎవరు కడతారని నిలదీశాడు. కష్టం చాలక కడుపుమంటతో తెగించి సమ్మెలు కట్టేవారిని పలకరించాడు. శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై, నూతిని గోతిని వెతుక్కునే అభాగ్యులను, అనాథలను, అశాంతులను విప్లవ శంఖం పూరించాలని ప్రోత్సహించాడు. కాల్చే ఆకలి, కూల్చే వేద, దారిద్ర్యాలూ, దౌర్జన్యాలను పరిష్కరించే, బహిష్కరించే పాటలు, కవితలు తనవని ప్రకటించుకున్నాడు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యాన్ని దున్నుగా నిలిచాడు. కష్టజీవుల, కర్మ జీవుల సంక్షేమాన్ని కోరాడు.

**కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,**
**జాలరి పగ్గం,**
**సాలె లల మగ్గం,**
**శరీరకష్టం స్ఫురింపజేసే**
**గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,**
**సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు-**
**నా వినుతించే,**
**నా విరుతించే,**
**నా వినిపించే నవీన గీతికి,**
**నా విరచించే నవీన రీతికి,**
**భావం!**
**భాగ్యం!**
**ప్రాణం!**
**ప్రణవం...** అని తన ప్రాధాన్యతలను... ఆలోచనలను... లక్ష్యాలను వివరించాడు. వాటినే ఆచరించాడు. మహాకవిగా వెలిగాడు. తెలుగు సాహితీలోకాన చెరగని ముద్ర.. మలగని జ్యోతి అయ్యాడు. అలాంటి శ్రీశ్రీని ఎవరితో పోల్చినా తప్పే అవుతుంది. శ్రీశ్రీని శ్రీశ్రీతోనే పోల్చడం మినహా రాతగాళ్లకు మరో గత్యంతరం లేదు. సాహిత్య గోదాలో శ్రీశ్రీ అజేయుడు. అక్షరాల లోకంలో అమరుడు. 'ఈ యుగం నాది.. ఇది శ్రీశ్రీ యుగం' అని సగర్వంగా ప్రకటించుకున్న సాహితీ రారాజుకు వర్ధంతికి ఇదో అక్షర నీరాజం.




– బిఎల్

శ్రీశ్రీ మహాకవి. యుగకవి. కానీ, నోబెల్ పురస్కారం మాత్రం రాలేదు. ఎందుకు? ప్రకృతి గురించి అద్భుతంగా వర్ణించినా.. ఓ గొప్ప థ్రిల్లర్‌ను రాసినా.. ఆహ్లాదకరమైన అనుభూతులను అందించినా ఆయనకు తప్పక నోబెల్ లభించి ఉండేది. కానీ, ఆయన వీటిలో ఏ ఒక్క మర్గాన్నీ అనుసరించలేదు. ఆకలి కేకలు రాశాడు. ఖాళీ కడుపులు.. ఎండిన డొక్కల గురించి రాశాడు. సమాజంలో ఉన్న అసమానతపై అక్షర కత్తి దూశాడు. పేదలు ఇంకెంత కాలం పేదగానే ఉండాలని నిలదీశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, సమాజంలోని వాస్తవాలకు అక్షర రూపాన్నిచ్చాడు. మార్పును కోరాడు. ఎదురు తిరగమని తాడిత పీడిత ప్రజలకు సూచించాడు. ఇవన్నీ నోబెల్ ప్యానల్ సభ్యులకు ఎంతమాత్రం రుచించవు. ఆయన వాడిన పదాల్లోని వేడి వారికి పడదు. అసలు శ్రీశ్రీ మాటలకే అర్థం తెలియనప్పుడు, రచనలను కొలవగల పారిమితులు ఎక్కడ? శ్రీశ్రీ వారికి అర్థం కాదు. అందుకే ఆయనకు నోబెల్ రాలేదు.

మహాప్రస్థానంతోపాటు మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలను శ్రీశ్రీ రచించాడు. మహాప్రస్థానం గీతాలన్నీ మార్క్సిజం దృక్పథంతో రాసినవే. కానీ, అప్పట్లో ఆయనకు మార్క్సిజం గురించి తెలియదు. కమ్యూనిస్టు సిద్ధాంతలకూ, ఆయన సత్వఃసిద్ధమైన ఆలోచనలకు జత కలిసిన తీరు అద్భుతం. 'ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను సామాజిక వాస్తవికత అంటారనీ, దీని వెనుక దన్నుగా మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహా యాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది' అని శ్రీశ్రీ స్వయంగా చెప్పుకున్నాడు.

మరణానంతరం తన మృతదేహాన్ని విశాఖపట్నంలోని కింగ్ జార్జి ఆసుపత్రికి ఇవ్వాలని తన వీలునామాలో పేర్కొన్నాడు శ్రీశ్రీ. కానీ, ఆయన కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించలేదు. భౌతిక కాయాన్ని వారు సంప్రదాయం ప్రకారం దహనం చేశారు. చితాభస్మాన్ని వారణానికి తీసుకెళ్లి గంగలో కలిపారు. ఆయన భౌతిక అవశేషాలన్నీ కనుమరుగయ్యాయి. కానీ, తెలుగు సాహిత్యంలో ఆయన వేసిన దారి ఎంతో మందికి ఊతమైంది. శ్రీశ్రీ కవిత్వం కోసమే పుట్టాడు. కవిత్వంతోనే బతికాడు. కొన్ని శతాబ్దాలపాటు నిలిచివుంటే సాహిత్యాన్ని అందించి వెళ్లాడు. శ్రీశ్రీ పేరు వినిపిస్తున్నంతకాలం కవిత్వం వెలుగుతునే ఉంటుంది. సాహిత్యం ఉన్నంత కాలం శ్రీశ్రీ బతికే ఉంటాడు.

## చట్రాల్లో ఇమడని నైజం..

చాలా మంది కవులను వర్గీకరించినట్టు శ్రీశ్రీని ఏదో ఒక పరిమిత చట్రంలో బిగించడానికి వీల్లేదు. ఏ రకమైన సంకెళ్లను తగిలించుకోలేదు. ఏ పరిధుల్లోనూ ఇమడని నైజం శ్రీశ్రీది. కవిత్వం మాదిరిగానే, ఆయన వ్యక్తిత్వం లోనూ ఎన్నో వైరుధ్యాలు. అంతకు మించిన విచిత్రమైన సంఘర్షణలు. ఆయ న హేతుబద్ధంగా ఆలోచిస్తాడు. ఆలోచించినదే చెప్తాడు. చెప్పిందే చేస్తాడు. భేషజాలు లేవు. దాపరికాలు లేవు. అందుకేనేమో, ఎంతో మందికి శత్రువయ్యాడు. ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాడు. శ్రీశ్రీని 'అవకాశ వాది' అన్నారు కొందరు. 'మహాప్రస్థానం తప్ప ఆయన గొప్ప రచనలు చేయలేదు' అని మరికొందరు అక్కసు వెళ్లగక్కారు. ఆయన వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసి, తాబుబోతుగా ముద్రవేసి, హేళన చేసిన వారు... శాపాలు పెట్టిన వారూ లేకపోలేదు. కానీ, వీటిలో వేటినీ పట్టించుకోని మహర్షి శ్రీశ్రీ. అంతటి కర్మయోగి... దార్శనికుడు కాబట్టే..




**పోనీ, పోనీ,**
**పోతే పోనీ!**
**సతుల్, సుతుల్, హితుల్ పోనీ**
**రానీ, రానీ,**
**వస్తే రానీ!**
**కష్టాల్, నష్టాల్,**
**కోపాల్, తాపాల్, శాపాల్, రానీ!**
**వస్తే రానీ!**
**తిట్లూ, రాట్లూ, పాట్లూ, రానీ!**
**రానీ, రానీ!** అంటూ తన పరిస్థితి గురించి తానే చెప్పుకున్నాడు 'కళారవి' గీతంలో.. ఆయన ఆలోచనా ధోరణి ఎవరికీ అంత సులభంగా అర్థం కాదు. ఆయన ఓ అహంకారి.. ఓ అమాయకుడు. ఓ విప్లవ వీరుడు... ఓ పసిబాలుడు. శ్రీశ్రీ ఆలోచనలే జీవితంలో కనిపిస్తాయి. జీవితంలో కనిపించినవే రచనల్లో మెరుస్తాయి. అంతా తనేనని భావించే, తనకంటూ ఏమీ లేని నిస్వార్థపరుడు. సాహితీ కుబేరుడు శ్రీశ్రీ. ఆర్థికంగా కుచేలుడు శ్రీశ్రీ. తన 'ఆత్మకథ'లో ఉన్నది ఉన్నట్టు రాశాడు. తన జీవితాన్ని తెరచిన పుస్తకంలా అందరి ముందూ ఉంచాడు. అంత ఆత్మస్థైర్యాన్ని ప్రదర్శించాడు కాబట్టే 'శ్రీశ్రీ' అయ్యాడు. ప్రాసకు, శ్లేషకు ఆయనను మించిన వారు లేరు. అతి తక్కువ పదాలతో, లోతైన భావాలను చెప్పడంలో ఆయనకు పోటీ ఎవరూ రారు.. 'వ్యక్తికి బహువచనం శక్తి' అనే గొప్ప ఆలోచన శ్రీశ్రీకి తప్ప ఎవరికి సాధ్యం? అందకేనేమో, 'రెండు అక్షరాల' మేరు పర్వతమని పిలుస్తారు. ప్రజలపై.. వారి జీవన విధానాలపై.. వారి ఆలోచనలపై సాహిత్యం ఏ స్థాయిలో బలమైన ముద్ర వేస్తుందో చెప్పడానికి శ్రీశ్రీని రచనలను మించిన ఉదాహరణ లేదు. ఉండదు. తెలుగు వీరుడ్ని నిద్రలేపి, జాతీయ పురస్కారాన్ని అందుకున్న అక్షర శిల్పి శ్రీశ్రీ. తెలుగు సాహిత్య చరిత్రపై, సమవాద కలంతో కలకాలం నిలిచివుండే రుధిర జ్వాలల చెరగని సంతకం చేసిన రచనా తపస్వి శ్రీశ్రీ. నాస్తికుడైన శ్రీశ్రీకి శ్రామికుడే దేవుడు. అభాగ్యులు, అన్నార్తులే ఆప్తులు. ఆయన కవిత్వం సామాన్యుడి కంటి దీపమై మార్గం చూపుతుంది. అదే కవిత్వం దోపిడీని అరికట్టడానికి అగ్నిపర్వతంలా ఫెళ్లున ఉబికి, తిరుగుబాటు లావాతో శరవేగ ప్రవాహనమవుతుంది. పురోగమన భావాలకు పునరుత్తేజం శ్రీశ్రీ. దోపిడీకి తావులేని సామ్యవాద సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తి శ్రీశ్రీ. బానిస సంకెళ్లు తెగిపడే శబ్దం శ్రీశ్రీ. కార్మిక లోక గర్జనలో పదునెక్కిన శక్తి శ్రీశ్రీ. నైలూ నది నగరికతను ప్రశ్నించినా... తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవరని నిలదీసినా.. దోపిడీలు, దౌర్యన్జాలు ఇకపై చెల్లవని సవాళ్లు విసిరినా.. అది శ్రీశ్రీకి మాత్రమే సొంతం. గుప్పెడు అక్షరాలతో అనంతమైన భావా లు ఆయన రచనల్లో నాట్యమాడుతాయి. ఆయన సాహిత్యానికి కన్నీటిని ఉప్పెనగా మార్చే శక్తి ఉంది. శక్తిహీనులను పోరాట యోధులను చేసే స్ఫూర్తి ఉంది. ఆయన రాతల్లో ఆద్రత దాగుంది... విప్లవ వెలుగుజిలుగులు ఉన్నాయి. శ్రీశ్రీ రచనలు నిరంతరం వేగుచుక్కలై మెరుస్తునే ఉంటాయి.

## చైనా సంస్కృతికి నిలువుటద్దం 'టోక్యో స్పైస్'

నైజీరియాకు చెందిన ప్రముఖ రచయిత, చిత్రకారుడు, సంగీతకారుడు, సాంస్కృతిక ఆలోచనాకారుడు ఒన్యేకా న్వెల్యూ తాజాగా రచించిన 'టోక్యో స్పైస్' నవల ప్రపంచవ్యాప్తంగా సాహిత్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. చైనా సంస్కృతికి అద్దం పడుతున్న ఈ నవల హక్కులను జపాన్‌లోని ఒక ప్రచురణ సంస్థ సుమారు 85 మిలియన్ యెన్‌ల భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు వార్తలు రావడంతో దీనిపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ నవల కథ 1887 సంవత్సరంలో జరుగుతుంది. ఆఫ్రికన్ రచయిత న్వెల్యూ జపాన్ చరిత్ర, చైనా సంస్కృతి, కళ, కుటుంబ బాధ్యతలు. నైతిక విలువలను మిళితం చేస్తూ ఈ కథను రూపొందించడం విశేషం. ఇది జపాన్ నేపథ్యంతో ఆయన ప్రణాళిక చేసిన ఆరు నవలల సిరీస్‌లో మొదటి భాగం. కథానాయకుడు 'జెంజిరో ఇటో', టోక్యో ఇంపీరియల్ యూనివర్సిటీలో కాలిగ్రఫీ (అందమైన చేతిరాత కళ) నేర్చుకుంటున్న యువకుడు. ఒక రోజు తన కుటుంబ సభ్యులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని తెలుసుకుంటాడు. అయితే కుటుంబం వద్దకు తిరిగి వెళ్లకుండా, కళను అభ్యసించాలనే నెపంతో చైనాలోని టియాంజిన్ నగరానికి పారిపోతాడు. అక్కడ అతను 'లిన్ రుయో' 'మేయి' అనే ఇద్దరు మహిళలతో పరిచయం పెంచుకుంటాడు. వారి సాన్నిహిత్యంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ప్రయత్నిస్తాడు. అయితే అతను నిర్మించుకున్న జీవితం ఒక అబద్ధం మీద ఆధారపడినది. కాలక్రమంలో ఆ విషయం బయటపడుతుంది. ఫలితంగా అతను తన ఇల్లు, కళ, ప్రేమలు, గౌరవం , భవిష్యత్తు అన్నింటినీ కోల్పోతాడు. వీధుల్లో జీవించాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ నవలలో 'కాలిగ్రఫీ కళ' కేవలం ఒక కళారూపంగా కాకుండా, నిజాయితీ, సిగ్గు, ఆత్మపరిశీలనలకు ప్రతీకగా నిలుస్తుంది. జెంజిరో తన వైఫల్యాలను ఎదుర్కొంటూ, చైనా, జపాన్ సంప్రదాయాలను కలిపిన కొత్త కాలిగ్రఫీ శైలిని సృష్టిస్తాడు. అది అతని ప్రతిభను ప్రదర్శించడానికి కాదు... తన తప్పులను అంగీకరించి, వినయంతో జీవించడానికి చేసిన ప్రయత్నానికి చిహ్నంగా నిలుస్తుంది. చివరికి ఒక బాధాకరమైన ఉత్తరం అతనిని తిరిగి జపాన్‌కు తీసుకువస్తుంది. అక్కడ అతను వదిలివచ్చిన కుటుంబాన్ని, తనలో దాచుకున్న అపరాధ భావనను, తన అసలు వ్యక్తిత్వాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. 'నిజం నుండి పారిపోవడానికి ఉపయోగించిన కళ, చివరికి మనిషిని విముక్తి చేయగలదా?' అనే గంభీరమైన ప్రశ్నను ఈ నవల పాఠకుల ముందుంచుతుంది. ఒన్యేకా న్వెల్యూ భారతదేశంతో కూడా అనుబంధం కలిగిన రచయిత. ఆయన మణిపూర్ విశ్వవిద్యాలయంలో ఆఫ్రికన్ సాహిత్య అధ్యాపకుడిగా పనిచేశారు. ప్రస్తుతం భారతదేశంలోని ఆఫ్రికన్ సెంటర్‌తో అనుబంధంగా ఉన్నారు. జపాన్‌లోని ఒసాకాలో కాలిగ్రఫీ నేర్చుకుంటున్న ఆయన అనుభవం కూడా ఈ నవలకు మరింత ప్రామాణికతను, కళాత్మకతను అందించింది. 'టోక్యో స్పీస్' సాహిత్యం, చరిత్ర, కళ, మానవ మనస్తత్వాన్ని కలిపిన ఒక ఆలోచనాత్మక రచనగా నిలుస్తుంది.




ఈ వారం కవితలు

## రేపటి కాలం మీదే!



బిడ్డా !
ఒంటిగాడవు
ఒంటి రెక్కోడవు
ఎనుకముందు లేనోడవు
అయినోనితోని, కానోనితోని
కొట్లాడబోకు
బాయి లోతు తెలుస్తది కాని
మనిషి లోతు తెల్వదు
ఉరుకులాడితే పనిగాదు
నిదానమే పదానము
ఎయ్యికాళ్ళ జెర్రితోని
ఒంటి కాలోడు గెల్వడు
కన్న కష్టం చేసి
కనిపెంచిన
సీతమ్మ వనవాసం చేసిన
కలువబోయి, కొయ్యబోయి
గంజి తాగి, గట్కతిని
కడుపు చిన్నది చేసుకొని
కండ్లు పెద్దవి చేసుకొని
కాళ్ళు రెక్కలు సున్నం సున్నం చేసుకొని
అయ్యో బిడ్డలు
దిక్కులేనోల్లని
రెక్కలు రానోల్లని
నోరు పెండ చేసుకొని
పచ్చినీల్లు తాగి పెంచిన
ఏ పని చేసినా
మంచి సెడు ఆలోసించుకో
ఏ పుట్టలో ఏ పామున్నదో
పదిమందిని ఇసారించి
పదిమందిని కల్పుకొని చెయ్యి
ఓడిపోతే ఏడ్వద్దు
దస్కు తినొద్దు
అది రండబతుకు
గుండెకాయ రాయి చేసుకోవాలె
రణ రంగంల దూకాలె
నేను సెప్పినంత సెప్పిన
ఇగ నీఇష్టం నీ రాజీ
నీ మన్ మాని చెయ్యి
నీ బుద్ధి నీ గ్యానం
మావి ఎనుకటి బతుకు
ఎడ్డి బతుకు
మా కాలం అయిపోయింది
రేపటికాలం మీదే

– శోభరమేష్
8978656327

### మంజమ్మ జోగతి జీవితాన్ని ఆవిష్కరించిన

## 'డాన్స్ లైక్ ఎ ట్రాన్స్'

గ్రామీణ కర్ణాటకలో జన్మించిన మంజమ్మ (మంజునాథ్) జోగతి, అనంతరం ప్రముఖ జానపద కళాకారిణిగా ఎదిగి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న జీవిత గాథను కొత్త పుస్తకం మన కళ్ల ముందు ఆవిష్కరిస్తున్నది. దివంగత రాఘవ చినివార్ రచించిన 'డ్యాన్స్ లైక్ ఎ ట్రాన్స్: ఫ్రం జోగతి టు పద్మశ్రీ' ఈ పుస్తకం, మంజా బాల్యం పేదరికం, కుటుంబ సమస్యలు, సామాజిక వివక్ష, అలాగే పెరుగుతున్న ఒంటరితన భావనతో ఎలా గడిచిందో తెలియజేస్తుంది. చిన్నప్పటి నుంచే మంజా తన చుట్టూ ఉన్న అబ్బాయిలకంటే భిన్నంగా భావించేవాడు. సహజంగానే స్త్రీత్వం వైపు ఆకర్షితుడయ్యాడు. ఈ మార్పులను, అతను ఎదుర్కొన్న బాధలను అతిశయోక్తిగా చూపకపోవడం ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ. మంజా చిన్ననాట ఎదుర్కొన్న అయోమయం, ఒంటరితనం, తిరస్కరణలను వాస్తవికంగా చిత్రిస్తుంది. ఈ పుస్తకంలో మంజా, అతని తల్లి అవ్వ మధ్య ఉన్న అనుబంధానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అవ్వను పరిపూర్ణ తల్లిగా ఎవరూ భావించకపోయినా, తన బిడ్డపై ఆమెకు ఉన్న ప్రేమ, ఆప్యాయత పుస్తకం అంతటా పలుమార్లు ప్రతిఫలిస్తూ, అత్యంత హృద్యమైన ఘట్టాలకు కారణమవుతుంది. నియోగి ప్రచురించిన ఈ పుస్తకంలోని మరో ముఖ్యాంశం 'విశ్వాసం' గురించిన పరిశీలన. మతం, ఆధ్యాత్మికత మంజమ్మ జీవితంలో, వ్యక్తిత్వంలో ఎంతో లోతుగా ముడిపడి ఉన్నాయని ఇందులో వివరించారు. దైవ సంకేతాలు, స్థానిక దేవతలు, ఆచారాలు, జానపద విశ్వాసాలు కేవలం నేపథ్య అంశాలు కాకుం డా, ప్రజల నిర్ణయాలు, వారి దృక్పథాలను ప్రభావితం చేసే క్రియాశీల శక్తులుగా కథనంలో ప్రతిబింబిస్తాయి. నాటకం, ప్రదర్శన కళలకు సంబంధించిన భాగాలు కూడా ఇందులో ఉన్నాయి. వేదికపై ప్రదర్శనల ద్వారానే మంజా ఆత్మవిశ్వాసాన్ని, జీవిత లక్ష్యాన్ని, తనకంటూ ఒక స్థానాన్ని కనుగొనడం ప్రారంభించాడు. 'డ్యాన్స్ లైక్ ఎ ట్రాన్స్' కేవలం జీవిత చరిత్ర మాత్రమే కాకుండా, ఒక వ్యక్తి తన నిజమైన స్వరూపంతో గుర్తింపు పొందాలని, అంగీకారం సంపాదించాలని, ప్రేమించబడాలని కోరుకునే విశ్వవ్యాప్త ఆకాంక్ష గురించి చెప్పే కథ. ఇది మూస ధారణలను సవాలు చేస్తూ, అవగాహనను విస్తరించి, మానవ ఆత్మ యొక్క దృఢత్వాన్ని వేడుకగా జరుపుకుంటుంది. మంజమ్మగా మారిన మంజునాథ్‌కు 2021లో పద్మశ్రీ పురస్కారం లభించింది. అతని (ఆమె) జీవితం ఆధారంగా నవలను రాసిన రాఘవ, ఆతర్వాత కొద్దికాలానికే ఒక ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. భౌతికంగా దూరమైనప్పటికీ, సాహితీ ప్రపంచానికి ఒక గొప్ప రచనను అందించారు. 'మంజమ్మ జోగతి యొక్క అసాధారణ జీవితాన్ని, అలాగే భారతదేశ ట్రాన్స్‌జెండర్ సమాజ చరిత్ర, పోరాటాలు, వారి దృఢ సంకల్పాన్ని లిఖితబద్ధం చేయడానికి రాఘవ పూర్తిగా అంకితమయ్యారు. అయితే పూర్తయిన పుస్తకాన్ని తన చేతుల్లో పట్టుకునే అవకాశం ఆయనకు దక్కపోవడం దురదృష్టకరం.



# పుస్తక సమీక్ష

## విలక్షణమైన 'దారి చూపే కథలు'

కథలు రాయడమంటే కేవలం అక్షరాల కూర్పు లేదా పేర్పు మాత్రమే కాదు. దృశ్యమాత్రంగా కళ్ల ఎదురుగా కనిపించే మానవీయ, అమానవీయ, సామాజికార్థిక మత రాజకీయాంశాలను మనోనేత్రంతో విశ్లేషించుకుని, వాటిని ధారాశుద్ధి కలిగి, పాఠకులచేత ఏకబిగిన చదివించగలిగేలా రాయగలిగే ఒక వీక్షణమైన రచనా ప్రక్రియ కథ. దారి తెలిసిన మేఘంలోని ఇరవై కథలను చదివినప్పుడు బద్రి నర్సన్ మంచి కథకుడు, భవిష్యత్తులో మరింత చేవ దేరిన కథకుడుగా రూపుదిద్దుకోగలరని అనిపిస్తుంది. ఈ కథకుని వస్తు సేకరణ పద్ధతి విలక్షణమైనదేమీ కానప్పటికీ సాంప్రదాయ పద్ధతిలోనే విలక్షణతను సూదంటురాయిలా వెతికి పట్టుకోగలడన్న నమ్మకాన్ని పాఠకులకు అందించడంలో కృతకృత్యులయ్యారనే చెప్పవచ్చు. ఈ రచయిత ఒక కథాంశాన్ని అనుకున్న తరువాత దానికి సంబంధించిన అనేక గత, వర్తమాన సంఘటనల తాలూకు ప్రతిఫలనాలను సునిశితంగా పరిశోధించి, నిగ్గు తేల్చుకున్న తరువాత వాటిని తన కథా రచనా ప్రక్రియలో ఎంతో విలక్షణంగా వాడుకున్నారు. దాని ఫలితంగా పుస్తకం పట్టు కున్న ప్రతి పాఠకుడూ చివరికంటా ఏకబిగిని చదివేలా చేయగలిగారు. ఈ సంపుటికి శీర్షికగా పెట్టిన కథ 'దారి తెలిసిన మేఘం' కథాంశానికి వస్తే సుజనరెడ్డి అనే ఓ యువతి జెఎన్‌యూలో రీసెర్చ్ చేయడానికి ఇంటర్వ్యూ కోసం హైదరాబాద్ నుండి ఢిల్లీ వెళుతుంది. అక్కడ తనలాగే లక్నో నుండి వచ్చిన సలీంతో పరిచయం ఏర్పడుతుంది. ఆ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. సుజన ఆహ్వానంపై హైదరాబాద్ చూడడానికి వచ్చిన సలీం వాళ్ళ ఇంట్లోనే దిగుతాడు. అప్పటికే సుజన తమ్ముడు విక్రమ్ మత సంబంధ సంస్థ ప్రభావంలో పడి తీవ్రమైన ముస్లీమ్ ద్వేషిగా తయారవుతాడు. అటువంటి విక్రమ్ తన ఇంట్లో దిగిన సలీమ్ మనసు నొచ్చుకునేలా ప్రవర్తిస్తాడు. దాంతో సలీం బయటకు వెళ్ళిపోతాడు. సుజన కూడా సలీంతో పాటే ఢిల్లీకి వెళ్ళిపోతుంది. మనిషితనం మరిచిన తన వాళ్ళ కన్నా, ఒక మనిషిగా తనను ఆమోదించిన సలీంతో జీవితం పంచుకోవాలనే సుజన నిజంగానే 'దారి తెలిసిన మేఘం'గా పాఠకుల మనసుల్లో నిలిచిపోతుంది. మరో కథ 'జానకి విముక్తి' గురించి చెప్పక తప్పదు. ఎందుకంటే వేశ్యలను ప్రధాన పాత్రలుగా చేసుకొని పుంఖాను పుంఖాలుగా కథలు, నవలలు రాసిన రావిశాస్త్రిని తలపింపజేస్తూ బద్రి నర్సన్ రాసిన కథ ఇది. చీకటి వృత్తిలో సమిధలైపోతున్న అక్కా చెల్లెళ్ల లాంటి ఇద్దరు స్త్రీల దయనీయ కథ ఇది. వారి పేర్లు జానమ్మ, దీప. జానమ్మ భర్త బానయ్య రోడ్డు ప్రమాదంలో మరణిస్తాడు. అప్పటి నుండి వాళ్ళ గుడిశ పక్కనున్న దీప, ఆవిడ భర్త ఇస్తారి జానమ్మను ఆదుకుంటుంటారు. దీప చెల్లెల్ని కూడా పెండ్లి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో.. ఇస్తారి గర్భవతి అయిన దీపను విపరీతంగా చిత్రహింసలు పెడుతుంటాడు. ఆ హింసను చూసి చూసి ఇక భరించలేక జానమ్మ ఓ రాత్రి, నిద్రపోతున్న ఇస్తారి తలను పెద్ద బండతో మోది చంపేస్తుంది. ఆ నేరం దీప మీద పడుతుంది. జైల్లో దీపకు వీరమ్మ అనే మరో ఆడ ఖైదీ పరిచయం అవుతుంది. జైల్లోనే దీపకు ఓ ఆడపిల్ల పుడుతుంది. ఆ తల్లీ బిడ్డలను వీరమ్మ జాగ్రత్తగా చూసుకుంటుంటుంది. ముందుగా వీరమ్మ, తర్వాత దీప శిక్షాకాలం ముగియడంతో కూతురుతో పాటు దీప నేరుగా వీరమ్మ ఇంటికి చేరుతుంది. వీరమ్మ కులవృత్తి అయిన ఇస్త్రీ పని మీద ఇద్దరి బ్రతుకులూ హాయిగా నడుస్తుంటాయి. కొన్నాళ్ళకు వీరమ్మ దీపిక ఇద్దరూ కలిసి, దీప బిడ్డను బడిలో చేర్పించడానికి తీసుకెళతారు. అప్పటిదాకా పేరు కూడా పెట్టకుండా 'బుజ్జమ్మా!' అంటూ పిలుచుకుంటున్న పాపకు స్కూల్లో జానమ్మ పేరు రాయిస్తారు. ఇక కులం దగ్గరికి వచ్చే సరికి వీరమ్మ తన కులం పేరు రాయిస్తుంది. అట్లా తన బిడ్డకు పేరు, కులంతో పాటు పాపకూపంలోంచి విముక్తి లభించిన సంతోషంతో దీప ముఖం వెలిగిపోతుంది అంటూ కథ ముగుస్తుంది. ఇలాంటి మరిన్ని మంచి కథలను బద్రి నర్సన్ భవిష్యత్తులో కూడా అందించాలి.

– శిరంశెట్టి కాంతారావు




# బిజెపి, ఇసి కలిసి ఓటు చోరీ

తెలంగాణలో కూడా ఓటు చోరీ చేసే అవకాశం

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో బిజెపి ఎన్నికల కమిషన్‌లు కలిసి ఓట్ చోరీకి పాల్పడుతున్నాయని, అప్రజాస్వామికంగా దేశంలో బిజెపిఅధికారంలోకి వస్తుందని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లు విమర్శించారు. దేశంలో సర్ పేరుతో ఓట్ల పరిశీలన చేపట్టి కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను చోరీ చేసి దొంగతనంగా రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో కూడా ఓట్ చోరీ చేసే అవకాశం ఉందని, నియోజక వర్గాలలో నాయకులు చాలా అప్రమతంగా ఉండాలని, బిఎల్‌ఎలు ఓట్ మ్యాపింగ్‌ను లోతుగా పరిశీలించి ప్రతి నిజమైన ఓట్‌ను కాపాడాలని వారు సూచించారు. ఓటరల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై టిపిసిసి జూమ్ మీటింగ్ నిర్వహించింది. సర్‌పై మహేష్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రి పొన్నం ప్రభాకర్, ట్రైనింగ్ సెల్ చైర్మన్, ఎంఎల్‌ఎ రామ్మోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పలువురు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఓటర్ మ్యాపింగ్, సర్ జరిగే విధానం, బిఎల్‌ఎలు చేయాల్సిన పనులు, బిఎల్ఓ చేస్తున్న పనులపై నిఘా, ఓటర్ మ్యాపింగ్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు తగిన సూచనలు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంత శాతం ఓటర్ మ్యాపింగ్ జరిగింది, మిగతా ఓటర్ మ్యాపింగ్‌లో ఓట్ కోల్పోయిన వారిని గుర్తించి వారికి తిరిగి ఓట్ హక్కు కల్పించే అంశాలపై వివరించారు. ఓటును కనుక తొలగిస్తే వెంటనే తగిన ఆధారాలతో వాటిని తిరిగి దరఖాస్తు చేయించి పునరుద్ధరణ జరిగేలా చూడాలని సూచించారు. రానున్న ఎన్నికలు చాలా కీలకంగా ఉన్న దృష్ట్యా ప్రతి ఒక్క ఓటును కాపాడుకోవాలని అన్నారు. జూమ్ మీటింగ్‌లకు కోఆర్డినేటర్‌గా నాయకులు గంప వేణు గోపాల్ వ్యవహరించగా ఎన్నికల కమిషన్ కు సంబంధించిన వివరాలను టిపిసిసి ఎలెక్షన్ కమిషన్ చైర్మన్ రాజేష్ వివరించారు.

# 20వ శతాబ్దపు నిప్పు కణం చేగువేరా

ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 20వ శతాబ్దపు నిప్పు కణం, విప్లవ ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత ఎర్నెస్టో చే గువేరా ఆశయాలను నేటి విద్యార్థి, యువత ఆచరణలో పెట్టి తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. చే గువేరా పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులు, యువత విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక అసమానతలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం చే గువేరా 98వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ చే గువేరా పేరు వినగానే యువతలో చైతన్యం, పోరాట స్ఫూర్తి ఉప్పొంగుతుందని పేర్కొన్నారు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియోలో జన్మించిన చే గువేరా, వైద్య విద్యను అభ్యసించిన అనంతరం లాటిన్ అమెరికా ప్రజల దుస్థితిని ప్రత్యక్షంగా చూసి విప్లవ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. 1955లో ఫిడెల్ క్యాస్ట్రోతో పరిచయం ఏర్పడి క్యూబా విప్లవంలో కీలక పాత్ర పోషించారని, అనంతరం క్యూబా ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. తరువాత బొలీవియాలో ప్రజల విముక్తి కోసం గెరిల్లా ఉద్యమానికి నాయకత్వం వహించిన చే గువేరాను 1967 అక్టోబర్ 9న కుట్రపూర్వకంగా హత్య చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్, జిల్లా కార్యదర్శి చైతన్య యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లెనిన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో..
# నేడు 'సర్'పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈనెల 25 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నేడు రాష్ట్ర అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక్ భవన్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ సదస్సుకు వక్తలుగా ప్రముఖ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ నాగేశ్వర్, డీన్ స్కూల్ ఆఫ్ లా ద మహేంద్ర యూనివర్సిటీ, కేంద్ర సమచార కమిషన్ మాజీ సభ్యుడు మాడభూషి శ్రీధర్ పాల్గొననున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

# ద్రవ్యోల్బణంలో తెలంగాణ 'టాప్'

సామాన్యుడిపై ధరల భారం

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నుండి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. ''తెలంగాణలో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ద్రవ్యోల్బణం రేటు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గత 8 నెలలుగా జాతీయ ద్రవ్యోల్బణ సగటు కంటే తెలంగాణలో దాదాపు 70 శాతం అదనంగా ద్రవ్యోల్బణం నమోదు కావడం గమనార్హం. ఈ ధరల పెరుగుదల వల్ల రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి, కార్మిక వర్గాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా జాతీయ ద్రవ్యోల్బణ సగటు 3.93 శాతంగా ఉంది. కానీ తెలంగాణ విషయానికి వస్తే, రాష్ట్ర సగటు ఏకంగా 6.15 శాతంగా నమోదైంది. ఇందులోనూ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల (5.81 శాతం) కంటే గ్రామీణ తెలంగాణలో ద్రవ్యోల్బణం 6.59 శాతంతో అత్యధికంగా ఉండటం గమనార్హం. దీన్ని బట్టి పల్లెల్లో నివసించే ప్రజలపై ధరల భారం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధరల కట్టడికి, సామాన్యులను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి'' అని నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. రవాణా ఖర్చులు తగ్గి ధరలు అదుపులోకి రావాలంటే ప్రస్తుతం డీజిల్‌పై ఉన్న 27 శాతం వ్యాట్‌ను 10 శాతాని కి తగ్గించాలన్నారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడానికి, అక్రమ నిల్వలను అరికట్టడానికి ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలను మొబైల్ వాహనాల (సంచార వాహనాలు) ద్వారా నేరుగా ప్రజలకు అందుబాటు ధరల్లోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పక ముందే ప్రభుత్వం ఈ సూచనలను పరిశీలించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో..
# బిసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

బిసిఐ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమం సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని బిసి సమాజ హక్కులు, రాజకీయ సాధికారత కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం (బిసిఐ) పిలుపునిచ్చింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, వనరులపై నియంత్రణ, బడ్జెట్‌లో వాటా, రాజకీయ అధికారం సాధించడమే లక్ష్యంగా హిస్సా–ఇజ్జత్–హుకూమత్ నినాదంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని నాయకులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బిసిఐ విస్తృత స్థాయి రాష్ట్ర సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసిఐ వ్యవస్థాపక అధ్యక్షుడు చిరంజీవులు మాట్లాడుతూ, గత ఎనిమిది దశాబ్దాలుగా బిసిలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. బిసిలు సంఘటిత శక్తిగా ఎదిగి రాజ్యాధికారాన్ని సాధించాల్సిన అవసరం ఉందని, రాజకీయ అధికారం లేకుండా ఏ సమాజమైనా తన అస్తిత్వాన్ని, అభివృద్ధిని కాపాడుకోలేదని అన్నారు. సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ బెనర్జీ అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ విజయ్ బాబు, ప్రొఫెసర్ సాయిలు, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ ప్రసాద్ గౌడ్ ప్రొఫెసర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. బిసి ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, భావజాల ప్రచారం, శిక్షణా కార్యక్రమాలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల కమిటీల సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర కన్వీనర్లుగా చెన్న శ్రీకాంత్, అవ్వారు వేణు, ఎర్రమాడ వెంకన్న, లింగేష్ యాదవ్‌లను నియమించగా, ప్రొఫెసర్ బెనర్జీని రాష్ట్ర వైస్ చైర్మన్‌గా, ప్రొఫెసర్ విజయ్ బాబును పొలిటికల్ అడ్వైజర్‌గా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో బిసి ఉద్యమ విస్తరణ, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కమిటీ వెల్లడించింది.

# స్వచ్ఛంద రక్తదాన సేవలకు గుర్తింపు



డాక్టర్ రాజేశ్వర్‌రావుకు గవర్నర్ సత్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కలిగిస్తూ, స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ విశిష్ట సేవలందించిన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా రెడ్‌క్రాస్ శాఖ చైర్మన్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒఎస్‌డి డాక్టర్ ఎస్.ఎం. రాజేశ్వర్ రావును తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సత్కరించి పురస్కారాలు అందజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. అనంతరం విశిష్ట సేవలందించిన వైద్యులు, అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద భారత రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖకు విశేష సహకారం అందించిన సంస్థల ప్రతినిధులను గవర్నర్ సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్, శాంతిభద్రతల విభాగం డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ ప్రధాన కార్యదరి, ప్రొఫెసర్ శ్రీరాములు, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, లార్వెన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ విహార్, సిఇఒ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మీనాక్షినటరాజన్ నిజాయితీగల మనిషి

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్‌లో ఉన్న కొంత మంది వ్యక్తుల్లో మీనాక్షి నటరాజన్ కూడా నిజాయితీగల మనిషి అని, ఆమె రాహుల్ గాంధీకి నమ్మిన బంటు అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. మీనాక్షి నటరాజన్‌పైన సిఎం రేవంత్ రెడ్డి కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్,ఎంఎల్‌ఎ డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్‌కు టిక్కెట్ రాకుండా అడ్డుకోవడంతో పాటు ఆమెపైన తప్పుడు కేసులు పెట్టించారని, ఇది సిఎం రేవంత్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన 'అట్టర్ ఫ్లాప్'అని అన్నారు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయని , ఈ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి, మళ్లీ బిఆర్‌ఎస్‌ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25 నుంచి జూలై 31వరకు జరిగే ఎస్ఐఎస్ (సమగ్ర ఇంటింటి సర్వే) నమోదులో ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో డిజిటల్ పద్ధతిలో నిర్వహించాలని, త్వరలోనే కొత్త కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

**యువత రాజకీయాల్లోకి రావాలి: కెటిఆర్**

యువత రాజకీయాల్లోకి రావాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జెన్‌జి యువతలు ఆదివారం కెటిఆర్‌ను కలిశారు. పార్టీ కార్యాలయంలోని తన బృందంతో కలిసి పనిచేసేందుకు అవకాశం కల్పిస్తామని వారికి కెటిఆర్ హామీనిచ్చారు. రాజకీయ ప్రయాణంలో తగిన సూచనలు, మద్దతు అందిస్తామన్నారు.

# మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

నిరుద్యోగ యువతకు ఎంపి అనిల్ యాదవ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న గాంధీభవన్‌లో భారీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపి అనిల్‌యాదవ్ తెలిపారు. దాదాపు 100 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన అనిల్ యాదవ్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రంగాల్లో లక్ష మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు.

విద్యార్థులు, యువత భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేపర్ లీకేజీలను అరికట్టడంలో విఫలమై విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలను కూడా కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బిజెపి నేతలు సంబరాలు చేసుకుంటున్నారని, అయితే దేశానికి ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధికి నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావులు చేసిన కృషికి పేర్లు మార్చి మోదీ భజన చేస్తున్నారని విమర్శించారు.

ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పై కూడా అనిల్ యాదవ్ విమర్శలు గుప్పించారు. కెటిఆర్ కుటుంబంలో అందరూ వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని, ఎవరు ఎవరికి వెన్నుపోటు పొడుస్తున్నారో ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

# నన్ను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'నన్ను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద ఇంకా పుట్టలేదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి తనను తరిమికొడతామని వ్యాఖ్యానించారని, తాను బిఆర్‌ఎస్ కార్యకర్తను కాదని, బిజెపి కార్యకర్తనని అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో ఆదివారం నిర్వహించిన బిజెపి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, ఎన్నికల హామీల అమలు, మెట్రో రైలు ప్రాజెక్టు తదితర అంశాలపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుపై స్పందించిన ఆయన, మొదటి దశకు కేంద్ర ప్రభుత్వం గణనీయమైన నిధులు అందించిందని తెలిపారు. రెండో దశకు కూడా కేంద్రం ఆమోదం తెలిపి 50 శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు అర్థం లేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా సమాధానం చెప్పాలని, అవసరమైతే రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీలు ప్రజా సమస్యల విషయంలో ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఆటను మొదలు పెట్టారని, 2028లో ఈ ఆటను బిజెపి ముగిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

* మహిళను తప్పించపోయి.. ముగ్గుర్ని ఢీకొట్టిన కారు

* ముగ్గురు మృతి..దుద్దేడలో విషాదం

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దేడ శివారులో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరు మహిళలతో పాటు బాలిక మృత్యువాతపడింది. స్థానికుల కథనం కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. శనివారం రాత్రి కరీంనగర్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు దుద్దేడకు చేరుకోగానే రోడ్డు దాటుతున్న రాధమ్మ (60) ను తప్పించే యత్నంలో కారు అదుపుతప్పి రాధమ్మ ఢీకొట్టింది. అలాగే కారు అలాగే ముందుకు దూసుకెళ్లి రోడ్డు ప్రక్కన ఉన్న ఇంటిముందు అరుగుపై కూర్చోని కబుర్లు చెప్పుకుంటున్న మరో ఇద్దర్ని ఢీకొట్టింది. ఇందులో ఎరుకల లచ్చమ్మ (60) అనే మహిళ మృతిచెందగా 10 ఏండ్ల బాలిక కొద్ది దూరంలో ఎగిరి పడింది. ఆమె తలకు బలమైన గాయమైంది. బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

**వేసవి తాపానికి ఆరుబయట కూర్చుంటే.. కబళించిన మృత్యువు**

వేసవి తాపం ఎక్కువ ఉండటంతో ఆరుబయట చల్లగా ఉంటుందని వృద్ధురాలుల ఎరుకల లచ్చమ్మతో పాటు బాలిక ఇంటి ముందు అరుగుపై కూర్చోని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంతలో మృత్యు రూపంలో వచ్చిన కారు రోడ్డుపై మహిళను తప్పించపోయి లచ్చమ్మ ఇంటివైపు దూసుకొచ్చి దీంతో లచ్చమ్మతో పాటు బాలిక మృతిచెందారు.



# ఫేక్ ఆడియో క్లిప్.. రాజకీయ కుట్రలో భాగమే

షబ్బీర్ అలీ స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై ప్రచారంలో ఉన్న ఆడియో క్లిప్ పూర్తిగా నకిలీ, మార్ఫింగ్ చేసినదని, రాజకీయ కుట్రలో భాగంగానే దాన్ని సోషల్ మీడియా ద్వారా వైరల్ చేశారని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఈ మేరకు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికికి వివరణ లేఖ పంపారు. టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహష్‌కుమార్‌గౌడ్ లేదా కాంగ్రెస్ మహిళా నాయకులపై తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 54 సెకన్ల ఆడియో క్లిప్‌ను ఆధునిక వాయిస్ క్లోనింగ్, కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసి, ఫోరెన్సిక్ విచారణ కోరినట్లు తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయడం, కాంగ్రెస్ పార్టీలో విభేదాలు సృష్టించడమే లక్ష్యంగా ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. నకిలీ ఆడియోను సృష్టించి, ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటానని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు.

ఆయన గత 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్నానని, పార్టీ నాయకత్వం, క్రమశిక్షణ, విలువలకు కట్టుబడి ఉంటానని లేఖలో పేర్కొన్నారు.



## మైనర్ల రక్షణలో మహిళా పోలీసుల కీలకం

### పోక్సోచట్టంపై మహిళా కానిస్టేబుళ్లకు అవగాహన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మైనర్ బాలికలను రక్షించడంలో మహిళ పోలీసుల పాత్ర చాల కీలకమైనదని హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహిళ కానిస్టేబుళ్లకు ఫోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ చరమందరాజు, ఎస్ఐ నరేష్ లు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ పోక్సో చట్టంలోని నిబంధనలను క్షుణంగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో బాలికలకు చట్టాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు పోలీస్ భరోసా కార్యక్రమం ద్వారా భద్రత అంశాలు, ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మహిళ కానిస్టేబుళ్లు ఎలా వ్యవహరించాలి, బాధితులకు ఫిర్యాదులను స్వీకరించేటప్పుడు పాటించాల్సిన మర్యాదపూర్వక పద్దతులు, జనరల్ డైరీ ఎంట్రీలు నమోదు చేయడం, ప్రజలతో మమేకమైవారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమాజంలో బాధ్యతయుతమైన పోలీస్ సిబ్బందిగా పనిచేస్తూ, మమిళలు, బాలికల రక్షణకు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలను మంటగల్పుతున్న బిజెపి ప్రభుత్వం

### బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/కోదాడ:** దేశంలోని అన్ని వర్గాల హక్కుల పరిరక్షణకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ విలువలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కుట్రలు, కుతంత్రాలతో మంటగల్పుతుందని అందుకు సాక్షి భూతంగా అనేక ఉదహారణలు ఉన్నాయని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం కోదాడ ఎఆర్ఆర్ ఫంక్షన్ హల్‌లో ప్రత్యేక ఓటర్ బాధ్యత, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో సర్ పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగించేందుకు కుట్రలకు తెరలేపాయని విమర్శించారు. ఇప్పటి వరకు దేశంలో ఐదు రాష్ట్రాల్లో సర్ ప్రక్రీయ జరిపితే పశ్చిమబెంగాల్ కేరళ, పాండిచ్చేరి తమిళనాడులలో లక్షల ఓట్లు తొలగించి, బిజెపి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. బిజెపి అధికారంలో ఉన్న అస్సాం రాష్ట్రంలో మాత్రం సర్ నిర్వహించలేదని ఆరోపించారు. 2028లో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైన అధికారంలోకి రావాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్, బిజేపిలు కుమ్మక్కై తెలంగాణలో ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓట్లు తొలగించాలని కుట్ర చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మిర్యాలగూడెం మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతి లేని కెఎన్ఎమ్ వంగడాల సాగుతో రైస్ ఇండస్ట్రీకి తీవ్ర నష్టం

### మార్కెట్ డిమాండ్ ఉన్న సన్న రకాలపైనే రైతులు దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మార్కెట్‌లో ధర తగ్గించి విక్రయించినా వినియోగదారులు కొనేందుకు ముందుకు రాని కేఎన్ఎమ్ 12510 రకం వరి ధాన్యాన్ని ప్రస్తుత సీజన్ లో కొనుగోలు చేసే పరిస్థితి లేదని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ తక్కువ రోజుల్లో పంట చేతికి వస్తుందనే ఉద్దేశంతో సాగు చేస్తున్న కేఎన్ఎమ్ రకంలో వైట్ బెల్ట్ ఎక్కువగా ఉండి, వండేటప్పుడు అన్నం నాణ్యత దెబ్బతింటోందని మార్కెట్ వర్గాల ద్వారా తేలిందన్నారు. వ్యవసాయ అధికారులు ధృవీకరించని ఇటువంటి విత్తనాలను విక్రయించడం వల్ల గత సీజన్ లో ధాన్యం కొన్న మిల్లుల యాజమాన్యాలు ఆర్థికంగా నష్టపోయారని గుర్తు చేశారు. రైతులు మిల్లర్ల ఇబ్బందులను గమనించి, మార్కెట్ లో మంచి అమ్మకాలు సాగుతున్న జై శ్రీరామ్, జెఎస్ఆర్, హెచ్ఎంటి, చింట్లు రకాల వైపు మొగ్గు చూపడం వల్ల అన్ని రంగాలకు మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. రైతులు సమగ్ర అవగాహనతో నాణ్యమైన సన్న రకాలనే పండించి తమకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెంకటరమణ చౌదరి (బాబి), వైస్ ప్రెసిడెంట్ గోళ్ళ రామశేఖర్, సెక్రటరీ పోలిశెట్టి ధనుంజయ, ట్రెజరర్ గందె రాము, జిల్లా నేత డాక్టర్ బండారు కుశలయ్య, రైస్ మిల్లుల అధినేతలు జైయినిమురళి, లిమిటెడ్ రేపాల అంతయ్య, ఇనుగుర్తి మోహన్ రావు, గుడగంట్ల గణేష్, గార్లపాటి మధు, గార్లపాటి మట్టపల్లి, గుంటి గోపి, ఇల్లందుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తోటి కూలీ కుటుంబానికి అండగా ఉపాధి కూలీలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన వర్రె అయిలమల్లు ఉపాధి హామీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూన్ 04వ తేదిన రోజు వారిగానే ఉపాధి హామీ పనులకు వచ్చిన అయిలమల్లు మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో చాతిలో నొప్పి కారణంగా ఇంటికి వెళ్ళాడు ఇంటికి వెళ్ళిన కొద్ది సేపటికే అయిలమల్లు మరణించడం జరిగింది. ఆదివారం తోటి ఉపాధి హామీ కూలీలు అయిలమల్లు ఇంటికి వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి అయిలమల్లు భార్య కవితకు రూ. 10వేలను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూలీ సంఘం నాయకులు చంద్రయ్య, వికలాంగుల హెల్పింగ్ సొసైటి ఫౌండర్ రమేష్, శ్రమ మిత్ర సహయకుడు పురుషోత్తం, మేట్స్ మాధవి, శ్వేత, రేణుక, రజిని, సుజాత తదితరులు ఉన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

### లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి: ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని ఏఐటియుసి జిల్లా కార్యాలయం జరిగిన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక వర్గాలు కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోడీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని ఆయన ఆరోపించారు.ఎన్‌డిఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల క్రింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోడీకి కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం తెలియదని ఆయన తెలిపారు.44 కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకు రావడం కార్మికులకు శాపంగా మారాయని అన్నారు.పాలకులు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడం వల్ల కార్మికులు మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. జులై 19వ తేదీన నల్లగొండ జిల్లా ఏఐటీయూసీ మహాసభ గుర్రంపోడ్‌లో జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధ్యక్షులు కె ఎస్ రెడ్డి,పాణెం వెంకట రావు సహాయ కార్యదర్శులు దోటి వెంకన్న, వెంకటేష్,నరసింహ,అమీర్,వి లెనిన్, వెంకట్రాములు,ఎండి జానీ పెదనర్సింహ,బెల్లం శివయ్య,ఏ మల్లయ్య పాల్గొన్నారు.



## రక్తదాన ఉద్యమంలో నల్లగొండ జిల్లా ఆదర్శం: గవర్నర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లోక్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు.నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన రక్తదాన అవగాహన ర్యాలీని ప్రారంభించిన గవర్నర్,అనంతరం లోక్ భవన్ సంస్కృతి హాల్‌లో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రక్తదాతలకు మెమొంటోలు,ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు.జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,యూత్ వాలంటీర్లు రక్తదాతలను ప్రోత్సహించారు.ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు,సామాజిక సేవా కార్యక్రమాలు,మానవతా సేవల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రక్తదాన ఉద్యమంలో నల్లగొండ జిల్లా ఆదర్శం అని పెర్కొన్నారు. సంస్థ కార్యకలాపాలను అభినందిస్తూ జిల్లా చైర్మన్‌తో పాటు మేనేజింగ్ కమిటీ సభ్యులను ప్రశంసించారు.డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్,జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో జిల్లాలో నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించేందుకు రెడ్ క్రాస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి రక్తదాతకు రెడ్ క్రాస్ తరపున కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

# బిఎల్‌ఒల పాత్ర అత్యంత కీలకం

### ఓటర్ జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి
### బిఎల్ఒలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ వెన్నముక అని, ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటర్ జాబితాలో పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడ పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హల్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 శిక్షణ శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ లెవల్ ఏజెంట్లు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలో ప్రక్రీయలో బిఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. బూత్ పరిధిలో కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు వలస వెళ్లి తిరిగి వచ్చిన కుటుంబాలు తదిత వివరాలను గుర్తించి వారి పేర్లు జాబితాలో నమోదు చేయించి బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు పేర్ల తొలగింపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు, లోపాలు లేకుండా ప్రతి బూత్ స్థాయిలో, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, దరఖాస్తుల ప్రక్రీయ, ఫారంల వినియోగం, అభ్యంతరాల నమోదు తదితర అంశాలపై శిక్షణలో నిపుణులు బిఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిబిరంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే రామమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, టిపిసిసి డెలికేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్నేహితులు నిర్వహించిన వీకెండ్ పార్టీలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం గ్రామ పరిధిలో ఓ ఫామ్ హౌజ్‌లో నిర్వహించిన వీకెండ్ పార్టీలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రైవేట్ 15 మంది ఉద్యోగుల వీకెండ్ సందర్భంగా కొయ్యలగూడెం సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌కు వచ్చి వీకెండ్ పార్టీ నిర్వహించారు. రాత్రంతా సరదాగా గడిపిన అనంతరం ఆదివారం ఉదయం రాము అనుమానాస్పద స్థితిలో కనిపించగా అప్పటికే అతని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు శరీరంపై గాయాల ఆనవాలు కనిపిస్తున్నట్లు సమాచారం దీంతో పార్టీ సందర్భంగా ఏదైనా గొడవ జరిగిందా.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిమిత్తం భద్రపరిచారు. రాము మృతికి వెనుక అసలు కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పార్టీకి హాజరైన వారిని విచారిస్తూ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. రాము మృతి చెందిన వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రజా ఉద్యమాలకు సుబ్బారావు జీవితం మార్గదర్శకం



### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల సాధన కోసం జీవితాంతం పోరాడిన ప్రముఖ మానవ హక్కుల ఉద్యమకారుడు, విద్యావేత్త, సామాజిక చైతన్య వేత్త పి. సుబ్బారావు సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాడిన అరుదైన వ్యక్తిగా పి. సుబ్బారావు గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మిర్యాలగూడలోని కళాభారతి ఎన్ఎస్పీ క్యాంపులో ఆదివారం నిర్వహించిన పి. సుబ్బారావు సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మానవ హక్కుల వేదిక ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ, ప్రజాసంఘాలు, ఆయన శిష్యులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అక్కెనపల్లి వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి.సుబ్బారావు జీవితం సమాజానికి ఒక పాఠశాల వంటిదని అన్నారు. విద్యార్థి దశ నుంచే హేతువాద భావజాలం, ప్రజాస్వామ్య ఆలోచనలు, సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో ముందుకు సాగారని గుర్తు చేశారు. ఉపాధ్యాయునిగా, లెక్చరర్‌గా వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా నేర్పారని తెలిపారు.అమరావతిలో జన్మించిన పి. సుబ్బారావు 1956లో మిర్యాలగూడకు వచ్చి విద్యా రంగంలో సేవలు ప్రారంభించారు. అనంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పర్యావరణ పరిరక్షణ, దళితుల హక్కులు, గిరిజనుల సమస్యలు, రైతాంగ అంశాలపై ఆయన చేసిన పోరాటం విశేషమని ఎమ్మెల్యే కొనియాడారు. ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వ్యతిరేక ఉద్యమం, యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటం, సారా వ్యతిరేక ఉద్యమాల్లో ఆయన ముందుండి పోరాడారని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై నిజ నిర్ధారణ కమిటీల ద్వారా బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సి.డి. రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శీరీషనవీన్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర నాయకులు గోసుల మోహన్, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పి. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడి ఎన్నిక



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని చిన్న లక్ష్మాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ కమిటీలను అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిన్న లక్ష్మాపూర్ గ్రామ శాఖ అధ్యక్షునిగా దూబల నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రమావత్ నరేష్, మేడిపల్లి జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కీసర శేఖర్, సోషల్ మీడియా ఇంచార్జిగా మూడవత్ నర్సింహా, గ్రామ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా నరిగే లక్ష్మిలను మండల కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శంకర్ నాయక్, గ్రామ సర్పంచ్ కోమటి రెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, మమత, భాస్కర్ నాయక్, దేవురుప్పల ఐలయ్య, రాజారాం నాయక్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు పునఃప్రారంభం అమావాస్య ఎఫెక్ట్

### నేడు పిల్లల్ని స్కూల్‌కు పంపుతారా...?
### లేదా సెంటిమెంట్‌తో తల్లిదండ్రుల్లో సందిగ్ధం
### స్కూళ్లు తెరుచుకుంటున్నా..హాజరుపై అనుమానాలు




**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణలో వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.వాస్తవానికి ఈ నెల 12వ తేదీతోనే సెలవులు ముగియాల్సి ఉండగా,రాష్ట్రంలో కొనసాగిన ఎండల తీవ్రత కారణంగా ప్రభుత్వం సెలవులను జూన్ 15 వరకు పొడిగించింది. దీంతో విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.అయితే ఈసారి స్కూళ్ల ప్రారంభంపై కొందరు తల్లిదండ్రుల్లో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. సోమవారం అమావాస్య రోజు కావడం,ఆతర్వాత రోజు మంగళవారం కావడంతో పిల్లలను వెంటనే స్కూల్‌కు పంపాలా వద్దా అనే ఆలోచనలో పలువురు పేరెంట్స్ ఉన్నారు. సంప్రదాయ విశ్వాసాలను అనుసరించే కుటుంబాలు బుధవారం నుంచి పిల్లలను పాఠశాలలకు పంపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు విద్యాశాఖ మాత్రం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే సోమవారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కానున్నాయని స్పష్టం చేసింది.కొత్త విద్యా సంవత్సరానికి అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు మొదటి రోజు నుంచే తరగతులకు హాజరవ్వాలని భావిస్తుండగా, మరి కొందరు శుభదినం చూసి పంపాలని నిర్ణయించుకుంటున్నారు.దీంతో పాఠశాలల మొదటి రోజు హాజరు శాతం ఎలా ఉంటుందనే అంశం ఆసక్తికరంగా మారింది.సెంటిమెంట్‌లకు ప్రాధాన్యత ఇచ్చే తల్లిదండ్రుల నిర్ణయం ఒకవైపు,విద్యా సంవత్సరాన్ని మొదటి రోజు నుంచే ప్రారంభించాలనే ఆలోచన మరోవైపు ఉండటంతో రేపటి నుంచి స్కూళ్లలో విద్యార్థుల హాజరుపై చర్చ జరుగుతోంది.

# మోగిన బడిగంటలు



**వేసవి సెలవుల తరువాత బడిగంటలు మోగాయి. పుస్తకాలను సంచుల్లో సర్దుకొని భుజాన వేసుకుని సరికొత్త ఉత్సాహంతో విద్యార్థులు బడిబాట పట్టారు. వేసవి సెలవులతో వెలవెలబోయిన పాఠశాలల్లో విద్యార్థుల రాకతో సరికొత్త శోభ సంతరించుకుంది.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,209 పాఠశాలలు ఉండగా ఇందులో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 939 ఉండగా 18 కెజిబివి, 9 మోడల్, 1 యుఆర్ఎస్, 242 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. 1లక్ష 14వేల మంది పైగా విద్యార్థులు విద్యనభ్యసించనుండగా ప్రైవేట్ పాఠశాలల్లోనే దాదాపు 60వేల మంది ఉన్నారు. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాల్టిల పరిధిలోని అత్యధికంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు అంటూ ప్రభుత్వ పాఠశాలలకు పంపకుండా ప్రైవేటు చదువుల వైపు మొగ్గు చూపుతున్నారు. పేద, మధ్య తరగతి వారు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అప్పులు చేసి చదివిస్తున్న పరిస్థితి.

**స్వాగత తోరణాలతో పాఠశాలలు ముస్తాబు**

వేసవి సెలవులతో దాదాపు 50 రోజులపాటు మూసివేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సెలవులు ముగియటంతో తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలికేందుకు అధికారులు పాఠశాలల ప్రవేశ ద్వారాల ముందు మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి ఆకులను కట్టి ముస్తాబు చేశారు. గత రెండు మూడు రోజుల నుండే తరగతి గదులు, బల్లాలను శుభ్రం చేయగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తరగతి గదులకు రంగులు వేసి ముస్తాబు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలతోపాటు నోట్‌బుక్స్‌ను అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు ముందే వెల్లడించారు.

**ప్రైవేటుకు అమావాస్య అడ్డు...**

ప్రైవేట్ పాఠశాలల పునఃప్రారంభానికి అమావాస్య అడ్డు వచ్చింది. సోమవారం (నేడు) అమావాస్య ఉండడం, మరుసటి రోజు మంగళవారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మంచి రోజులు లేకపోవడంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఆసక్తి చూపరని యాజమాన్యాలు నిర్ణయానికి వచ్చాయి. దీంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 17వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించనున్నట్లు ప్రకటించాయి.

## భక్త మార్కండేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ఆదివారం గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్, దేవాలయ మాజీ చైర్మన్ కోట రఘునందన్ , కుల పెద్దల సమక్షంలో దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈకమిటీలో గౌరవ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడిగా నక్క భువనేశ్వర్, అధ్యక్షుడిగా సంగెపు గణేష్,ఉపాధ్యక్షుడిగా పిల్లల మర్రి కిరణ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా గంజి సంజీవ్, కోశాధికారిగా తిరందాసు లక్ష్మణ్,కార్యదర్శులుగా కర్నాటి సాంబశివ, రుద్ర వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా వింజమూరి సురేందర్, గుర్రం మల్లికార్జున్,కర్నాటి మధు,పులిపాటి గణేష్ ఎన్నిక కాగా,గౌరవ సలహాదారులుగా కోట వెంకటయ్య,కోట అయోధ్య,నక్క మురళి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి గ్రామ పెద్దలు నక్క చంద్రమౌళి, నక్క రవీందర్, గుర్రం శ్రీరాములు,భరతయ్య,బిక్షమయ్య,పున్న కోటేశ్వర్,కర్నాటి శ్రీహరి,గుర్రం వెంకటేశ్వర్లు,గణేష్,గోలి కృష్ణ, సంగెపు లక్ష్మణ్, మల్లేష్, పద్మశాలి సంఘ ప్రతినిధులు కమిటీ సభ్యులను అభినందించారు.

## బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభం



ప్రజాపక్షం/అయిజః అయిజ పట్టణంలోని రాయచూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన కెబిఆర్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంను అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ ఘనంగా ప్రారంభించారు. పట్టణ క్రీడాకారులు తమ సొంత కృషితో ఏర్పాటు చేసుకున్న ఈ ఆధునిక ఇండోర్ స్టేడియాన్ని, క్రీడాకారుల ఆహ్వానం మేరకు చైర్మన్ ప్రారంభించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంపోందించుకోవాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ కూడా అలవడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రతిభా పురస్కారం అందజేత



ప్రజాపక్షం/కల్వకుర్తిః రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పదవ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు దినేశ్ పాటిల్ చేతుల మీదుగా జిల్లాలో ఇద్దరు మాత్రమే ఎంపిక కాగా, అందులో కల్వకుర్తికి చెందిన రాజేశ్వరికి వారి తల్లిదండ్రులతో కలిసి పురస్కారాన్ని అందుకుంది. భవిష్యత్తులోనూ చదువులో ఇలానే రాణించి మరిన్ని పురస్కారాలను అందుకోవాలని సంఘం సభ్యులు, వారి తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

## వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

### ఎంపిడిఓ గాలి యాదయ్య

ప్రజాపక్షం/కల్వకుర్తిః కల్వకుర్తి మండల పరిధిలోని గ్రామ పంచాయితీలకు నూతనంగా ఎన్నిక కాబడిన 214 మంది వార్డు సభ్యులకు, 16 నుండి 20వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎంపిడిఓ గాలి యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు ప్రతి వార్డు సభ్యునికి సమాచారం అందించి విధిగా హాజరయ్యే విధంగా గ్రామపంచాయితీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.

## ఎఐటియుసి కౌన్సిల్ సమావేశాలు




ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ః ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశాలకు నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ హాజరై జిల్లా నివేదికను కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి, వి ఎస్ బోస్, హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎస్ బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి ఆవులు మృతి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లిః శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి 4 ఆవులు మృతి చెందిన సంఘటన మరికల్ గ్రామంలో చోటు చేసుకుంది ఆవుల యజమాని రైతు దేవరపాక జసాన్, కాంగ్రెస్ యువ నాయకులు కొల్ల ఈశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం కురిసిన భారీ వర్షానికి వ్యవసాయ పొలంలో ఉన్న పశువుల కొట్టంపై పిడుగు పడి నాలుగు ఆవులు మృతి చెందాయన్నారు. లేగ దూడలు విగత జీవులై పడి ఉండడం చూసిన ఆవుల యజమాని తో పాటు గ్రామ ప్రజలు కన్నీటి పర్వత మయ్యారు. పశువులు మరణించడంతో జీవనం ఉపాధి కోల్పోయానని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను దేవరపాక జపాన్ వేడుకున్నారు.

## మైసమ్మను దర్శించుకున్న.. ఎస్ఐ, మాజీ జెడ్‌పిటిసి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లిః మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామ శివారులో వెలిసిన నాయనోనిపల్లి మైసమ్మ దేవతను ఎస్ఐ సతీష్, మాజీ జెడ్పిటిసి మేకల గౌరమ్మ చంద్రయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15 నుంచి పాఠశాలలు ప్రారంభం కానుడడంతో ఆదివారం హైదరాబాద్, కర్నూల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి తదితర గ్రామాల నుండి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మైసమ్మ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఇసుక అక్రమ రవాణా లారీ పట్టివేత



ప్రజాపక్షం/కొత్తకోటః వనపర్తి జిల్లా కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ పట్టుబడింది. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సందర్భంగా లారీలో తరలిస్తున్న ఇసుకను సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలిసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## అభివృద్ధి ప్రదాత 'మంత్రి జూపల్లి'



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లిః కోట్ల రూపాయల ఆస్తిని యువత భవిష్యత్తు కోసం స్పోర్ట్స్ అకాడమీ రిజిస్ట్రేషన్ చేసి, కొల్లాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న నియోజకవర్గ ప్రదాత టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అని పెద్దకొత్తపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నోజు సత్యం అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర ఆదివారం పెద్దకొత్తపల్లి మండల కు చేరుకుంది ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్యం యాత్రకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జొన్నల బొగుడ గ్రామ సర్పంచ్ ఆది ధర్మేందర్, నక్కలపల్లి సర్పంచ్ మ కురుమయ్య, మాజీ ఎంపీటీసీలు రవికుమార్, బద్య నాయక్, వెంకటస్వామి, కల్వకోల్ గ్రామ డిప్యూటీ సర్పంచ్ గువ్వలి, కురుమయ్య, నక్కలపల్లి మాజీ ఉపసర్పంచ్ మల్లేష్, కాంగ్రెస్ యువ నాయక్ ముచ్చిపోతు శంకర్, రాజు, రవి, ఎం మల్లేష్ బొల్లె బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి



ప్రజాపక్షం/పానుగల్ః భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జూపల్లి అరుణ్ అన్నారు. పానుగల్ మండల పరిధిలోని జమ్మాపూర్ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. సామాజిక సమానత్వానికి కృషి చేసిన మహానుభావుడని, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించి మహిళలకు సమాన హక్కులు కల్పించాలనే ఆలోచనను ముందుకు తెచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మాజీ ఎంపిపి వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి రవి, గ్రామ సర్పంచ్ మల్లయ్య, మాజీ సర్పంచ్ నాగేంద్రం, వాగ్గేయ కారుడు రాజారం ప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జ్యోతి నందన్ రెడ్డి, అడ్వకేట్ రవి, ప్రజా సంఘాల నాయకులు ఎర్రం చంద్రయ్య, ఎర్రం రాములు, గోవింద్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జెండా గద్దెపై చెప్పు గుర్తు

### దుండగులను కఠినంగా శిక్షించాలని
### బిఆర్ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు




ప్రజాపక్షం/మక్తల్ః బిఆర్ఎస్ జెండా గద్దెపై చెప్పు గుర్తు వేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మక్తల్ ఎస్ఐకి బిఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. స్థానిక పట్టణంలోని నారాయణపేట్ చౌరస్తాలో నిర్మించబడినటువంటి బిఆర్ఎస్ పార్టీ జెండా కట్టపై చెప్పు గుర్తు వేసిన దుండగులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజుకు ఫిర్యాదు చేశారు.అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, మాజీ కౌన్సిలర్ అన్వర్ హుస్సేన్‌లు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం ఉన్నప్పుడు ఈ నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక మాజీ శాసనసభ్యుడు చిట్టెం రాంమోహన్ రెడ్డి ఎంతో అభివృద్ధి చేసిన విషయాన్ని దుండగులు గుర్తుంచుకోవాలని తెలిపారు. ధైర్యం ఉంటే ముందుకొచ్చి కొట్లాడాలి కానీ చేతగాని దద్దమ్మల్లాగా ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజలే వారికి తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. మక్తల్ లో ఇలాంటి సాంప్రదాయం గతంలో ఎప్పుడు లేదని కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇది ప్రారంభమైందన్నారు. ఇలాంటి చర్యలకు పాలు పడితే బిఆర్ఎస్ పార్టీ ప్రతి చర్యలకు సిద్ధమవుతుందని దీనిని గుర్తించుకోవాలని హెచ్చరించారు.నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే దుండగులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. పోలీసులు వెంటనే ఆ దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జుట్లు శంకర్ జిల్లా యువనాయకుడు, గవినోళ్ల నర్సింహారెడ్డి చందాపూర్ ఆశోక్ గౌడ్, జుట్లు సాగర్, ఉప్పరి రఘు, వన్నెకారి రాజు, ఎల్లిగండ్ల బాలప్ప, రామలింగం, మంతన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్ గౌడ్, కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత యోగా తరగతులు ప్రారంభం

ప్రజాపక్షం/జడ్చర్లః ఈనెల 28 నుంచి పట్టణంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం, ఆర్ఎస్ఎస్ మాధవీయంలో ఉచిత యోగా తరగతులు ప్రారంభిస్తున్నట్లు సప్తరుషీయోగా నిర్వాహకులు చంద్రారెడ్డి తెలియజేశారు. ఆదివారం యోగా తరగతుల నిర్వహణపై శ్రీగిరిక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. 15 రోజుల పాటు నిర్వహించే తరగతులలో మాధవీయంలో ఉదయం 5.15 గంటల నుంచి 7.15 గంటల వరకు సత్యనారాయణ స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కొనసాగుతాయన్నారు. యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిత్యం గంట పాటు యోగా తరగతులు నిర్వహించి సాధన చేయించడంతో పాటు సనాతన ధర్మం గూర్చి వివరించనున్నట్లు వెల్లడించారు. మహిళలు, పురుషులు యోగా తరగతులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అచార్య కృష్ణస్వామి తోపాటు భక్తులు పాల్గొన్నారు.



## విద్యా వ్యాపార మాఫియా దోపిడీ అరికట్టాలి

### ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి
### ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్




ప్రజాపక్షం/ అమరచింత ః రాజ్యాంగ ప్రాథమిక హక్కులో భాగమైన ఉచిత విద్యను అంగడి సరుకుగా మార్చి కొత్త కొత్త టెక్నాలజీ పేర్లతో పవిత్రమైన విద్యావ్యవస్థను స్వార్థపూరిత కుట్రలతో వ్యాపారం చేసిన విద్య మాఫియా దోపిడీలపై ప్రభుత్వం తక్షణమే అడ్డుకట్ట వేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం అమరచింత మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. కుతుబ్ మాట్లాడుతూ కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని, పాలకులు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పాలకుల నినాదం కేవలం మాటలకే పరిమితం అయ్యిందని అన్నారు. విద్యా హక్కు చట్టంలోని సూత్రాలు, ఫీజుల నియంత్రణ జీవోలు కేవలం పరిపాలన శాఖల పేపర్లకు మాత్రమే పరిమితం చేశారని ఆయన ఆరోపించారు. నాణ్యమైన విద్య పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డు అదుపు లేకుండా ఫీజులు దండుకుంటున్నా.. విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు దోపిడి అపకపోతే ప్రత్యక్ష దాడులకు వెనుకాడేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు మహమూద్, దయాకర్, అరుణ్, మల్లేష్ యాదవ్, శ్రీకాంత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి




ప్రజాపక్షం/వంగూర్ః ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే వారి బంగారు భవిష్యత్తు కు పునాదులు వేస్తామని ప్రధానోపాధ్యాయులు ఎ. చిన్నయ్య అన్నారు.ఆదివారం మండల పరిధిలోని డిండి చింతపల్లి ప్రభుత్వ పాఠశాల బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మీ పిల్లలను మా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లయితే వారి భవిష్యత్తును ఉజ్వల భవిష్యత్తుగా అందిస్తామని వారు విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఉదయం 8ః30 నుండి సాయంత్రం 5.30 వరకు పాఠశాల సమయంలో జులై మొదటి వారం నుండి నవోదయ, గురుకుల, ఏకలవ్య, కంప్యూటర్ క్లాస్ ను, సైనిక్ స్కూల్‌కు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. గత సంవత్సరం మా పాఠశాల నుండి నవోదయ సైనిక్ స్కూల్‌కు విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన అన్నారు. మన గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను కాపాడేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, శివ, రాజేశ్వర్ గౌడ్, అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోపాల్‌పేటలో జ్ఞాన చైతన్య యాత్ర



ప్రజాపక్షం/గోపాల్ పేటః వనపర్తి జిల్లా సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ మల్లు రవి చేపట్టిన మహానీయులు జ్ఞాన చైతన్య యాత్ర ఆదివారం గోపాల్ పేట మండల కేంద్రానికి చేరుకుంది. యాత్ర బృందానికి స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు గగనం నరహరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మంద సత్యశీల రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.కళాకారుల బృందం అంబేద్కర్, జగ్జీవన్ రావు, అబ్దుల్ కలాం, పూలే దంపతులు, సేవాలాల్ మహారాజ్ వంటి మహానీయుల ఆశయాలపై సామాజిక గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించారు. మహానీయుల ఆలోచనలు ప్రతి ఇంటికి చేరాలి. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, మహిళలు చైతన్యవంతులు కావాలి అనేదే యాత్ర లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శివన్న యూత్ కాంగ్రెస్ ఆర్టిఐ చైర్మన్ కొంకి రమేష్, ఏదుల మండల అధ్యక్షుడు పందెం సుఖేందర్, అడ్వకేట్ ఆంజనేయులు, సుధాకర్ రావు, నాగరాజు, రవి, మధు ఒత్తుల శ్రీశైలం స్థానిక నాయకులు యువకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



ప్రజాపక్షం/వీపనగండ్లః వీపనగండ్ల మండలం వల్లభాపురం తాండ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేసిన గుడ్లు కుళ్లిపోయి ఉండటంతో గ్రామస్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఒక్కో చిన్నారికి ఐదు గు డ్ల చొప్పున పంపిణీ చేయగా వాటిలో కొన్ని నల్లగా మారి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. కుళ్లిన గుడ్లను తినడం వల్ల చిన్నారుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అంగన్వాడీ సిబ్బందిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని గ్రామస్థులు ఆరోపించారు. చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని వారు డిమాండ్ చేశా రు. ఈ ఘటనపై స్పందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ్య, విష యం తమ దృష్టికి వచ్చిందని, సోమవారం వల్లభాపురం తాండ అంగన్వాడీ కేం ద్రాన్ని సందర్శించి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తామని తెలిపా రు.

## మాలలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి



ప్రజాపక్షం/ అమరచింత ః సమాజంలో మాల కులస్తులు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని జాతీయ మాలల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు వీద విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం అమరచింత మండల పరిధిలోని నందిమల్ల, ధర్మాపూర్, నాగల కడుమూరు, చంద్రఘడ్ గ్రామాలలో మాల కులస్తుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాల సమాజం కష్టపడే స్వభావం, పట్టుదల, విద్య పట్ల ఆసక్తితో ముందుకు సాగుతూ సమాజానికి విలువైన సేవలు అందిస్తోందని అన్నారు. ఐక్యమత్యంతో అందరం కలిసి సమానత్వం, సోదరభావం, ఐక్యతను పెంపొందించుకుందామని కోరారు. మాలలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలల ఐక్యవేదిక మండల ప్రధాన కార్యదర్శి వీద భార్గవ్, కోశాధికారి రామస్వామి, సహాయ కార్యదర్శి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాటలకు స్వస్తి - ఇక పుస్తకాలతో కుస్తీ

- ఉపాధ్యాయుల తీరు మారేనా?... చదువులు బాగు పడేనా?
- అవే భవనాలు అవే సమస్యలు
- పొంచి ఉన్న స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ ముప్పు




ప్రజాపక్షం /హైదరాబాద్ సిటీ : వేసవి సెలవులు ముగిసాయి. ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు వాటికి స్వస్తి చెప్పి ఇక పుస్తకాలతో కుస్తీ పడడానికి సిద్ధయ్యారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించేందుకు కొత్త సారథి ( జిల్లా విద్యాశాఖాధికారి) యాదయ్య వచ్చారు. సారథితో పాటు కొన్ని కొత్త విధానాలు రాబోతున్నాయి. పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచి గాడి తప్పిన చదువులను తిరిగి సరైన మార్గంలోకి తేవాలని, రాష్ట్ర రాజధాని పరువు తిరిగి నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ జిల్లాకు కొత్త డిఇఓను నియమించారు. ప్రైవేటు పనులతో, వ్యాపారాలతో బిజీ అయి అసలు విధులను విస్మరిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల మత్తు వదలగొట్టి వారిని సరైన దారిలోకి తేవాల్సిన బాధ్యత ఆయనపై పడింది. దీంతో పాటు విద్యావిధానాలను సమర్థవంతంగా అమలు చేసి చదువులు సక్రమంగా సాగించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్న అల్పాహారం పథకం విద్యార్థుల్లో ఉత్సాహం నింపింది. గత విద్యాసంవత్సరంలోని సమస్యలే ఇప్పుడు ఉన్నాయి. శిథిల భవనాలను బాగు చేయలేదు, మౌళిక వసతులు మెరుగు పడలేదు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలకు ప్రభుత్వ భవనాలు సమకూరలేదు. ఇప్పటికి స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు కాలేదు. వీటిని సోమవారం నుంచి ప్రారంభిస్తామని రవాణాశాఖాధికారులు తెలిపారు. అంటే పాఠశాలల ప్రారంభం నుంచి ఈ పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఫిట్‌నెస్ లేని బస్సుల ముప్పు పొంచి ఉంది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 481 ప్రాథమిక పాఠశాలలు, ఎనిమిది ఉన్నత ప్రాథమిక పాఠశాలలు, 183 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 25 ప్రీప్రైమరి పాఠశాలలు ఉండగా ఈ విద్యాసంవత్సరం మరో 275 ప్రీప్రైమరి పాఠశాలలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియ జిల్లాలో 59శాతమే అయింది. ఇంకా 41శాతం ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. బడిబాట కార్యక్రమం ఇంకా కొనసాగనుంది. విద్యార్థులను లక్ష్యం కంటే పది శాతం అదనంగా చేర్పించే ప్రక్రియ కొనసాగనుంది. బడిబాట కార్యక్రమంలో బడిమానేసిన పిల్లలను మొత్తం 600మందిని గుర్తించగా వీరిలో 334మందిని మాత్రమే పాఠశాలల్లో చేర్పించారు. ఈసారి బోధనలో ఆధునిక విధానాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రధానంగా కృత్రిమ మేధ(ఏఐ), డిజిటల్ చదువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. భాషా, గణిత అభ్యాసాన్ని మెరుగు పరిచేందుకు జిల్లాలోని 25 పాఠశాలల్లో ఏఎక్స్‌ఎల్( సహాయక భాష, గణిత అభ్యాసం) ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక అవసరాలు ఉన్న 5,774 మంది పిల్లలను సాధారణ పాఠశాలల్లో విలీనం చేసారు.

**అందని యూనిఫాంలు, కిట్లు :**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల బ్యాగ్,టై, బూట్లు, ఐడెంటిటి కార్డులతో కూడిన కిట్‌ను అందించాలని విద్యాశాఖ నిర్ణయించినప్పటికి అవి ఇప్పటికి వరకు రాలేదు. అధికారులు దీని కోసం ప్రణాళికలు తయారు చేసినా అవి కార్యరూపం దాల్చలేదు. ఎప్పటి వరకు అందిస్తారన్న సమాచారం కూడా లేదు. ఈ కిట్ల పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా కాకుండా ఈ ఏడాది గ్రేటర్ హైదరాబాద్‌లోని 2096 ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్ల తరహాలో అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీని ప్రకారం హైదరాబాద్ జిల్లాలోని 672 పాఠశాలల విద్యార్థులకు రావాల్సి ఉంది. ప్రతి విద్యార్థి కాళ్ల సైజుతో పని లేకుండా బూట్లను మూడు సైజుల్లో అందించాలని నిర్ణయించారు. అలాగే ఒకటో తరగతి నుండి మూడవ తరగతి వరకు ఒక సైజు, నాలుగు నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఒక సైజు, తొమ్మిది, పదితరగతి వారికి ఒక సైజులో పుస్తకాల సంచులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇది ఎప్పటి వరకు అమలులోకి వస్తుందో చూడాలి. వీటితో పాటు విద్యార్థులకు ప్రతి ఏటా ఇచ్చే స్కూల్ యూనిఫాంలు కూడా ఇప్పటి వరకు రాలేదు. వచ్చే వరకు విద్యార్థులు పాత యూనిఫాంలతోనే పాఠశాలలకు హాజరు కావాల్సి ఉంది. ఈసమస్య ప్రతి ఏటా తలెత్తున్నా ఇప్పటి వరకు దీనిని అధిగమించడంలో విద్యాశాఖ విఫలమవుతూనే ఉంది.

## ఆధునిక టెక్నాలజీతో విద్యుత్ దీపాల ఏర్పాటు



**ప్రజాపక్షం/కొత్తూరు:** కొత్తూరు మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో సర్పంచ్ బోకుల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆదివారం మక్తగూడతోపాటు పెద్దగుట్టతండాలో సుమారు 150విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీరాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలోని అన్ని వీధులలో నూతన టెక్నాలాజీతో రూపొంధించిన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బోకుల రాజు, దయ్యాల శ్రీను, కె.శ్రీనివాస్, ఎం.చందర్‌నాయక్, జి.కిష్టయ్య, బుచ్చయ్య, అంజయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు సోలీపూర్‌లో ఆదివారం కౌన్సిలర్ శిరీష అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బొడ్రాయి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతోనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు పంతులు, సునీల్ పంతులు, శివరాములు యాదవ్, వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సింగపాగ జంగయ్య, గడ్డం కృష్ణయ్య కావలి కృష్ణయ్య, పిచ్చకుంట్ల శేఖర్, చీపిరి బాల్‌రాజ్, సతీష్, చీపిరి వెంకటేష్, యాదయ్యపాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ షకీల్



**ప్రజాపక్షం/కేశంపేట:** ఆదివారం కేశంపేట మండల కేంద్రంలోని బిఎస్ గార్డెన్‌లో ఉప సర్పంచులతో సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ హాజరయ్యారు. గౌరవ అధ్యక్షురాలిగా లింగందాన గ్రామానికి చెందిన బండెల లావణ్య తిరుపతిరెడ్డి, అధ్యక్షుడిగా సంగెం గ్రామానికి చెందిన మహ్మద్ షకీల్, ఉపాధ్యక్షుడిగా లేమామిడికి చెందిన ప్రమోద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవి రవినాయక్, సంయుక్త కార్యదర్శిగా నరేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రవినాయక్, ధన్‌సింగ్, శ్రీను, జ్యోతి నరేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు బండ హరీశ్వర్, బుర్రి భూపాల్‌రెడ్డి, దండే రామచంద్రయ్య, జట్టూరి జయమ్మ నాగిరెడ్డి, కాట్రావత్ రాజునాయక్, హనుమంతు, రాంరెడ్డి, సంధ్య, శ్రీకాంత్, రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

## శంకర్‌కు రక్తదాన పురస్కారం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్‌ను ప్రపంచ రక్తదాతల దినోత్సవం వేడుకల సందర్భంగా 2026 అతుత్తమ రక్తదాన పురస్కారాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రక్తదానం దినోత్సవం వేడుకల సందర్భంగా రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమం అహ్వానం మేరకు పాల్గొడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో సర్పంచ్ బీస కవిత కరుణాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ దేవాలయ నిర్మాణానికి బీస కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు బీసా హని ఒక లక్ష రూపాయల విరాళం అందజేశారు. కార్యక్రమంలో పోగుల భీమయ్య, నరసింహారెడ్డి, పోగుల నర్సింహులు, వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, పోగుల నర్సింలు, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, గుత్తి శేఖర్, నిరంజన్, కందన కృష్ణ, బిక్షపతి, రాజారాం, పబ్బతి మల్లయ్య, నర్సింలు, రాములు, ధర్మయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని బోదునంపల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో అండర్..18క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి బండ్ల హరీష్‌రెడ్డి రూ.7116, రెండో బహుమతి గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ రూ.3116నగదు బహుమతులను క్రీడాకారులకు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో వెంకటాపూర్ తండా, బోదునంపల్లి జట్టుతో తలపడగా వెంకటాపూర్ తండా జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఇమ్మిడి శ్రీను, కుమ్మరి నరసింహా, మేల్గిరి యాదగిరి, వెంకటాపురం నరసింహా, ఎదిరే వెంకటేష్, బోయగడ్డ యాదగిరితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పోలీస్ మెంటార్స్ వ్యవస్థ

ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక మెంటార్..

మార్గదర్శక్ వలంటీర్లతో సమన్వయం

నగర సిపి విసి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సిటీ పోలీస్ సరికొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. 'మార్గదర్శక్' కార్యక్రమానికి అనుబంధంగా, కొత్తగా 'పోలీస్ మెంటార్స్ ప్రోగ్రామ్'ను తీసుకువస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ప్రకటించారు. ఇకపై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ను మెంటార్‌గా నియమిస్తామని, వారు క్షేత్రస్థాయిలో మార్గదర్శక్ వలంటీర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పని చేస్తారని ఆయన తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి ఆడిటోరియంలో హెచ్‌సిఎస్‌సి ఆధ్వర్యంలో జరిగిన మార్గదర్శక్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో సిపి విసి సజ్జనార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేయడంతో పాటు, మార్గదర్శక్ లోగోను ఆవిష్కరించి, రెండో దశ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి విసి సజ్జనార్ మాట్లాడుతూ, నగరంలో ప్రజా భద్రత, మహిళా భద్రత, అత్యవసర సేవలలో భాగస్వాములుగా ఉంటూ, ప్రజలను చైతన్యవంతమైన వలంటీర్లుగా తీర్చిదిద్దడమే మార్గదర్శక్ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. బాధితులకు తక్షణ అండగా నిలుస్తూ, పోలీసు వ్యవస్థకు 'ఫోర్స్ మల్టిప్లయర్స్'గా పనిచేసేలా పౌరులను సిద్ధం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వలంటీర్లకు ప్రజా భద్రత, ఎమర్జెన్సీ రెస్పాన్స్, మహిళల భద్రత, సైబర్ అవగాహన వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించామని, వీరంతా ఇకపై సేఫ్టీ అంబాసిడర్స్‌గా నగర భద్రతలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులు, గృహ హింస వంటి ఘటనల్లో బాధితులు భయం, అవగాహన లేమితో బయటకు చెప్పలేక మౌనంగా ఉండిపోతున్నారని, ఇది కాలక్రమేణా పెద్ద నేరాలకు దారితీసే ప్రమాదముందన్నారు. అందుకే, బాధితులకు భరోసా కల్పించేందుకే మార్గదర్శక్ వ్యవస్థను తీసుకువచ్చామని, సమస్యను చూసి తప్పుకునే ప్రేక్షకులుగా కాకుండా, సమాజంలో మార్పు తెచ్చే 'చేంజ్ మేకర్స్'గా ప్రజలు ఎదగాలని పిలుపునిచ్చారు. షీటీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ పోలీసులకు, బాధితులకు మధ్య మార్గదర్శకులు ఒక నమ్మకమైన వారధిగా పనిచేయాలని, నిబద్ధతతో కూడిన సేవలే పోలీస్‌వ్యవస్థకు గౌరవాన్ని తెస్తాయని చెప్పారు. పోలీసింగ్‌లో అయినా, సామాజిక సేవలో అయినా నాణ్యత, క్రమశిక్షణ అత్యంత కీలకమని, వలంటీర్లు ఆదిశగా అడుగులు వేయాలని కోరారు. ఆపదలో ఉన్న మహిళలు తమ ఇబ్బందులను మహిళా సిబ్బంది వద్ద మరింత స్వేచ్ఛగా, నిర్భయంగా చెప్పుకోగలరన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని, బాధితులకు తక్షణ సాయం, భరోసా అందించేందుకు 'స్పందన ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్' అనే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ వ్యవస్థ, మార్గదర్శక్, పోలీస్ మెంటార్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేస్తూ మహిళా భద్రతకు ఒక బలమైన రక్షణ కవచంలా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డిసిపి డాక్టర్ లావణ్య, హెచ్‌సిఎస్‌సి సెక్రటరీ జనరల్ సి.శేఖర్‌రెడ్డి, మహిళా ఫోరం జాయింట్ సెక్రటరీ ఖ్యాతి నారవనే తదితరులు పాల్గొన్నారు.

## బైబ్యాక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్' పేరుతో
# రూ.90 లక్షల మోసం..

సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్‌పై కేసు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి 'బైబ్యాక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్' పేరుతో పెట్టుబడిదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యంపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన బి. నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ కేసు వెలుగులోకి వచ్చింది. నవీన్ కుమార్, ఆయన స్నేహితుడు చంద్రమౌళి చంద్రశేఖర్ రావు కలిసి బంజారాహిల్స్‌లోని సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ సంస్థ ప్రతినిధులు రూ.30 లక్షలు పెట్టుబడి పెడితే రెండేళ్లలో రూ.50 లక్షలు తిరిగి ఇస్తామని, భద్రతగా భూమిని రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు.దీంతో ఇద్దరూ కలిసి రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టారు. వికారాబాద్ జిల్లా మొమిన్‌పేట్ మండలంలోని రామనాథ్‌గూడపల్లి, గోవిందాపూర్ గ్రామాల్లో అర ఎకరం భూమిని వారి పేర్లపై రిజిస్ట్రేషన్ చేస్తామని, 2023 అక్టోబర్ నాటికి రూ.50 లక్షలు చెల్లిస్తామని సంస్థ హామీ ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అయితే పెట్టుబడి తీసుకున్నప్పటికీ హామీ ఇచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదని, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపించారు. అనంతరం బుకింగ్ రద్దు కోరగా 2022 సెప్టెంబర్‌లో సంగారెడ్డి జిల్లా హత్నూర్ మండలంలోని చింతల చెరువు గ్రామంలో 5 గుంటల వ్యవసాయ భూమిని నవీన్ కుమార్ పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, రూ.50 లక్షల విలువైన పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చినట్లు తెలిపారు. పెట్టుబడి గడువు ముగిసిన తర్వాత పలుమార్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. శ్రీధర్‌ను సంప్రదించినప్పటికీ డబ్బులు చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో ఆలస్యానికి 24 శాతం వడ్డీ చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నా అమలు చేయలేదని తెలిపారు. అలాగే 2024 సెప్టెంబర్ 12న సంస్థ మరో కమిట్‌మెంట్ లేఖ ఇచ్చి మొత్తం రూ.60 లక్షలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఇందులో రూ.5 లక్షలు వెంటనే, మిగతా రూ.55 లక్షలను విడతల వారీగా చెల్లిస్తామని పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆరోపించారు. ఈ వ్యవహారంలో మరి కొందరు బాధితులు కూడా ముందుకు వచ్చారు. నెక్కంటి సాహిత్య, కర్రి నాగదేవి, గడెసిద్దెంకి సత్యనారాయణ తదితరులు కూడా ఇదే స్కీమ్‌లో రూ.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు ఫిర్యాదుదారునికి వివరించినట్లు పేర్కొన్నారు. సంస్థ ఎండీ బి. శ్రీధర్‌తో పాటు ఇతర ప్రతినిధులు పెట్టుబడిదారులను మభ్యపెట్టి మొత్తం రూ.90 లక్షలు వసూలు చేసి ఆర్థికంగా నష్టపరిచారని ఫిర్యాదులో ఆరోపించారు. బాధితులు తమ పెట్టుబడులను తిరిగి ఇప్పించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐ పి. గోపాల్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ షేర్లలో భారీ మోసం

రూ.3.31 కోట్ల విలువైన షేర్ల అక్రమ బదిలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్‌కు చెందిన షేర్లను నకిలీ పత్రాలతో అక్రమంగా బదిలీ చేసి విక్రయించిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో రూ.3.31 కోట్లకు పైగా విలువైన షేర్లు అక్రమంగా బదిలీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును హైదరాబాద్ సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తోంది.పోలీసుల వివరాల ప్రకారం, ఎస్‌ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ సెక్రటరీ తిరుమలేష్ తుమ్మా హైదరాబాద్ సిసిఎస్‌కు ఫిర్యాదు చేశారు. కంపెనీ 2007 నుంచి బిఎస్ఇ, ఎన్‌ఎస్ఇ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టెడ సంస్థగా కొనసాగుతోంది. 1994లో జారీ చేసిన ఫిజికల్ షేర్లలో కొన్ని ఇప్పటికీ డీమ్యాట్ కాకుండా ఉండగా, వాటి వివరాలు కంపెనీ వెబ్‌సైట్‌లో చట్టపరమైన నిబంధనల ప్రకారం ప్రచురించబడుతున్నాయి. ఈ సమాచారాన్ని ఆసరాగా చేసుకున్న ఓ ముఠా, డివిడెండ్లు క్లెయిమ్ చేయని అసలు షేర్ హోల్డర్ల వివరాలను సేకరించి వారిలా నటిస్తూ కంపెనీకి లేఖలు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట చిరునామాలు మార్చించుకుని, ఆపై షేర్ సర్టిఫికెట్లు పోయాయని చెప్పి డూప్లికేట్ షేర్ సర్టిఫికెట్లు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం నకిలీ పాన్ కార్డులు, ఫోర్జరీ పత్రాలు సమర్పించి షేర్లను తమ పేర్లకు బదిలీ చేయించుకుని, డీమ్యాట్ చేసి స్టాక్ మార్కెట్‌లో విక్రయించినట్లు కంపెనీ గుర్తించింది. ఈ విధంగా మొత్తం 85 వేల షేర్లు అక్రమంగా బదిలీ అయినట్లు వెల్లడించింది. కంపెనీ లెక్కల ప్రకారం భవాని ధనేకుల, శ్రీధర్ చిలుకూరి, అనూరాధ జంపన, వాణి పెన్మెత్స, చిలకపాటి శ్రీనివాస్, తాటి సుజాత, సారా రాజి తదితర అసలు షేర్ హోల్డర్లకు చెందిన షేర్లు అక్రమంగా బదిలీ అయ్యాయి. వీటి మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.3,31,71,250గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులో అహ్మదాబాద్‌కు చెందిన వరు దినేష్ కె, అతని భార్య వరుషా దినేష్ వరు, కుమార్తె బిజల్ డి వరు మరియు వారి సహచరులు ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నట్లు ఆరోపించారు. పరస్పరం గ్యారంటీలు, ఇండెమ్నిటీ బాండ్లు సమర్పిస్తూ నకిలీ గుర్తింపు పత్రాలతో మోసానికి పాల్పడినట్లు కంపెనీ తెలిపింది. కేసును ఆర్థిక నేరాల విభాగం అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. షేర్ హోల్డర్ల పేర్లతో నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల రూపాయల విలువైన షేర్లను అక్రమంగా విక్రయించిన ఈ మోసం వెనుక ఉన్న ముఠా కార్యకలాపాలపై సిసిఎస్ అధికారులు లోతైన దర్యాప్తు చేపట్టారు.

## 'కానోయీ'లో పతకాలు సాధించిన తెలంగాణ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాయపూర్ లో 12 నుండి 14 జూన్ వరకు జరిగిన 36వ కానోయీ స్ప్రింట్ జూనియర్ మరియు సబ్ జూనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ లో 500 మీటర్ల కానోయీ విభాగంలో సింగిల్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన జాస్విక మరియు 500 మీటర్లు విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన తెలంగాణ క్రీడాకారిణి లు జాస్విక, అనూష... స్పోర్ట్స్ అథారిటీ కోచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందుతున్న ఈ క్రీడాకారునిల విజయం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ పార్టీ చైర్మన్ శివసేనరెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాల దేవిలు అభినందనలు తెలియజేశారు.

## సౌత్ జోన్ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో
# సోనీ బాలాదేవికి స్వర్ణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొంపల్లిలోని పికిల్ బాల్ హబ్ వేదికగా నిర్వహిస్తున్న 2వ సౌత్ జోన్ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్–2026లో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనీ బాలాదేవి మహిళల సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన సోనీ బాలాదేవి సెమీఫైనల్లో మాధవిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నారు. అనంతరం జరిగిన తుదిపోరులో దీప్తి బాలన్‌ను ఓడించి విజేతగా నిలిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే స్వయంగా క్రీడల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని పలువురు క్రీడా ప్రముఖులు పేర్కొన్నారు. డాక్టర్ సోనీ బాలాదేవి సాధించిన ఈ విజయం యువ క్రీడాకారులు, ఉద్యోగులు, అధికారులు, మహిళలకు స్ఫూర్తిదాయకమని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కొనేవిధంగా
# 'ప్రొటెక్షన్ సిస్టమ్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత డిజిటల్ యుగంలో అత్యంత కీలకమైన గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కోవడం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హ్యాకర్ల బారి నుంచి రక్షించే సరికొత్త 'ప్రొటెక్షన్ సిస్టమ్స్'ను డిజైన్ చేయాలని పలువురు నిపుణులు సూచించారు. హైదరాబాద్ లోని 'లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' (ఎఐఇటి) ' 36 గంటల జాతీయ స్థాయి మెగా హ్యాకథాన్ 'హ్యాక్‌ప్రిక్స్ సీజన్ 3' నిర్వహించింది. ఈ హ్యాక్‌థాన్‌లో 25 రాష్ట్రాల నుంచి 550 మంది మేధావులు హాజరయ్యారు.. ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా 3,500 పైగా దరఖాస్తులు రాగా, అందులో అత్యంత ప్రతిభావంతులైన 550 మందికి పైగా బెస్ట్ హ్యాకర్లను (150 కి పైగా జట్లుగా) తుది పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రొటెక్షన్ సిస్టమ్స్ , వినూత్న ఐడియాలు ప్రదర్శించిన విజేతలకు రూ. 3 లక్షల బహుమతిని ఎఐఇటి ప్రకటించింది. గూగుల్ జెమిని, సర్వం ఎఐ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ మోసాలు, డేటా లీక్‌లు, ప్రభుత్వకార్పొరేట్ సంస్థల ఇన్‌ఫ్రాస్ట్రక్చ్ పైన సైబర్ దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ హ్యాకథాన్‌లో హ్యాకర్లు సులభంగా ఛేదించలేని విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ ) ఆధారిత సెక్యూరిటీ ఫైర్వాల్స్, మాల్వేర్ డిటెక్షన్ టూల్స్‌ను విద్యార్థులు లైవ్‌లో డిజైన్ చేశారు. డేటా రక్షణ వికేంద్రీకరణ: సమాచారం చోరీకి గురికాకుండా వెబ్3 టెక్నాలజీలను ఉపయోగించి డిజిటల్ నెట్వర్క్‌కు భద్రత కల్పించాలనే అంశంపైన చర్చించారు. 'పుస్తకాల్లో చదివే చదువుకు, నిజ జీవితంలో ఐటీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సైబర్ సెక్యూరిటీ సవాళ్లకు చాలా వ్యత్యాసం ఉన్నదని, ఆ దూరాన్ని తగ్గించి, దేశ డిజిటల్ మౌలిక వసతులను రక్షించే సమర్థవంతమైన లీడర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఎల్ఐటిటి ధ్యేయమని యాజమాన్యం తెలిపింది.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి



ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి

**ప్రజాపక్షం/ఎల్.బి.నగర్:** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీ, ఆర్‌టిసి కాలనీ, హనుమాన్ టెంపుల్ నుండి జంగిర్‌నగర్ కాలనీలకు మంజూరు అయిన సీసీ రోడ్ల పనులను పూర్తిచేయాలని బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ వాసులు ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ అజ్మీర స్వామి ఫోన్‌లో మాట్లాడి సంబంధిత అధికారులకు పనులను త్వరగా ప్రారంభించి, ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశాలు ఇవ్వాలను డిప్యూటీ కమిషనర్‌కు కోరారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, ఆర్‌టిసి కాలనీ అధ్యక్షులు ముకుందరాజు, కె.ప్రభాకర్‌రెడ్డి, పద్మావతి కాలనీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ కుమార్, లింగం నరసింహులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు:** దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంతాల గ్రామంలో నూతనంగా ప్రతిష్టించనున్న మైసమ్మ తల్లి విగ్రహ మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సొంత నిధులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అంధించినందుకు గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్సీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్సీని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో చిన్న ఉమ్మెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, గోపాల్, అయోద్యపూర్ సర్పంచ్ గోపాల్‌నాయక్, చింతకుంటతండా సర్పంచ్ హరి నాయక్, చిన్న ఉమ్మెంతాల గ్రామస్తులు రాయికంటి కృష్ణారెడ్డి, ఎన్నంపల్లి రాఘవేందర్ రెడ్డి, బాలానగర్ హనుమంతురెడ్డి, ఈగ నర్సిమ్మరెడ్డి, ఆనంద్, భూపాల్‌గౌడ్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# టిఎంసిలో ముదురుతున్న సంక్షోభం

● అసమ్మతి వర్గానికి సుదీప్ బందోపాధ్యాయ మద్దతు ●భూపేందర్ యాదవ్‌తో తిరుగుబాటు ఎంపిలు భేటీ

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తలెత్తాయి. పార్టీ సంక్షోభంలో కూరుకుపోయింది. లోక్‌సభ స్పీకర్ వద్ద అసలైన టిఎంసి పార్లమెంటరీ గ్రూపు గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తున్న తిరుగుబాటు వర్గానికి మమతా బెనర్జీ అత్యంత సన్నిహితుడైన సుదీప్ బందోపాధ్యాయ మద్దతు తెలిపారు. తిరుగుబాటు ఎంపిలు, ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ఆ వర్గంతోనే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు బందోపాధ్యాయ తెలిపారు. అయితే, స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించాల్సిన లేఖపై తాను ఇంకా సంతకం చేయలేదని, పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారి సమక్షంలోనే ఆ పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, సోమవారం స్పీకర్ బిర్లాతో జరగబోయే సమావేశానికి ముందు తమ వ్యూహాన్ని ఖరారు చేసుకునేందుకు ఎంపిలు ఢిల్లీలో భూపేందర్ యాదవ్‌ను కలిశారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితులలో ఒకరిగా భావించే బందోపాధ్యాయ, ఢిల్లీలో అమిత్ షా, భూపేందర్ యాదవ్‌లను కలిసిన తర్వాత తిరుగుబాటు వర్గంలో చేరారు. ఆ మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. తాను అమిత్ షాతో సమావేశమయ్యానని బందోపాధ్యాయ ఆదివారం విలేకరులతో అన్నారు. 'చాలా మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకున్నారు. మమతా బెనర్జీ ప్రధాన సలహాదారు, పార్టీ నాయకురాలిగా ఉంటూ, ఆమె మార్గదర్శకత్వంలోనే పార్టీ కొనసాగాలని వారు ఆకాంక్షించారు. వారి




విజ్ఞప్తి నా మనసును నిజంగా కదిలించింది. అందుకే, వారితోనే కొనసాగాలని నిర్ణయించుకున్నాను' అని ఆయన చెప్పారు. అయితే, స్పీకర్ బిర్లాకు సమర్పించాల్సిన లేఖపై తాను ఇంకా సంతకం చేయలేదని బందోపాధ్యాయ పేర్కొన్నారు. మరోవైపు, స్పీకర్‌తో తిరుగుబాటు వర్గం సమావేశానికి ముందు ఢిల్లీకి చేరుకున్న ఎంపిలు సాయోని ఘోష్, మాలా రాయ్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. తాను తన నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెబుతాను, మీకు కాదు అని ఘోష్ అన్నారు. తీవ్రమవుతున్న గందరగోళం మధ్య టిఎంసి ఘోష్, రాయ్, బంద్యోపాధ్యాయ్‌లను పార్టీలో కీలక పదవుల నుంచి తొలగించి, కొత్తగా సంస్థాగత పునర్వ్యవస్థీకరణ చేపట్టింది.ఘోష్ స్థానంలో అర్నబ్ బెనర్జీ తృణమూల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులవ్వగా, రాయ్ స్థానంలో కాళిగంజ్ ఎమ్మెల్యే అలీఫా అహ్మద్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. మరో ముఖ్యమైన మార్పులో, బంద్యోపాధ్యాయ్ స్థానంలో టిఎంసి నాయకుడు కునాల్ ఘోష్ పార్టీ ఉత్తర కోల్‌కతా సంస్థాగత జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బెనర్జీకి ఇప్పటికీ విధేయులుగా ఉన్న ఎంపిలతో కూడిన తన లోక్‌సభ విభాగానికి సీనియర్ ఎంపి సౌగత రాయ్‌ను ముఖ్య సలహాదారుగా పార్టీ నియమించింది. సాయోని ఘోష్, మాలా రాయ్ అసమ్మతి వర్గంతో పొత్తు పెట్టుకున్నారు. టిఎంసికి చెందిన 28 మంది లోక్‌సభ సభ్యులలో 20 మంది మద్దతు తమకే ఉందని ఈ వర్గం పేర్కొంటోంది. తిరుగుబాటు ఎంపి జగదీష్ చంద్ర బర్మ బసునియా మాట్లాడుతూ, తమ బృందం సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తమను నిజమైన టిఎంసి పార్లమెంటరీ గ్రూపుగా గుర్తించాలని కోరనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాము స్పీకర్‌కు లేఖ సమర్పించామని, ఇక సోమవారం స్పీకర్ వద్దకు వెళ్లి, నిజమైన టిఎంసి పార్లమెంటరీ గ్రూపును ఏర్పాటు చేయడానికి తమ వాదనను వినిపిస్తామని చెప్పారు. అయితే, తిరుగుబాటుదారుల వాదనను టిఎంసి తోసిపుచ్చింది. పార్లమెంటులో ఒక ప్రత్యేక గ్రూపు ఏర్పాటుకు ఫిరాయింపుల నిరోధక చట్టం అనుమతించదని స్పష్టం చేసింది. ప్రత్యేక వర్గానికి ఎటువంటి చట్టపరమైన నిబంధన లేదని రాజ్యసభ ఎంపి సాగరిక ఘోష్ పేర్కొన్నారు. పదవ షెడ్యూల్ నిబంధనల ప్రకారం తమ అసలు రాజకీయ పార్టీ మరొక పార్టీలో విలీనం కాకపోతే, ఎంపిలు అనర్హతను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆమె వాదించారు.

# జార్ఖండ్‌లో పిడుగుల వర్షం

●8 మంది మృత్యువాత, మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలురు ● ఆరు జిల్లాల్లో ఘటనలు

**రాంచి :** జార్ఖండ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆరు జిల్లాల్లో పిడుగులు వర్షం పడింది. ఈ ఘటనల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలురు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మరణించిన వారిలో రాంచీ, గర్వా జిల్లాల నుండి ఇద్దరేసి చొప్పున ఉండగా, ఛత్రా, గిరిడిహ్, సెరైకెలా–ఖర్సావాన్, జమ్తారా జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందారు. గత 24 గంటల్లో జార్ఖండ్ అంతటా పిడుగులు పడటంతో ఎనిమిది మంది మరణించినట్లు పోలీసు అధికారి పిటిఐకి తెలిపారు. రాంచీ జిల్లాకు చెందిన ఇద్దరు మృతుల్లో బధు గ్రామానికి చెందిన జితు మహ్లీ (55), కటమ్‌కులి గ్రామానికి చెందిన నిరాశో దేవి (33)గా గుర్తించారు. వీరిద్దరూ తమ పొలాల్లో పని చేస్తుండగా పిడుగుపాటుకు గురయ్యారని పిథోరియా పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యదేవ్ ప్రసాద్ తెలిపారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించారు. గర్వాలో ఇద్దరు వ్యక్తులు మరణించారని మరొక పోలీసు అధికారి తెలిపారు. వీరిని ఖరౌంధీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుండి గ్రామానికి చెందిన రీనా దేవి (30), కేతార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముకుంద్‌పూర్ గ్రామానికి చెందిన రామ్ అవతార్ పాల్ (65)గా గుర్తించారు. రీనా దేవి ఒక చెట్టు కింద



ఆశ్రయం పొందుతుండగా పిడుగుపాటుకు గురైనట్లు ఖరౌంధీ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ గుల్షన్ కుమార్ గౌతమ్ తెలిపారు. గొర్రెల కాపరి అయిన రామ్ అవతార్ పాల్ తన గొర్రెలను మేపుతుండగా పిడుగుపాటుకు గురై మరణించాడని కేతార్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. గిరిడిహ్‌లో జరిగిన మరో ఘటనలో పిడుగుపాటు వల్ల తీవ్ర గాయాలపాలైన 10 ఏళ్ల బాలుడు మరణించాడు. బాధితుడు రాజ్ ధన్వార్ బ్లాక్‌లోని ఘోస్కోడిహ్ గ్రామానికి చెందినవాడని, అతన్ని కోడెర్మా సదర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు రాజ్ ధన్వార్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ బర్జేష్ కుమార్ తెలిపారు. ఛత్రా జిల్లాలోని సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, డిసి కార్యాలయం వెనుక ఉన్న ఎకో పార్క్‌లో పని చేస్తుండగా పిడుగుపాటుకు గురై 35 ఏళ్ల మహిళా కూలీ మరణించింది. అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని బారియో గ్రామానికి చెందిన బాధితురాలు గీతా దేవి, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాని సదర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ అధికారి అవధేష్ కుమార్ సింగ్ తెలిపారు. సెరైకెలా–ఖర్సావాన్ జిల్లాలోని రాజ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పిడుగుపాటుకు గురై 35 ఏళ్ల వ్యక్తి మరణించగా, అతని తండ్రి, మైనర్ కుమార్తె గాయపడ్డారని ఒక పోలీసు అధికారి తెలిపారు. బాధితుడు సంజయ్ డియోగామ్, అతని తొమ్మిదేళ్ల కుమార్తె, 60 ఏళ్ల తండ్రి సొందిర్డిహ్ గ్రామంలోని ఒక గుడిసెలో తలదాచుకున్నప్పుడు ఈ ఘటన జరిగింది. వీరిని రాజ్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అక్కడ వైద్యులు సంజయ్ అప్పటికే మరణించినట్లు నిర్ధారించారని ఆ అధికారి పేర్కొన్నారు. జమ్తారా జిల్లాలోని కర్మాతర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బిథారా గ్రామంలో పిడుగుపాటుకు గురై 10 ఏళ్ల బాలుడు మరణించాడు. మోహిల్ మియాన్ అనే వ్యక్తి తన ముగ్గురు పిల్లలతో కలిసి పొలానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ ప్రాంతంలో పిడుగు పడటంతో అతని 10 ఏళ్ల కుమారుడు అక్కడికక్కడే మరణించాడు. ఆ వ్యక్తి, మిగిలిన ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి, ప్రస్తుతం వారు ప్రమాదం నుండి బయటపడ్డారు అని కర్మాతర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ అధికారి అలఖ్ చౌబే తెలిపారు.

## అన్నాడిఎంకెకు నటి గౌతమి రాజీనామా



**చెన్నై :** తమిళనాడులోని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అన్నాడిఎంకె డిప్యూటీ ప్రచార కార్యదర్శిగా వ్యవహరిస్తున్న నటి గౌతమి తడిమల్ల ఆదివారం నాడు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామికి రాసిన లేఖ రాశారు. 'ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, సామాజిక సేవ చేయాలనే ఉద్దేశంతో, అన్నాడిఎంకె ప్రాథమిక సభ్యత్వం, పార్టీ డిప్యూటీ ప్రచార కార్యదర్శి పదవులకు భారమైన హృదయంతో రాజీనామా చేస్తున్నాను. అలాగే, తాను పార్టీలో చేరినప్పటి నుండి తనకు అన్ని విధాలుగా సహకరించిన మాజీ అన్నాడిఎంకె మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేస్తున్న' అని లేఖలో పేర్కొన్నారు. అన్నాడిఎంకెలో చేరడానికి ముందు గౌతమి రెండు దశాబ్దాలకు పైగా బిజెపిలో సభ్యురాలిగా ఉన్నారు. తన వ్యక్తిగత సమస్యల విషయంలో పార్టీ నాయకత్వం నుండి తగిన మద్దతు లభించలేదని పేర్కొంటూ ఆమె అక్టోబర్ 2023లో బిజెపికి రాజీనామా చేశారు. ఫిబ్రవరి 2024లో పళనిస్వామి సమక్షంలో అన్నాడిఎంకెలో చేరారు, ఆ తర్వాత అదే ఏడాది అక్టోబర్‌లో పార్టీ డిప్యూటీ ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్నాడిఎంకె, ఎన్‌డిఎ కూటమి తరపున గౌతమి చురుకుగా ప్రచారం నిర్వహించారు.

రాజ్యసభలో మూడింట రెండొంతుల

# మెజారిటీ చేరువలో ఎన్‌డిఎ

**న్యూఢిల్లీ :** ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించడానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించాలని ఎన్‌డిఎ శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ తరుణంలో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో తలెత్తిన తిరుగుబాటు ఆ కూటమి బలాన్ని పెంచేలా కనిపిస్తోంది. ఒకవైపు ప్రస్తుతం జరుగుతున్న రాజ్యసభ ఎన్నికలు ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల మెజారిటీ లక్ష్యానికి దగ్గరగా తీసుకెళ్లేలా ఉన్నాయి. మరో వైపు లోక్‌సభలో టిఎంసి సభ్యుల మద్దతు లభిస్తోంది. అయితే 363 అనే ఆ కీలక సంఖ్యను చేరుకోవడానికి ఇంకా చాలా దూరమే ఉంది. ప్రస్తుతం రాజ్యసభలో 148 మంది ఎంపిల బలం ఉన్న ఎన్‌డిఎ, ఎన్నికలు జరుగుతున్న జార్ఖండ్, మిజోరాంలలో స్వతంత్ర అభ్యర్థుల స్థానాలను గెలుచుకోవడం ద్వారా రాజ్యసభ ఎన్నికల ఈ విడతలో అదనంగా మూడు స్థానాలను



దక్కించుకోనుంది. ముగ్గురు టిఎంసి ఎంపిలు రాజీనామా చేయడంతో, ఉప ఎన్నికల తర్వాత పశ్చిమ బెంగాల్ నుండి ఆ మూడు స్థానాలను ఎన్‌డిఎ కైవసం చేసుకునే అవకాశం ఉంది. దీనివల్ల వారి మొత్తం బలం 154కి చేరుతుంది, ఇది రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీకి అవసరమైన సంఖ్య కంటే తొమ్మిది తక్కువ. నవంబర్ నాటికి ఉత్తరప్రదేశ్ నుండి 10 మంది ఎంపిల పదవీకాలం ముగిసి వారు పదవీ విరమణ చేయడంతో అధికార కూటమి బలం తగ్గవచ్చు. అదే సమయంలో రాష్ట్ర అసెంబ్లీలో మెరుగైన సంఖ్యా బలం కారణంగా సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభలో కొన్ని స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఎనిమిది మంది ఎంపీలున్న డిఎంకె బయటకు రావడం, మూడు స్థానాలున్న ఆప్ కూటమికి దూరంగా జరగడంతో ప్రస్తుతం ప్రతిపక్ష ఇండియా కూటమి వైపు 64 మంది ఎంపిలు ఉన్నారు. ఏడు స్థానాలున్న వైసిపి, ఆరు స్థానాలున్న బిజెడి వంటి పార్టీలు, ఎండిఎంకె రాజ్యసభలో ఏ వైపునైనా ఉండే అవకాశాలున్నాయి. అయితే లోక్‌సభలో, సుమారు 20 మంది టిఎంసి ఎంపిలు విడిగా ఒక వర్గంగా ఏర్పడి ఎన్‌డిఎకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆ కూటమి బలం 213కి పెరగవచ్చు. లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడానికి 363 మంది ఎంపిల మద్దతు అవసరం.

## గృహ లక్ష్మి, గృహ జ్యోతిని నిలిపివేయం

ప్రతిపక్షాల వదంతులను నమ్మొద్దు : కర్నాటక సిఎం డికె

**బెంగళూరు :** కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'గృహ లక్ష్మి', 'గృహ జ్యోతి' హామీ పథకాలను నిలిపివేస్తున్నారన్న వార్తలను ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఖండించారు. ప్రతిపక్షాలు వ్యాప్తి చేస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'గృహలక్ష్మి, గృహ జ్యోతి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణం. ఏ పరిస్థితుల్లోనూ వీటిని నిలిపివేయం. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేస్తున్న తప్పుడు వార్తలను ప్రజలు నమ్మకూడదు. కొందరు వ్యక్తులు మరణించిన వారి పేర్లతో నకిలీ రికార్డులను సృష్టించి పథకాల ప్రయోజనాలను పొందుతున్నారు' అని శివకుమార్ వివరించారు. అందుకే, ఈ హామీ పథకాల కోసం లబ్ధిదారుల పేర్లు, చిరునామాలు, ఖాతా వివరాలను సరిచూసి ధృవీకరించుకోవడానికి మాత్రమే వారిని తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరడం జరిగిందని ఆయన తెలిపారు. 'అన్ని హామీ పథకాలు వంద శాతం కొనసాగుతాయి, కాబట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'గృహ లక్ష్మి పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని మహిళా యజమానులకు నెలకు రూ. 2,000 ఆర్థిక సహాయం అందుతుంది. అలాగే 'గృహ జ్యోతి' పథకం ద్వారా గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది' అని అన్నారు.



# ఇండియా డిఎన్‌ఎలోనే 'ఇన్నోవేషన్'

'నీస్' నగరంలో 'భారత్ ఇన్నోవేట్స్ ప్రారంభోత్సవంలో మోదీ
భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ ఆగదని...అది ముందుకు కొనసాగుతుందని ఉద్ఘాటన

**నీస్ (ఫ్రాన్స్) :** భారతదేశం ఇకపై ప్రపంచ పరిష్కార మార్గాలను అందించే దేశం మాత్రమే కాదని, అయితే వాటికి ఒక ప్రధాన సహకారి కూడా అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆవిష్కరణ, సాంకేతికత ద్వారా ప్రపంచానికి సుస్థిర భవిష్యత్ కోసం న్యూఢిల్లీ దార్శనికతను మోదీ వివరించారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆదివారం ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సమక్షంలో నీస్ నగరంలోనిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్, కొన్ని ఇతర దేశాల నుంచి అగ్రశ్రేణి ఆవిష్కరణ స్టార్టప్‌లు ఒకచోట చేరాయి. 'భారత్ ఇన్నోవేట్స్' అనేది ప్రపంచ ఆవిష్కరణల తదుపరి అధ్యాయాన్ని భారతదేశంతో కలిసి రూపొందించాల్సిదిగా ప్రపంచానికి ఒక ఆహ్వానం' అని శనివారం రాత్రి నీస్ నగరానికి చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆవిష్కరణ, సమ్మిళితత్వంఅనేవి పరస్పర విరుద్ధం కావు అని, ఒకదానికొకటి పూరకం అని భారతదేశం నిరూపించింది అని మోదీ అన్నారు. దీని అర్థం ఏ ఆవిష్కరణ గొప్పతనమైనా కేవలం దాని తన మూల్యాంకనంలోనే కాకుండా దాని మానవ ప్రభావంలో కూడా ఉంటుందని తెలిపారు. భారతదేశం, ఫ్రాన్స్, మరి కొనిన దేశాల నుంచి అగ్రశ్రేణి ఆవిష్కరణల స్టార్టప్‌లను ఒకచోటికి చేర్చిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. ఒక దశాబ్దం క్రితం వరకూ భారతదేశాన్ని ప్రపంచం సాంకేతికతను స్వీకరించిన దేశంగానే చూసిందని, నేడు భారతదేశం సాంకేతికతను అందించే దేశంగా ఎదుగుతోందని మోదీ చెప్పారు. భారతదేశానికి చెందిన యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి మేలు చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని ప్రధానమంత్రి చెప్పారు. తన ప్రసంగంలో మోదీ తన ప్రభుత్వం చేపడుతోన్న సంస్కరణల కార్యక్రమాలను హైటెక్నాలజీ, రక్షణ, ఆవిష్కరణలు సహా అనేక కీలక రంగాలను హైలైట్ చేశారు. భారతదేశానికి సంబంధించిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదని, అది కొనసాగుతోందని ఆయన నొక్కిచెప్పారు.భారతదేశం సుస్థిర భవిష్యత్ కోసం ఆవిష్కరణలు చేస్తోందని, భారతదేశం ప్రపంచం కోసం ఉందని మోదీ పేర్కొన్నారు. భారతదేశం డిఎన్‌ఏలోనే 'ఇన్నోవేషన్' ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి భారత్–ఫ్రాన్స్ సంబంధాల గురించి కూడా ఆయన విపులీకరించారు. 'భారత్, ఫ్రాన్స్‌లకు ప్రత్యేకమైన భాగస్వామ్యం ఉంది. ఇది పరస్పర నమ్మకం, ఆవిష్కరణ, స్ఫూర్తి, భాగస్వామ్య దృష్టిని కలిగి ఉంది' అని మోదీ ఉద్ఘాటించారు. తన ప్రసంగంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ ఫ్రాన్స్ 'మేక్ ఇన్–ఇండియా' కార్యక్రమాన్ని గౌరవిస్తుందని, పారిస్ దానిలో భాగంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ భారతదేశాన్ని 'ఆవిష్కరణల దేశం'గా అభివర్ణించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), వాతావరణ మార్పు వంటి కీలక రంగాలలో ఢిల్లీ, పారిస్‌ల మధ్య 'నిజమైన భాగస్వామ్యం ఉందని ఆయన అభివర్ణించారు.






మేలో రిఫైనరీలు కొనుగోళ్లను పెంచడంతో...

# భారత్‌కు పెరిగిన రష్యా చమురు దిగుమతులు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎంతగా ఆంక్షలు విధించినప్పటికీ భారతదేశం–రష్యా మైత్రి మరింతగా బలపడుతోంది. మే నెలలో 5.8 బిలియన్ యూరోల (6.7బిలియన్ డాలర్ల) విలువైన రష్యన్ హైడ్రో కార్బన్‌లను దిగుమతి చేసుకోవడం ద్వారా రష్యా శిలాజ ఇంధనాలను ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద కొనుగోలుదారుగా భారతదేశం నిలిచింది, రిఫైనరీలు మాస్కో నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయని 'యురోపియన్ థింక్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్' (సిఆర్ఇఏ) ఒక నివేదికలో తెలిపింది. ఈ నెలలో బొగ్గు దిగుమతులు వరుసగా 550మిలియన్ యూరోలు, 429 మిలియన్ యూరోలుగా ఉన్నాయి. మే నెలలో భారతదేశానికి చెందిన మొత్తం ముడి చమురు దిగుమతుల పరిమాణం నెలవారీగా 8శాతం పెరిగిందని, రష్యా దిగుమతులలో నెలవారీగా 21 శాతం పెరుగుదల దీనికి పాక్షికంగా కారణం కాదని సిఆర్ఇఏ తెలిపింది. భారతదేశంలోని కొన్ని అతి పెద్ద శుద్ధి కేంద్రాలు రష్యా ముడి చమురు రాకలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. గుజరాత్‌లోని వడినాడ్ రిఫైనరీలో అన్‌లోడ్ చేయబడిన పరిమాణాలు ఏప్రిల్ నుండి ఏప్రిల్ స్థాయిల నుంచి 36శాతం పెరిగాయి. అదేసమయంలో, రాష్ట్రంలోని జామ్‌నగర్‌లోని రిఫైనింగ్ కాంప్లెక్స్‌కు సరఫరాలు 14శాతం పెరిగాయి. సిఆర్ఇఏ ప్రకారం ఈ ఏడాది ఆరంభంలో దిగుమతులను పున: ప్రారంభించిన తర్వాత ప్రభుత్వరంగ రిఫైనరీలు కూడా కొనుగోళ్లను విస్తరించాయి. 2025 నవంబర్ చివరిలో రష్యా ముడి చమురు దిగుమతులను నిలిపివేసిన న్యూ మంగళూరు, విశాఖపట్నం రిఫైనరీలు, మార్చిలో కొనుగోళ్లను పున: ప్రారంభించిన తర్వాత రష్యా చమురును కొనసాగించడం ప్రారంభించాయి. మే నెలలో న్యూమంగళూరుకు రష్యా ముడి చమురు సరఫరాలు నెలవారీగా 13 శాతం పెరగగా, విశాఖపట్నంలో దిగుమతులు 42 శాతం పెరిగాయని ఆ నివేదిక తెలిపింది. మారుతున్న రాజకీయ, భౌగోళిక ఆంక్షల సంబంధిత ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారతీయ రిఫైనరీలకు తక్కువ ధరకు లభించే రష్యన్ బ్యారెళ్ల ఆకర్షణీయత కొనసాగుతోందని స్పష్టం చేస్తూ, ఒడిశా తూర్పు తీరంలోని పారాదీప్ రిఫైనరీ కూడా రెండేళ్లలో అత్యధిక పరిమాణంలో రష్యన్ ముడిచమురును విడుదల చేసింది. తక్కువ ధరకు రష్యన్ ముడి చమురు కొనుగోళ్లు పెరగడం వల్ల, ఇంధన వ్యయాల భర్తీచేయడంతోపాటు రిఫైనింగ్ మార్జిన్‌లో, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి. తాజా గణాంకాల ప్రకారం...భారతదేశం, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, యునైటెడ్ స్టేట్స్ నుంచి సరఫరాలను వైవిధ్యపరుస్తున్నప్పటికీ, రష్యన్ చమురు భారతదేశం ముడిచమురు బాస్కెట్‌లో గణనీయమైన వాటాను కలిగి ఉంది. సిఆర్ఇఏ ప్రకారం మే నెలలో చైనా 50 శాతం) ముడిచమురు ఎగుమతులను కొనుగోలు చేసింది. ఆ తర్వాత భారతదేశం (36 శాతం), టర్కీ (6శాతం), ఇయు (5శాతం) ఉన్నాయి. 2026 జనవరి 21న రష్యన్ ముడిచమురు నుంచి తయారు చేయబడిన చమురు దిగుమతులపై యురోపియన్ యూనియన్ (ఇయు) నిషేధం ఉన్నప్పటికీ, రష్యన్ ముడి చమురు నుంచి ఉపయోగించే రిఫైనరీల నుంచి 10 రవాణాలు (షిప్‌మెంట్స్) ఇయు పోర్టులలో దించబడ్డాయని సిఆర్ఇఏ తెలిపింది.



## నేటి నుంచి కేరళలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**తిరువనంతపురం :** పని, విద్య, గృహ అవసరాల కోసం ప్రతిరోజూ ప్రయాణించే వేలాది మంది మహిళలకు ఇకపై ప్రయాణ ఖర్చుల గురించి ఆందోళన అవసరం లేదు. ఎందుకంటే, మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం కేరళ ఆర్‌టిసి బస్సులలో ఉచిత ప్రయాణాన్ని కల్పించే 'ప్రియదర్శిని' పథకాన్ని కేరళ ప్రభుత్వం సోమవారం ప్రారంభించనుంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రకటించిన ఐదు 'ఇందిరా హామీల'లో భాగంగా ఈ పథకం రూపొందించారు. ఇది జూన్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సాధారణ కేరళ ఆర్‌టిసి బస్సు సర్వీసులలో అందుబాటులోకి రానుంది. మొదటి దశలో, ఆదాయం, సామాజిక హోదా లేదా ఇతర ప్రమాణాలతో సంబంధం లేకుండా అన్ని వయసుల మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఈ ఉచిత ప్రయాణ సదుపాయానికి అర్హులు. దీని కోసం ముందస్తు నమోదు, పత్రాల సమర్పణ లేదా దరఖాస్తు ప్రక్రియ వంటివి ఏవీ అవసరం లేదని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రయాణ సమయంలో కండక్టర్ల వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ టికెట్ మెషిన్ (ఇటిఎం) ద్వారా 'జీరోవాల్యూ' (సున్నా విలువ కలిగిన) ప్రియదర్శిని టికెట్‌ను పొందడం మాత్రమే ప్రయాణికులు చేయాల్సి ఉంటుంది. ఈ టికెటింగ్ విధానం ప్రతి ప్రయాణాన్ని డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తుంది, తద్వారా పారదర్శకమైన లెక్కల నిర్వహణ, ఆర్‌టిసి ఖర్చుల రీయింబర్స్‌మెంట్ (చెల్లింపు) సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ నడుపుతున్న మొత్తం 3,125 సాధారణ బస్సులలో ఈ రాయితీ అందుబాటులో ఉంటుందని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఈ సదుపాయం విస్తరిస్తుందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఉదయం 8.30 గంటలకు తంపనూర్ బస్ టెర్మినల్ వద్ద ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన అక్కడి నుండి సచివాలయ దర్బార్ హాల్ వరకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తారు. ఈ ప్రారంభ సర్వీసును పూర్తిగా మహిళా సిబ్బందితోనే నడిపే అవకాశం ఉంది. ప్రస్తుత రూపంలో ఉన్న ఈ రాయితీ వల్ల కెఎస్‌ఆర్‌టిసికి నెలకు రూ. 60 కోట్లకు పైగా లేదా ఏడాదికి సుమారు రూ. 800 కోట్ల భారం పడుతుందని, ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని ముఖ్యమంత్రి సతీశన్ ఇటీవల పేర్కొన్నారు.




చిన్న వ్యాపారాలు ఆర్థికంగా బలోపేతం కాకుంటే

# భారత్ శ్రేయస్సును సాధించలేదు

ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని పరిష్కరించుకోవాలి : ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్

**ఆగ్రా :** చిన్న వ్యాపారులు, వ్యాపారాలు ఆర్థికంగా బలోపేతం కానంత వరకు భారతదేశం శ్రేయస్సును సాధించలేదని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని, పరిష్కరించాల్సిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. ఆగ్రాలో ఆదివారం జరిగిన 'విజన్ ఇండియా (పిడిఎ)' సెమినార్‌లో పాల్గొని ప్రసంగించారు. చిన్న వ్యాపారాలు ఎందుకు క్షీణిస్తున్నాయో గుర్తించడంపై, అలాగే పారిశ్రామికవేత్తలు, భాగస్వాములతో చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనడంపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలిపారు. చిన్న వ్యాపారాలు ఎందుకు నాశనమవుతున్నాయనే దానిపై మీ సూచనలు కోరేందుకు తాను ఆగ్రాకు వచ్చానని చెప్పారు. మనం భారతదేశాన్ని నూతన రూపంలో చూడాలనుకుంటే, చిన్న వ్యాపారాల క్షీణత వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవడంతోనే ప్రారంభించాలని యాదవ్ సూచించారు. వ్యాపారులు,



పారిశ్రామికవేత్తల ఆర్థిక శ్రేయస్సు లేకుండా శ్రేయస్సును సాధించలేమని పేర్కొన్నారు. మన వ్యాపార వర్గం సుసంపన్నం కానంత వరకు, మనం శ్రేయస్సు వైపు పయనించలేమని, చిన్న వ్యాపారాలు, వాటిలో నిమగ్నమైన వారి గురించి విస్తృత స్థాయిలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వ్యాపారుల సమస్యలు, ఆశలు, ఆకాంక్షలను వాటి స్వభావం, అవసరాలకు అనుగుణంగా సరిగ్గా వర్గీకరించనంత వరకు అర్థం చేసుకోలేమని, పరిష్కరించలేమని యాదవ్ అన్నారు. 2012 నుండి 2017 వరకు సాగిన సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాన్ని ప్రస్తావిస్తూ, ఆ కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించాయని ఆయన అన్నారు. విజన్ ఇండియా, పిడిఎ చర్చల ద్వారా పారిశ్రామికవేత్తలు, నిపుణులు, మేధావులను అనుసంధానించి, ఒక ప్రగతిశీల సంభాషణలో పాల్గొనాలని కోరుకుంటున్నామన్నారు. రైతులు, వ్యవసాయంపై దృష్టి సారించి ఘజియాబాద్‌లో గతంలో నిర్వహించిన విజన్ ఇండియా కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. 'పొలాలు నవ్వినప్పుడు, దేశం నవ్వుతుంది అని చెప్పాము. అక్కడే చిన్న వ్యాపారాలు, పరిశ్రమల చక్రాలు తిరగడం మొదలవుతాయి, మన ఆర్థిక వ్యవస్థ కూడా అక్కడే ప్రారంభమవుతుంది' అని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక విధానానికి 2013లోనే పునాది పడిందని, రాష్ట్రం ఇప్పటికీ అదే విధానానికి సవరించిన రూపాన్ని అనుసరిస్తోందని ఎస్‌పి అధినేత తెలిపారు. భవిష్యత్తులో వచ్చే సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం ఆగ్రాలో ఐటి నగరాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందని కూడా ఆయన హామీ ఇచ్చారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

●దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా బావిలోకి దూసుకెళ్లిన వ్యాన్ ●8 మంది మృతి

**మహారాష్ట్ర:** ఘోర ప్రమాదం ..మహారాష్ట్రలో దైవదర్శనం ముగించుకుని వస్తుండగా జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సోలాపూర్ జిల్లా మల్శిరాస్ తహసీల్‌లో ఆదివారం నాడు జరిగిన ఒక ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. రంజినీ గ్రామానికి చెందిన 15 మంది భక్తులు సిద్ధనాథ్ ఆలయంలో దైవ దర్శనం ముగించుకుని, పికప్ వాహనంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. తాండుల్వాడి గ్రామం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ అదుపు కోల్పోవడంతో, ఆ వాహనం ఒక్కసారిగా రోడ్డు పక్కనే ఉన్న ఒక వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. బావిలో నీరు నిండి ఉండటంతో వాహనం మునిగిపోయి, నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు సహా మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సోలాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ అతుల్ కులకర్ణి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అధికారుల సమయానుకూల స్పందన వల్ల బావిలో మునిగిపోతున్న మరో ఏడుగురు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మృతదేహాలను వెలికితీసే ప్రక్రియతో పాటు, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఈ ఘోరం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ సాగుతోంది.కాగా, ప్రమాదం జరిగిన సదరు వ్యవసాయ బావికి ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడం వల్లే వాహనం నేరుగా లోపలికి దూసుకెళ్లి ఇంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# రష్యానౌకపై బ్రిటన్ సైనికచర్య

## షాడోఫ్లీట్‌లో 500 నౌకలపై ఆంక్షలు



**లండన్:** రష్యాకు చెందిన షాడో ఫ్లీట్‌లో స్మిర్టోస్ అనే ఒక వాణిజ్య చమురు ట్యాంకర్‌ను మొదటిసారి బ్రిటన్ దక్షిణ తీర ప్రాంతంలో అడ్డుకుంది. దీని ఆధారంగా దాదాపు 500 షాడో ఫ్లీట్ (రహస్య నౌకాదళం)పై ఆంక్షలు విధించామని, ఇక వాటిపై నిఘా కొనసాగిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చెప్పారు. ఈ చర్యను రష్యాకు అతిపెద్ద ఎదురుదెబ్బగా బ్రిటన్ రక్షణమంత్రి డాన్ జార్విస్ చెప్పారు. ఎంతో ధైర్యం,వృత్తినైపుణ్యాలతో బ్రిటన్ దళాలు ఈ ఆపరేషన్ నిర్వహించాయని చెప్పారు. యూరప్‌లో ఉక్రేన్ సహా మిత్రదేశాలకు మద్దతుగా ఈ ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. ఐరోపా అంతటా దాడులు చేసి ముప్పు కలిగించే రష్యా సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నామ్న, ఈ సహకారం కొనసాగిస్తామని చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున ఇంగ్లీష్ ఛానల్‌లో మొదటిసారి రష్యా షాడో ఫ్లీట్‌ను బ్రిటన్ రాయల్ కమాండోలు, నేషనల్ క్రైమ్ ఏజన్సీ బృందాలు ఫ్రాన్స్ దళాల సమన్వయంతో అడ్డగించి అందులోకి ప్రవేశించారు. ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు బ్రిటన్ విదేశీమంత్రిత్వశాఖ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. దాదాపు ఆరు గంటలసేపు ఈ సైనిక చర్య కొనసాగింది. మారిటైమ్ ఎయిర్ గ్రూప్, ఒక ఆర్ఎఫ్‌పి–8 విమానం,హెచ్ఎంఎస్ సందర్లాండ్, హెచ్ఎంఎస్ లెడ్‌బరీ నౌకలు ఈ బృందాలకు రక్షణగా నిలిచాయి.అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగానే బ్రిటిష్ బలగాలు ఈ షాడో ఫ్లీట్‌ను తనిఖీ చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ స్మిర్టోస్ ట్యాంకర్‌నౌకను బ్రిటన్ దక్షిణతీరంలోని ఒక లంగరువేసే ప్రాంతానికి తరలించి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు. ఉక్రేన్‌లో యుద్ధానికి ఆజ్యం పోసేందుకు అక్రమంగా రష్యా నిధులు సంపాదిస్తోందని, ఈ రహస్య నౌకలను దాక్కోకుండా బయటకు తీస్తామని బ్రిటన్ పేర్కొంది. బ్రిటన్ విధించిన ఆంక్షల ప్రకారం, రష్యా నౌకలను ఇకమీదట బ్రిటన్ జలాలలోంచి ప్రయాణం చేయనివ్వరు. బ్రిటన్‌కు చెందిన బీమా సంస్థలు, బ్రోకర్ సేవలను కూడా రష్యా నౌకలకు నిలిచిపోతాయి. రష్యా నౌకలను ఇకమీదట బ్రిటన్ గస్తీ వెంబడిస్తుంది. దీనివల్ల రష్యా చమురు రవాణా గణనీయంగా దెబ్బతింటుందన్నది బ్రిటన్ ఉద్దేశం.రష్యాపై విధించిన ఆంక్ష లను తప్పించుకోవడంకోసం ఈ నౌకలు రహస్యంగా చమురు రవాణా సాగిస్తున్నాయని బ్రిటన్ ఆరోపించింది. దీనిని షాడో ఫ్లీట్‌గా బ్రిటన్ అభివర్ణించింది. అంతర్జాతీయస్థాయిలో విధించిన ఆంక్షలను తప్పించుకోవడంకోసం 700కు పైగా రష్యా నౌకలు చమురు రవాణాలు సాగిస్తున్నాయని, 75 శాతం రష్యా చమురు రవాణా ఈ నౌకల ద్వారా జరుగుతోందని, ఈ నౌకల ద్వారా వచ్చే నిధులే రష్యాకు ప్రాణవాయువు లాంటిదని, దీని ద్వారా వచ్చే నిధులను ఉక్రేన్ యుద్ధానికి రష్యా ఉపయోగించుకుంటున్నదని, ఈ నౌకలను తాము మొదటిసారి పట్టుకుని ఇక నిఘా పెడుతున్నామని స్టార్‌మర్ ప్రకటించారు. అంటే ఇకమీదట ఈ నౌకలను బ్రిటన్‌కు చెందిన ఓడరేవుల్లోకి అనుమతించరు, నౌకలు ఉపశమనం పొందటానికి,సేదదీరి మరమ్మతులు చేసుకోవడానికి వీలు కల్పించరు.

### ఒమన్ తీరంలో
# స్తంభించిన భారత్ నౌక

## 14 మంది సిబ్బంది తరలింపు



**దుబాయ్:** ఒమన్ తీరంలో స్తంభించిపోయిన ఒక భారత నౌకలో చిక్కుకున్న 14 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి తరలించారు. మస్కట్‌లోని భారత దౌత్యకార్యాలయం ఆదివారం ఒక ప్రకటన చేస్తూ, ఇంజన్ వైఫల్యం కారణంగా ఒమన్ తీరంలో విరాట్–1 భారత నౌక ఆకస్మికంగా ఆగిపోయింది. ప్రస్తుతం హోర్ముజ్‌లో ఇంకా సడలని ఉద్రిక్తతల కారణంగా ఒమన్ నావికాదళం సహాయంతో నౌకలలో 14 మంది భారతీయ నావికులను సురక్షితంగా తీరానికి తరలించారు. ఇంజన్ వైఫల్యం చెందినట్లు తెలిసిన వెంటనే భారత సిబ్బందిని లైఫ్ రాఫ్ట్‌లోకి ఎక్కించామని ఒమన్ అధికారుల సహాయంతో వారిని సురక్షితంగా తరలించామని దౌత్యకార్యాలయం ఎక్స్ వేదికగా తెలియజేసింది.గడచినవారంలో ఒమన్ తీరంలో యుద్ధం కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయి. భారత నౌకలపై పదే పదే అమెరికా దాడులు చేయడంతో ఢిల్లీలో ఉన్న భారత అధికారులు రెండుసార్లు అమెరికా దౌత్యవేత్తలను తమ సమక్షానికి పిలిపించి నిరసన ప్రకటించారు. ఐతే ఈ దాడులు అమెరికా చేయలేదని, ఈ దాడులకు, ముగ్గురు భారత నావికుల మరణాలకు ఇరాన్ డ్రోన్ దాడులు కారణమని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రకటనను ఇరాన్ తిరిగి ఖండించింది.

# ఇరాన్ ఐక్యతను తక్కువ అంచనా వేస్తున్న అమెరికా

## న్యాయాధిపతి ఘోలం హొస్సేన్



**టెహ్రాన్:** ఇరాన్ ఐక్యతను శత్రువు తక్కువ అంచనా వేస్తున్నాడని ఆ దేశ న్యాయవ్యవస్థ ఉన్నతాధిపతి ఘోలం హొస్సేన్ మొహ్సేనీ ఎజెయి అన్నారు. సోషల్ మీడియాలో ఆదివారం ఒక పోస్టింగ్ పెడుతూ, ఇరాన్ జాతీయ ఐక్యతను బలహీనపరచాలని శత్రువు ప్రయత్నిస్తున్నాడని, నిరంతర సంఘీభావ ప్రకటనల ద్వారా అలాంటి కుట్రలను ఇరాన్ ప్రజలు భగ్నం చేస్తారని హెచ్చరించారు. ఇరాన్ జాతీయ ఐక్యతను దెబ్బతీసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడంపైనే శత్రువులు దృష్టి కేంద్రీకరించారని, ఇరాన్ జాతిని వ్యతిరేక భావాలతో రెచ్చగొట్టాలని ప్రయత్నం చేస్తున్నాయని, కానీ శత్రువుల కోరికలన్నీ వారి తోపాటే వారి సమాధిలోకే చేరుకుంటాయని అన్నారు. శత్రువులను ఎదుర్కోవడానికి ఇరాన్ వీధుల్లో అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆర్థికంగా,సామాజికంగా శత్రువులు చేసే బెదిరింపులను ఎదుర్కోవడానికి ఇరాన్ జాతి సిద్ధంగా ఉందన్నారు.

# స్విట్జర్లాండ్‌లో జనాభా పరిమితికి తిరస్కృతి

## రిఫరెండంలో ప్రాథమిక సంకేతాలు




**బెర్న్:** అల్ఫైన్స్ ప్రాంత దేశం స్విట్జర్లాండ్‌లో నివసించే జనాభాకు ఒక శాశ్వత పరిమితి విధించడంపై ఆదివారం రిఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ) జరిగింది. ఈ రిఫరెడం పూర్తి ఫలితాలు వెలువపోయినప్పటికీ ట్రెండ్‌కు అనుగుణంగాను, తొలుత సేకరించిన సమాచారం ప్రకారం 55 శాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు. 45 శాతం ప్రజలు మాత్రమే సుముఖత వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్ దేశ జనాభా సంఖ్య కోటి దాటకముందే జాగ్రత్త పడాలని, 2050 నాటికి ఆ సంఖ్య కోటికి మించకూడదనే పరిమితి విధించాలా? వద్దా? అనే విషయంపై ఈ రిఫరెండం జరిగింది. గృహ నిర్మాణం, ప్రజా సేవలు,రవాణా, రైళ్ళల్లో రద్దీ, పర్యావరణం వంటి అనేక అంశాలపై ఒత్తిడి భవిష్యత్తులో పెరగ కూడదన్నదనేదే ప్రధాన లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో వలస ప్రజల భయం పెరుగుతున్న తరుణంలో ఆయా దేశాలు కొత్త కొత్త నిర్ణయాలతో వింత పోకడలు పోతున్నాయి. స్విట్జర్లాండ్ కూడా వలస ప్రజల కారణంగా కిటకిట లాడిపోతోందని, దేశంలో ఖర్చులు,ధరలు పెరిగిపోతున్నాయని,స్విట్జర్లాండ్ తన వాస్తవ ఉనికినే కోల్పోతోందని మితవాదులు,సంప్రదాయ వాదులు వాదిస్తున్న తరుణంలో భిన్నాభిప్రాయాల సంఘర్షణలో ఈ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ దేశంలో ప్రతి విషయాన్ని ఓటింగ్ ద్వారా మాత్రమే నిర్ణయిస్తారు. కొంతమంది ఈ ప్రజాభిప్రాయ సేకరణను వలస వ్యతిరేక విధానంగా పేర్కొంటున్నారు. 2002లో స్విట్జర్లాండ్ దేశ జనాభా కేవలం 73 లక్షలు మాత్రమే. ఆ తర్వాత శరవేగంగా ఈ సంఖ్య 91 లక్షలకు పెరిగింది. వీరిలో 27 శాతం మంది విదేశాలలో జన్మించి అక్కడకు వెళ్ళి స్థిరపడిన నివాసితులు. అదుపులేని వలసలు దేశానికి గుర్తింపు లేకుండా చేస్తాయన్నది మితవాదుల వాదన. అదుపులేని వలసలవల్ల స్విట్జర్లాండ్ తన వాస్తవికతను కోల్పోతోందని మితవాద పీపుల్స్ పార్టీ ఎంపీ బెర్న్ క్రాటన్ వాదిస్తున్నారు. కానీ సోషల్ డెమోక్రాట్స్‌కు చెందిన జెనిస్ (బెర్న్ నగర పాలక మండలి సభ్యుడు) సహా వ్యాపారవర్గాల సంఘాలు, కార్మిక సంఘాలు ఈ వాదనలను గందరగోళ చర్యగా పేర్కొంటూ నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనవల్ల దేశంలో కార్మికుల కొరత పెరుగుతుందని, యూరోపియన్ యూనియన్‌తో కష్టపడి సాధించుకున్న సంబంధాలను కూడా ఈ నియంత్రణ దెబ్బతీస్తుందని, స్విస్ దేశం ఏకాకిగా మారుతుందని, ఇ.యుతో ఒప్పందాలను రద్దుచేసుకోవాల్సి వస్తుందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

# మెక్సికోలో మరో మేయర్ కాల్చివేత

**20 ఏళ్ళలో 100 మంది మేయర్లు హత్య**
**ఇవన్నీ మాదక ద్రవ్యాల నేర ముఠాల పనే**



**మెక్సికోసిటీ:** దక్షిణ మెక్సికోలో శాన్ మిగెల్ అమాటిట్లాన్ నగర మేయర్ జోయల్ బ్రావో దారుణహత్యకు గురయ్యారు. దీంతో గడచిన ఇరవై సంవత్సరాలలో మెక్సికోలో సాయుధ దుండగుల చేతుల్లో హత్యకు గురైన మేయర్ల సంఖ్య 100కు చేరుకుంది. గత ఏడాది దాదాపు 60 మంది రాజకీయ హత్యలకు బలయ్యారు. గత నెలలో ఓక్సాకాలో ఒక మేయర్ హత్యకు గురయ్యారు. నెలరోజుల్లోనే మళ్ళీ బ్రావో హతుడయ్యారు. మెక్సికోలో మాదక ద్రవ్యాల అంతర్జాతీయ అక్రమ రవాణా ముఠాల ప్రభావం చాలా ఎక్కువ. ప్రస్తుతం సాయుధ కాల్పుల్లో హతుడైన మేయర్ జోయల్ బ్రావో కూడా మాదక ద్రవ్యాల ముఠాలకు వ్యతిరేకంగా పోరాడే నాయకుడే. ఈ కేసులో తక్షణం ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. దాదాపు ఏడువేల మంది జనాభాగల అమాటిట్లాస్ నగర మేయర్ బ్రావో సాయుధ దాడిలో మరణించినట్లు ఓక్సాకా రాష్ట్ర ప్రాసిక్యూటర్లు ఆదివారం ప్రకటించారు. ఓక్సాకాలో సమాజంపైన,చట్టాలపైనా నేర ముఠాల పేచేయిని సాగనివ్వం అని గవర్నర్ సల్మో జారా ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.ఈ ప్రాంతంలో పోలీసు పహారా పెంచామని, ఫెడరల్ బలగాల సహాయంతో ఒక వ్యూహాత్మక బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కాల్పులు జరిగిన వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఉన్నతాధికారులు,బలగాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. కాగా ఓక్సాకాలో మరో పట్టణమైన శాంటియాగో అమోల్టెపెక్ మేయర్ మారియో హెర్నాండెజ్ గార్సియా గతనెలలో సాయుధ దుండగులు చేసిన దాడిలో మరణించారు. ఈ దాడి సందర్భంగా మరో ఇద్దరు కూటి నేలకొరిగారు. మెక్సికోలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వ్యవస్థీకృత ముఠాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రానికి సరిహద్దుగా ఉన్న ఓక్సాకాలోని జలిస్కో న్యూవా జనరేషన్,సినలోవా అనే రెండు మాదక ద్రవ్యాల ముఠాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. మాదక ద్రవ్యాలను అక్రమ రవాణా చేసే డ్రగ్ కార్టెల్స్‌పై ఇటీవలికాలంలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటం ఉద్ధృతంగా కొనసాగుతోంది. లాటిన్ అమెరికాలో కూడా శనివారంనాడు అమెరికా–వెనిజులా దళాలు సంయుక్త ఆపరేషన్‌లో పేరుమోసిన ''ట్రెన్ డీ అరాగ్వా''అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠా నాయకుడు నీనో గెర్రారో కైనటిక్ దాడిలో హతుడయ్యాడు. మరో తొమ్మిదిమంది అంతర్జాతీయ కిందిస్థాయి నాయకులను కూడా హతమార్చారు.వలస ప్రజల నుండి డబ్బు వసూలు చేయడం, కాంట్రాక్టు హత్యలు, స్త్రీల అక్రమ రవాణా, కిడ్నాపులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఈ డ్రగ్ కార్టెల్స్‌కు అంతర్జాతీయస్థాయిలో నిత్యకృత్యాలు. ట్రంప్ ఈ ముఠాలను అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో పోల్చారు.

# సన్నద్ధం కండి
**(మొదటి పేజీ తరువాయి)**



పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూ చించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల ని ర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సిఎం సూచించారు.

**వర్షాల కారణంగా**
**తాగునీరు కలుషితం కాకుండా చూడాలి**

వర్షాల కారణంగా తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డిజిపి ఆనంద్‌ను ఆదేశించారు.

**అధికారుల నిర్లక్ష్యంపై**
**సిఎం తీవ్ర స్థాయిలో ఆగ్రహం**

జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. వర్షాల సన్నద్ధతపై జూన్ 1న సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని సిఎం తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి ఆనంద్‌ను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తా**

వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిజిపికి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు.

**విద్యుత్ సరఫరాకు అంతరాయంపై ఆగ్రహం**

వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్ర స్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు.

**ఖరీఫ్‌కు పూర్తి సన్నద్ధత: మంత్రి తుమ్మల**

ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా పంటల ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. తక్కువ నీటితో సాగయ్యే కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు వంటి పంటలను ప్రోత్సహిస్తున్నామని, ఖరీఫ్‌కు 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. రైతుల సౌకర్యార్థం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో మార్పులు చేసి, మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.అలాగే తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం ద్వారా రైతులకు వాట్సాప్ ద్వారా వాతావరణ సమాచారం చేరవేస్తున్నామని, ఇప్పటివరకు 18 జిల్లాల్లో 28 లక్షల మందికి పైగా రైతులకు సందేశాలు పంపినట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు.

# భారీ మోసం..
**(మొదటి పేజీ తరువాయి)**

కార్యాలయాన్ని సంప్రదించింది. అక్కడ సంస్థ ప్రతినిధులు 'అన్నదాత సెంటర్లు' పేరుతో కేంద్ర ప్రభుత్వ అనుబంధ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామాల్లో 40 శాతం రాయితీతో నిత్యావసర సరుకులు అందిస్తామని వివరించారు. సంస్థలో జోనల్ మేనేజర్‌గా చేరిన కృష్ణవేణి, గద్వాల జిల్లా నుంచి పలువురు ఉద్యోగులను, అన్నదాత సెంటర్ల ఏర్పాటుకు వందలాది మందిని చేర్పించింది. గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, వనపర్తి జిల్లాల నుంచి మొత్తం 213 మంది ఉద్యోగులు, 259 అన్నదాత సెంటర్లు సంస్థలో చేరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగుల నుంచి ల్యాప్‌టాప్ సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.31.95 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. అలాగే అన్నదాత సెంటర్ల ఏర్పాటుకు ఒక్కో కేంద్రం నుంచి రూ.27 వేల చొప్పున రూ.69.93 లక్షలు, మరో 34 కేంద్రాల నుంచి సుమారు రూ.55 లక్షలు సేకరించినట్లు ఆరోపించారు. అయితే డబ్బులు వసూలు చేసిన తర్వాత సరుకులు సరఫరా చేయకపోవడంతో పాటు ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేదని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. తనకు నెలకు రూ.50 వేల జీతం ఇవ్వాల్సి ఉండగా ఎనిమిది నెలల జీతం బకాయి ఉందని, జిల్లా ఇన్‌చార్జిలు, ఇతర ఉద్యోగులకు కూడా నెలల తరబడి జీతాలు చెల్లించలేదని తెలిపారు.డబ్బుల కోసం నిలదీయగా షంషాబాద్ గోదాం మేనేజర్ రఘు రూ.24.54 లక్షల చెక్కు ఇచ్చినప్పటికీ, బ్యాంకులో నిధుల లేమి కారణంగా ఆ చెక్కు బౌన్స్ అయినట్లు వెల్లడించారు. అనంతరం సంస్థ నిర్వాహకులను ప్రశ్నించగా, సంస్థ నష్టాల్లో ఉందని చెప్పి, తమకు ఎవరూ తెలియరని, ఏం చేసుకుంటే అది చేసుకోవచ్చని బెదిరించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో సంస్థ సీఈఓ సందీప్ చౌదరి, సనముల్లా ఖాన్ (ఆర్యన్), ఆకాశపు వీర చైతన్య, సైదా బేగం, సత్య తదితరులు ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 213 మంది ఉద్యోగులు, 259 మంది కాంటీన్ నిర్వాహకులు తమ డబ్బు, ఉద్యోగాలు, భవిష్యత్తును కోల్పోయారని బాధితులు ఆరోపించారు.ఎస్ఐ పి.ప్రత్యుష కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆజ్ఞలు పాటిస్తున్నారు!
**(మొదటి పేజీ తరువాయి)**

రుణపడి ఉంటారని ఆరోపించారు. ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ప్రస్తుతం నిలిచి ఉన్న ఒక నౌకలో వైద్యపరమైన సమస్యలతో ఒక భారత జాతీయుడు మరణించిన విషయాన్ని రాహుల్‌గాంధీ మరో పోస్టులో ప్రస్తావించారు. రాజీపడిన ప్రధాని పాలనలో భారతీయుడిగా ఉండటం అంటే దయనీయమైన దుస్థితిని ఎదుర్కోవడమేనన్నారు. విదేశీ శక్తులు మన పౌరులను చంపుతున్నాయని, మన ప్రభుత్వం ఒక విధేయుడైన సేవకుడిలా వినయంగా ఆదేశాలను పాటిస్తోందని, మన పౌరులు ధిక్కులేని స్థితిలో కుళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌కు చెందిన రెండవ ఆఫీసర్ మృతదేహం కుళ్లిపోతోందని ఎంటి సెలెస్టియల్ భారత కెప్టెన్ చెప్పినట్లు పేర్కొన్న ఒక పోస్ట్‌ను ట్యాగ్ చేస్తూ, ఈ భారతీయుడిని ఇప్పుడే ఇంటికి తీసుకురండి. అని రాహుల్ అన్నారు. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకారం, ప్రస్తుతం ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో నిలిచి ఉన్న ఒక నౌకలో వైద్యపరమైన సమస్యల కారణంగా ఆ భారత జాతీయుడు మరణించాడు.

**దేశ ప్రయోజాలను**
**మోదీ నిత్యం తాకట్టు పెడుతున్నారు : ఖర్గే**

ముగ్గురు భారతీయ నావికుల మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా తీవ్ర విమర్శలు చేశారు. భారతదేశ ప్రపంచ స్థాయి ప్రతిష్టను, సార్వభౌమాధికారాన్ని ఆయన తక్కువ చేశారనడానికి ఇక ఎలాంటి రుజువులూ అవసరం లేదని ఖర్గే ఆరోపించారు. భారతదేశ జాతీయ ప్రయోజనాలను ప్రతిరోజూ తాకట్టు పెడుతున్నారని ఖర్గే మండిపడ్డారు. 'అమెరికా చర్య కారణంగా ఒమన్ వద్ద మరణించిన భారతీయ నావికుల భౌతికకాయాలు భారత్‌కు చేరుకుంటున్న తరుణంలో, ఆ ముగ్గురు నావికుల మరణం పట్ల దేశంతో కలిసి నేను కూడా సంతాపం తెలియజేస్తున్నాను' అని ఖర్గే 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ విషాదకరమైన ఘటన జరిగి మూడు రోజులు గడిచినా ప్రధాని మోదీ నుండి ఎలాంటి బహిరంగ ప్రకటన గానీ, కనీసం సంతాప సందేశం గానీ రాలేదని విమర్శించారు. దేశం దీని కోసం ఎదురుచూస్తోంది మోదీ జీ అని ఖర్గే పేర్కొన్నారు. ''దేశాన్ని తలవంచనివ్వం అని మీరు మాట్లాడారు, కానీ భారతదేశ ప్రపంచ స్థాయి ప్రతిష్టను, సార్వభౌమాధికారాన్ని మీరు తక్కువ చేశారనడానికి ఇప్పుడు ఎలాంటి రుజువులూ అవసరం లేదు' అని ఖర్గే ఆరోపించారు. తీవ్రమైన ప్రశ్నలకు సమాధానాలు లేని సమయంలో మౌనం... జవాబుదారీతనానికి ప్రత్యామ్నాయం కాదన్నారు. దేశానికి స్పష్టత అవసరం, అలాగే బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలి అని కాంగ్రెస్ అధినేత అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# గంట మోగింది (మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు 20 నుంచి 25 నిమిషాల పాటు తప్పనిసరిగా డిజిటల్ పాఠాలను బోధించనున్నారు.మరోవైపు రాష్ట్రంలో వారం రోజుల పాటు వర్షాలు కురవనున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులలో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యాశాఖ కూడా జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించింది.

# బర్తరఫ్ చేయాలి (మొదటి పేజీ తరువాయి)

అవకతవకలకు గురయ్యాయని గుర్తుచేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు.

**ప్రశ్నపత్రాల లీకేజీని ప్రశ్నిస్తే దేశద్రోహమా? : పుట్ట లక్ష్మణ్**

నీట్, సిబిఎస్‌ఈ వంటి పరీక్షల పేపర్లు లీక్‌ను, పరీక్షలు రద్దు కావడాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశద్రోహులుగా, హిందుమత వ్యతిరేకులుగా చిత్రికరిస్తోందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాలు లీకేజీ కావడంతో పరీక్షలు రాసిన 22 లక్షల మంది విద్యార్థి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయకపోతే, ప్రధాని మోదీ ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# తక్షణమే చర్యలు
**(మొదటి పేజీ తరువాయి)**



ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంటరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టలక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్రతో పాటు పలు యువత, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'జీనా హై తో మర్నా సీకో, కదం కదం పర్ లడ్ నా సీకో' అని నినాదం చేశారు. విద్యావ్యవస్థలో మార్పు వచ్చే వరకు 'చైతన్య పోరాటం' సాగాలని సభలో వక్తలు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ పరీక్షా పత్రాల లీకేజీల వంటి ఘటనలకు రాజకీయ జవాబుదారీతనం ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసే సంప్రదాయం బలపడాలని సూచించారు. 'మీరు ఐదు ట్రిలియన్ డాలర్లు తేలేరు కానీ మేము తెస్తాం, మాకు ఉద్యోగాలు ఇవ్వండి అని అడుగుతున్నాం, ఏం తెరగా పరాన్న జీవులు కాదు, పారసైట్స్‌గా బతకాలని అనుకోవడం లేదు, కష్టపడి పనిచేయాలనుకుంటున్నాం,' అని అన్నారు. యువత ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయం కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ దేశంలో ఎంతో సంపద ఉన్నప్పటికీ నిరుద్యోగం ఎందుకు తాండవిస్తోందని, యువతను కాక్రోచ్‌లుగా సంబోధించడం ఏంటి? అని ప్రశ్నించారు. దేశంలో కేవలం 6 శాతం యువతకే నైపుణ్యాలు ఉన్నాయని, మిగతా వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు ఎందుకు అందడం లేదని నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న ధర్మేంద్ర ప్రధాన్‌ను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఈ ఉద్యమం అధికారం కోసం కాదు:**
**సోనమ్ వాంగ్‌చుక్**

సోనమ్ వాంగ్‌చుక్ మాట్లాడుతూ ఈ ఉద్యమం రాజకీయ అధికారం కోసం కాదన్నారు. సిజెపి ఎవరి పదవులను లాక్కోవడానికో. లేదా కొత్త రాజకీయ పార్టీగా అధికారంలోకి రావడానికి ఏర్పడిన వేదిక కాదని స్పష్టం చేశారు. యువత హక్కులు, విద్యా వ్యవస్థలో సంస్కరణలు, ప్రజల్లో చైతన్యం కల్పించడమే సిజెపి ప్రధాన లక్ష్యమన్నారు. విద్యా వ్యవస్థలో పరీక్షల నిర్వహణ మాత్రమే కాకుండా మూలస్థాయిలో సంస్కరణలు అవసరమన్నారు. పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు వంటి ఘటనలకు బాధ్యులను గుర్తించి జవాబుదారీతనం నిర్ధారించాలని ఆయన కోరారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందేలా విద్యా రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కెబిఆర్ పార్క్ పరిరక్షణ వంటి అంశాల్లో హైదరాబాద్ ప్రజలు చేపట్టిన ఉద్యమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్యం సమర్థవంతంగా పనిచేయాలంటే ప్రజలు భయరహితంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలని వాంగ్‌చుక్ అభిప్రాయపడ్డారు. విద్య, పర్యావరణం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, సహాయ కార్యదర్శి యుగంధర్, రాష్ట్ర సమితి సభ్యులు పి. శివ కుమార్, రాజ్ కుమార్, మధుకర్, అలీ, గిరి, ప్రదీప్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు గ్యార నరేష్, లేనిన్, చేతన్య యాదవ్, అనిల్, అన్వర్, అరుణ్, బాను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# టర్కీని చిత్తు చేసిన ఆస్ట్రేలియా



ఫిఫా వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్లో ఆస్ట్రేలియా జట్టు శుభారంభం చేసింది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన గ్రూప్‌డి ఓపెనింగ్ మ్యాచ్లో టర్కీపై 2–0 తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ బరిలోకి దిగిన టర్కీ జట్టుకు ఆస్ట్రేలియా యువ ఆటగాళ్లు గట్టి షాక్ ఇచ్చారు. మ్యాచ్ ప్రారంభమైన 27వ నిమిషంలోనే ఆస్ట్రేలియా యువ ఫార్వర్డ్ ఆటగాడు నెస్టోరీ ఇరాన్కుందా అద్భుతమైన కౌంటర్ ఎటాకింగ్ గోల్తో జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ అద్భుత గోల్‌తో ప్రపంచ కప్ చరిత్రలో ఆస్ట్రేలియా తరఫున గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఇరాన్కుందా సరికొత్త రికార్డు సృష్టించాడు. ఆ తర్వాత టర్కీ ఆటగాళ్లు మ్యాచ్‌ను డ్రా చేయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆస్ట్రేలియా డిఫెన్స్ దాన్ని తిప్పికొట్టింది. 75వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ కానర్ మెట్కాఫ్ బాక్స్ వెలుపల నుండి ఒక అద్భుతమైన లోషాట్తో రెండో గోల్ కొట్టి ఆస్ట్రేలియా విజయాన్ని పూర్తిగా ఖాయం చేశాడు. ఈ మ్యాచ్లో ఆస్ట్రేలియా 22 ఏళ్ల యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ అసాధారణ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. టర్కీ జట్టు చేసిన పలు ప్రమాదకరమైన గోల్ ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుని క్లీన్ షీట్ సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. ఈ ఘన విజయంతో ఆస్ట్రేలియా జట్టు గ్రూప్‌డి లో 3 పాయింట్లతో టోర్నీని ఉత్సాహంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ గ్రూప్లో పరాగ్వేపై 4–1తో గెలిచిన అమెరికా జట్టు అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది.

## హైతీపై స్కాట్లాండ్ ఘనవిజయం

ఫిఫా ప్రపంచకప్ గ్రూప్‌సి మొదటి మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు 10 గోల్స్ తేడాతో హైతీపై ఘన విజయం సాధించింది. అమెరికాలోని బోస్టన్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్ ఆటగాళ్లు మొదటి నుంచే మంచి ప్రతిభ కనబరిచారు. మ్యాచ్ 27వ నిమిషంలో స్కాట్లాండ్ స్టార్ ప్లేయర్ జాన్ మెక్గిన్ కొట్టిన షాట్, హైతీ డిఫెండర్ను తాకుతూ డిఫ్లెక్ట్ అయి గోల్గా మారింది. ఈ ఒక్క గోల్తో లభించిన ఆధిక్యాన్ని స్కాట్లాండ్ చివరి వరకు కాపాడుకుని విజేతగా నిలిచింది.

## మొరాకోతో బ్రెజిల్ మ్యాచ్ డ్రా

ఫిఫా వరల్డ్‌కప్ గ్రూప్‌సి ఓపెనింగ్ మ్యాచ్‌లో బ్రెజిల్, మొరాకో జట్ల మధ్య జరిగిన పోరు 1–1 తో డ్రాగా ముగిసింది. న్యూజెర్సీలోని స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు గట్టి పోటీని ఇచ్చాయి. మ్యాచ్ ప్రారంభమైన 20వ నిమిషంలో మొరాకో ఆటగాడు ఇస్మాయిల్ సైబారి ఒక అద్భుతమైన గోల్ చేసి తన జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత బ్రెజిల్ జట్టు మ్యాచ్ 31వ నిమిషంలో బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినిసియస్ జూనియర్ సూపర్ గోల్ చేయడంతో స్కోరు 1–1 తో సమమైంది.

# ధీరజ్, కుంకుమ్‌కు పసిడి

## షాక్ తిన్న కొరియా ఆర్చర్లు..!

అంతర్జాతీయ వేదికపై భారత ఆర్చర్లు అదరగొట్టారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్‌కప్ ఆర్చరీలో ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మోహొద్ పసిడి గురితో దేశం గర్వించేలా చేశారు. ఆదివారం జరిగిన రికర్వ్ మిక్స్‌డ్ ఫైనల్లో



దక్షిణ కొరియా జంటకు షాకిచ్చిన ధీరజ్, 17 ఏళ్ల కుంకుమ్ స్వర్ణ పతకంతో మెరిశారు. దాంతో, ఒలింపిక్ ఛాంపియన్ అయిన కొరియా ఆర్చర్లు వెండితో సరిపెట్టుకున్నారు. ఆంటల్యాలో జరిగిన వరల్ కప్ ఆర్చరీలో భారత పతకం ఆశలు మోసిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహెద్ ఫైనల్లో చెలరేగిపోయారు. ఒలింపిక్ విజేతలైన కొరియా జంట కిమ్ జె డియోక్ ఓహ్ ఎ జిన్ను మట్టికరిపించారు. రికర్వ్ మిక్స్‌డ్ ఆర్చరీలో 51(37–36, 37–36, 39–39)తో ప్రత్యర్థిని నిలువరించి దేశానికి గోల్ మెడల్ సాధించారు. రెండు నెలల వ్యవధిలో కొరియా జంటపై భారత ఆర్చర్లకు ఇది రెండో విజయం. ఆసియా క్రీడల్లో దీపికా కుమారి, కుంకుమ్ మొహెద్, అంకిత భకత్లతో కూడిన భారత త్రయం హోరాహోరీ పోరులో కొరియా ఆర్చర్లను చిత్తు చేసింది.

# బాస్కెట్‌బాల్ చరిత్రలో రికార్డు

## 53 ఏళ్ల తర్వాత ట్రోఫీని దక్కించుకున్న న్యూయార్క్ నిక్స్!

బాస్కెట్బాల్ చరిత్రలో న్యూయార్క్ నిక్స్ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. ఏకంగా 53 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఎన్బీఏ కొత్త ఛాంపియన్గా అవతరించింది. హోరాహోరీగా సాగిన ఎన్బీఏ ఫైనల్స్ పోరులో న్యూయార్క్ నిక్స్ జట్టు 41 తేడాతో సాన్ ఆంటోనియో జట్టును మట్టికరిపించి ఘనవిజయం సాధించింది. ఈ అద్భుత విజయంతో న్యూయార్క్ నిక్స్ ఫ్రాంచైజీ చరిత్రలోనే మూడోసారి ఛాంపియన్షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. చివరిసారిగా 1973లో ఈ టైటిల్ గెలిచిన నిక్స్ జట్టు, మళ్లీ ఇన్నాళ్లకు కప్పు ముద్దాడటంతో ఆ జట్టు ఆటగాళ్లు, అభిమానులు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. పటిష్ట మైన సాన్ ఆంటోనియో జట్టుపై మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన న్యూయార్క్ నిక్స్, ఫైనల్ సిరీస్లో తిరుగులేని ఆటతీరుతో ఈ చారిత్రాత్మక విజయాన్ని తన సొంతం చేసుకుంది.



# ఆరోగ్యం



## ఒత్తిడి తగ్గించే పుస్తక పఠనం

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా ఒక మంచి పుస్తకం చదవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. కేవలం ఆరు నిమిషాలు చదవడం ద్వారా ఒత్తిడి హార్మోన్లు 68 శాతం వరకు తగ్గిపోతాయని పరిశోధకులు కనుగొన్నారు. ఇది సంగీతం వినడం, టీ తాగడం లేదా నడకతో పోలిస్తే మనసును మరింత వేగంగా ప్రశాంతపరుస్తుందని గుర్తించారు. ఈ అధ్యయనంలో హృదయ స్పందన, కండరాల పట్టుదల, కార్టిసాల్ స్థాయిలను విశ్రాంతి చర్యల ముందు, ఆ తరువాత కొలిచారు. చాలా తక్కువ సమయంలోనే చదవడం అత్యంత వేగంగా, స్పష్టమైన మార్పు తెచ్చిందని ఫలితాలు చూపించాయి. హృదయ స్పందన నెమ్మదించడం, కండరాల్లోని ఒత్తిడి తగ్గడం వంటి మార్పులు కొన్ని నిమిషాల్లోనే గమనించారు. కథ చదవడానికి మనసు పూర్తిగా ఒకదానిపై కేంద్రీకృతమవుతుందని, దీనివల్ల రోజువారీ ఆందోళనల నుంచి మెదడు కొంత దూరం అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా నర వ్యవస్థ మళ్లీ సమతుల్య స్థితికి చేరుతుంది. పాసివ్ విశ్రాంతి పద్ధతులతో పోలిస్తే, చదవడం ఊహాశక్తిని పూర్తిగా ఉపయోగంలోకి తీసుకువస్తుంది. మెదడులోని అనేక భాగాలు చురుకుగా మారుతాయి, అలాగే శరీరంలోని ఒత్తిడి సూచకాలు తగ్గుతాయి. ఇది మానసిక చురుకుదనం, భావోద్వేగ నిశ్శబ్దం ఒకేసారి ఉండే ప్రత్యేకమైన అనుభూతి. దీని వల్ల మనసు, శరీరం రెండూ తాజాగా మారుతాయి. రోజుకు కొద్దిసేపు పుస్తకం చదవడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది, ఇతరులను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది, జ్ఞాపకశక్తి బలపడుతుంది. దీన్ని అలవాటు చేసుకుంటే మన మెదడు ఒత్తిడిని ఎదుర్కొనే రీతిలో క్రమంగా మార్పులు వస్తాయి. మనసు మళ్లీ ప్రశాంత స్థితికి చేరడం సులభమవుతుంది. నేటి నిరంతర స్క్రీన్ వెలుగులలో, ఆగని శబ్దాల మధ్య, ఆరు నిమిషాల చదువు మనసుకు రీసెట్ బటన్ నొక్కడంలాంటిది. నిజమైన విశ్రాంతి కోసం ఎప్పుడూ నిశ్శబ్దం లేదా ఒంటరితనం అవసరమని కాదు, కొన్నిసార్లు అది ఒక కథ దూరంలోనే ఉంటుంది.

## ఆరోగ్యాన్నిచ్చే 'మాకడామియా'



చిన్నవిగా కనిపించే కానీ శక్తివంతమైన మాకడామియా గింజలు (Macadamia nuts) రుచికరమైన అల్పాహారం. అంతేగాక శాస్త్రపరంగా నిరూపితమైన హృదయ రక్షక ఆహారం. 'వెన్న గింజలు' లేదా 'క్వీన్‌శాండ్ సీడ్స్' అని కూడా పిలిచే మకడామియా గింజలను క్రమం తప్పకుండా తినడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డిఎల్) స్థాయిలు పెరుగుతాయి, అలాగే గుండె ఆరోగ్యాన్ని సమగ్రంగా మెరుగుపరుస్తాయి. ఈ గింజల్లో ఒలివ్ నూనెలో లభించే మోనోఅన్‌సాచ్యురేటెడ్ కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి హానికరమైన చెడుకొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్) స్థాయిని తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీని వలన ధమనుల్లో పేరుకుపోయిన మలినాలు తొలగిపోతాయి, రక్తప్రసరణ సాఫీగా సాగుతుంది. కాలక్రమంలో ఈ సమతుల్యత గుండె జబ్బులు, గుండెపోటు, రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మాకడామియా గింజలు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, మాగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్య ఖనిజాలతో నిండివుంటాయి. ఇవి హృదయ స్పందనను స్థిరంగా ఉంచడంలో, శరీరంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీర్ఘకాల హృదయ రక్షణకు కీలకమైన రెండు అంశాలు. ప్రాసెస్ చేసిన చాలా స్నాక్స్‌లా కాకుండా, మాకడామియా గింజల్లో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. ట్రాన్స్ ఫ్యాట్లు లేదా కృత్రిమ పదార్థాలు ఉండవు. రోజుకు ఒక్కచేతి నిండా గింజలు తిన్నా సరిపోతుంది. క్లినికల్ పరీక్షల్లో వాటి ప్రయోజనాలు స్పష్టంగా కనిపించాయి. ఇవి ఆకలి నియంత్రణకు సహాయపడతాయి, దాంతో బరువు నియంత్రణ కూడా సులభమవుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి మరో ప్రధాన అంశం. అందువల్ల, తర్వాత సారి మీరు స్నాక్ కోసం చిప్స్‌కి చెయ్యి చాపబోతే, దాని బదులు మాకడామియా గింజలు తీసుకోండి. అవి కేవలం రుచికరమైనవి మాత్రమే కాదు... నిశ్శబ్దంగా మీ గుండెను లోపల నుంచి కాపాడుతుంటాయి.

## అల్జీమర్స్‌కు త్వరలో చెక్!



అత్యాధునిక శాస్త్ర పరిజ్ఞానం, ప్రయోగాలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ద్వారాలు తెరుస్తున్నాయి. ఈ క్రమంలోనే అల్జీమర్స్‌పై చేస్తున్న ప్రయోగాలు సానుకూల ఫలితాలనిచ్చాయని అంతర్జాతీయ నివేదికలు పేర్కొంటున్నాయి. ఎస్‌డబ్ల్యు 033291 అనే రసాయనాన్ని యూనివర్సిటీ ఆఫ్ హార్వర్డ్, ఇతర ప్రయోగశాలలు ఎలుకలపై ప్రయోగించాయి. 15పిజిడిహెచ్ అనే ఎంజైమ్‌ను అడ్డుకోవడం ద్వారా మెదడులో రక్త ప్రసరణకు ఎలాంటి ఆటంకం లేకుండా చేయడమే లక్ష్యంగా జరిగిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. ప్రస్తుతానికి ఇది ప్రాథమిక దశలోనే ఉందని, మరింత లోతైన ప్రయోగాలు అవసరమని నిపుణులు అంటున్నారు. 15పిజిడిహెచ్‌ని అడ్డుకోవడం వల్ల ఎలుకల్లో మౌస్‌లలో ఆలోచించడం, గుర్తుంచుకోవడం వంటి వ్యవస్థలు మెరుగుపడ్డాయని గుర్తించారు. ఈ ప్రయోగాన్ని ఇంకా మనుషులపై జరపలేదు. అయితే, ఎలుకలపై చేసిన ప్రయోగాలు ఫలించడంతో, త్వరలోనే క్లినియల్ ట్రయల్స్ మొదలుకావచ్చని తెలుస్తోంది. అప్పుడు కూడా ఇదే తరహాలో ఫలితాలు లభిస్తే, అల్జీమర్స్‌కు సమీప భవిష్యత్తులోనే చెక్ పట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.

# చేగువేరా స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలి

సిపిఐ హనుమకొండ జిల్లా కర్రె భిక్షపతి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : చేగువేరా స్ఫూర్తితో యువజన, విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విద్యార్థి, యువజనలకు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో విప్లవ వీరుడు చేగువేరా జయంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో చే గువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భిక్షపతి హాజరై మాట్లాడుతూ చేగువేరా జీవితం ప్రపంచ యువతకు, విద్యార్థులకు పోరాట స్ఫూర్తికి చిరునామా అన్నారు. ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భానుప్రసాద్, కందగట్ల అజయ్ అస్రఫ్, రాము, ఎం.వినిల్ తదితరులు పాల్గొన్నారు.





**హనుమకొండ :** విప్లవోద్యమాలకు స్ఫూర్తి ప్రదాత చేగువేరా అని, ఆయన పోరాట స్ఫూర్తితో విద్య, ఉపాధి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై యువత ఉద్యమించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. చే గువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, ఎన్ఎ.స్టాలిన్, ఎఐవైఎఫ్ నాయకులు గిన్నారపు రోహిత్, గుగులోత్ సురేష్, షేక్ హాజీ, పెనుకుల మధు, శ్రీనివాస్, ప్రసాద్, ప్రశాంత్, రాజు, నరేందర్ పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** సామ్రాజ్యవాద తిరుగుబాటు విప్లవ స్వప్నం చేగువేరా అని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో చేగువేరా జయంతి సందర్భంగా చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, గోపి, వెంకట్, రాంబాబు, రాము, లింగరాజు, నాగరాజు, నరేంద్ర, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్




**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :** సమిష్టి పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. నస్పూర్‌లోని నరసయ్య భవన్‌లో ఆదివారం సిపిఐ నస్పూర్ మండల సమితి సమావేశం జరిగింది. మండల కోశాధికారి మిరియాల రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా రామడుగు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే నియోజకవర్గ పాదయాత్రలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమితి సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులను ఈ నెల 27, 28, 29 తేదీలలో మంచిర్యాల పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో జిల్లా సమితి సభ్యులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ, మండల కార్యవర్గ సభ్యులు పూజారి రామన్న, బొడ్డు లచ్చన్న, మహేష్, సారంగపాణి, లక్ష్మణ్, శంకర్, ఆంజనేయులు, పద్మ తదితలు పాల్గొన్నారు.

# విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలం

సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి




**ప్రజాపక్షం/జనగామ :** నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి తెలిపారు. ఆదివారం ఎఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశం వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన జరుగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కోశాధికారి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల అధిక ఫీజులతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాన్నారు. అధిక ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, అడిషనల్ ఫీజుల పేరుతో విద్యార్థుల విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని, ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వడ్లకొండ సుధాకర్, కో కన్వీనర్‌గా కందుకూరు మల్లేష్ ఎన్నికయ్యారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న, ఎఐవైఎఫ్ నాయకులు గుండె సుధాకర్, గ్యాదపాక సమ్మయ్య, గొంగళ్ల మహేందర్, వేల్పుల ప్రవీణ్, చేపూరి దయాకర్, బాషపాక ఏలియా, వడ్డేపల్లి మనోహర్, గంగళ్ల శ్రీమోను, కందుకూరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు నష్టం చేసే చర్యలు ఉపసంహరించుకోవాలి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి
దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే చర్యలను ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వి బి జీ రాం జీగా పేరు మార్చి వ్యవసాయ కార్మికులకు నష్టం చేకూరుస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిం చాలని దండి సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టే వరకు ఉద్యమించాలన్నారు. యుపిఏ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సాధించిన వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ఎంజిఎన్ఆర్ఈజిఏ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను హరించివేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందన్నారు. దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లుకట్టించి ఇవ్వాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి ఎంజిఎన్ఆర్ఈజిఏ చట్టాన్ని కొనసాగించాలని, 200 రోజులు పని కల్పించాలని, 55 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు ఆరు వేల ప్రభుత్వ పెన్షన్ ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని తదితర డిమాండ్స్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసు, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేళ్లచెరువు వీరబాబు, సింగారపు సత్యనారాయణ, పిట్టల రాంబాబు, అయోధ్య, గోగుల ఆది తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులను అడవుల నుంచి దూరం చేసే కుట్రలు తిప్పికొట్టాలి

గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసులను అడవుల నుంచి దూరం చేసి, అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తోందని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ఆరోపించారు. ఆదిలాబాద్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో మెస్రం భాస్కర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన గిరిజన సమాఖ్య జిల్లా మూడవ మహాసభకు అంజయ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు గిరిజన సంఘాలు సిద్ధం కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, గిరిజన, ఆదివాసి హక్కుల రక్షణకు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటిడిఏ నిధులను దారి మళ్లిస్తోందని ఆరోపించారు. గిరిజనాభివృద్ధిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'జల్ జంగల్ జమీన్' నినాదంతో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించాలని, పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ముడుపు నళినీ రెడ్డి, గడెం కేశవ్, సాయికృష్ణ, జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.



## ఎరువులు భారం...
# రైతు భవిష్యత్తుపై నీలినీడలు



**ప్రజాపక్షం/వనపర్తి :** వానాకాలం సీజన్ ప్రారంభమవుతుండగానే రైతులపై మరో భారీ ఆర్థిక భారం పడింది. ఇప్పటికే విత్తనాలు, డీజిల్, కార్మిక వ్యయాలు పెరిగి సాగు ఖర్చులు అదుపు తప్పుతున్న వేళ ఇప్పుడు ఎరువుల ధరల పెరుగుదల రైతాంగాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా డీఏపీ, ఎన్పీకే, పోటాష్ వంటి కాంప్లెక్స్ ఎరువుల ధరలు గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరగడం రైతులకు తీరని భారంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న సమయంలో ఎరువుల కోసం రైతులు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు ఎరువుల కొరత, మరికొన్ని చోట్ల బ్లాక్ మార్కెట్ విక్రయాలు రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఎన్పీకే ఎరువులు రైతులకు అందని ద్రాక్షలా మారుతున్నాయి. ఎకరాకు గతంలో 4వేల రూపాయల నుంచి 5 వేల వరకు ఉండే ఎరువుల ఖర్చు ఇప్పుడు 8 వేల నుండి 10 వేల రూపాయలు వరకు చేరుతోందని రైతులు చెబుతున్నారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగులో ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఎరువుల ధరల పెరుగుదలకు ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి పదార్థాల ధరల పెరుగుదల ముఖ్యంగా మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా గ్యాస్ సరఫరా దెబ్బతినడం, దిగుమతి వ్యయం పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. భారతదేశం ఇప్పటికీ డిఏపీ, పోటాష్ వంటి ఎరువుల కోసం విదేశీ దిగుమతుల పైనే అధికంగా ఆధారపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ 2026 కోసం 41,533 కోట్ల రూపాయలు న్యూటియెంట్ బేస్ట్ సబ్సిడీ ప్రకటించినప్పటికీ, మార్కెట్‌లో రైతులకు ధరల భారం మాత్రం తగ్గలేదు. ప్రభుత్వాలు రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటించినా, వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. పంటలకు లభిస్తున్న కనీస మద్దతు ధరల కంటే సాగు వ్యయాలే వేగంగా పెరుగుతున్నాయి. ఎరువులు, డీజిల్, పురుగుమందులు, కార్మిక ఖర్చులు అన్ని కలిపి రైతును అప్పుల బారిన పడేస్తున్నాయి. రైతు సంఘాల ప్రకారం ఎంఎస్పీ పెరుగుదల కంటి ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల అధికంగా ఉండటంతో వ్యవసాయం లాభసాటిగా కాకుండా నష్టాల బాట పట్టుతోంది.

**బ్లాక్ మార్కెట్ భయం**

ఎరువుల కొరత పేరుతో కొన్ని ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు అవసరం లేని ఇతర ఉత్పత్తులను బలవంతంగా కొనిపించే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితులు కొనసాగితే రైతులు అవసరమైన మోతాదులో ఎరువులు వాడలేక దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. దీని ప్రభావం ఆహార భద్రతపై కూడా పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బ్లాక్ మార్కెట్‌పై ప్రత్యేక దాడులు నిర్వహించాలి. రైతు భరోసా కేంద్రాల్లో తగిన నిల్వలు ఉంచాలి. కాంప్లెక్స్ ఎరువులపై అదనపు సబ్సిడీ ఇవ్వాలి. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాలి. దేశానికి అన్నం పెడుతున్న రైతు ఈరోజు ఎరువుల ధరల భారంతో నలిగిపోతున్నాడు. వ్యవసాయం ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ అస్థిరత, పెరుగుతున్న ఖర్చులతో సంక్షోభంలో ఉండగా ఇప్పుడు ఎరువుల ధరల పెరుగుదల మరో పెద్ద దెబ్బగా మారింది. రైతు బతికితినే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## బడుగు, బలహీనవర్గాల గొంతుక చలకాని వెంకట్ యాదవ్



తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి గెలుపు అభినందనీయం

విజయోత్సవ సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం /హిమాయత్‌నగర్ :** బడుగు, బలహీనవర్గాల గొంతుకై వారి పక్షాన ప్రశ్నించే గొప్ప వ్యక్తి చలకాని వెంకట్ యాదవ్ అని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా చలకాని వెంకట్ యాదవ్ రెండోసారి గెలుపు సామాజిక ప్రేరణకు నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వై.రవికుమార్ అధ్యక్షతన చలకాని వెంకట్ యాదవ్ విజయోత్సవ సభ జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరితోపాటు పలువురు న్యాయవాదులు, విద్యార్థులు, వేదిక నేతలు, అభిమానులు వెంకట్ యాదవ్‌కు శాలువా కప్పి, గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నెల్లికంటి సత్యం మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉంటూనే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అభివృద్ధికి వెంకట్ యాదవ్ కృషిచేస్తుండటం అభినందనీయమన్నారు. తను అనుకొన్న లక్ష్యసాధించేంతవరకు వెంకట్ విశ్రమించబోరన్నారు. ఆయన గెలుపుతో సామాజిక ఉద్యమకారులకు, ప్రజాస్వామికవాదులకు కొత్త బలాన్నిచ్చిందన్నారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి చలకాని వెంకట్ అని పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి పోరాడటమేకాకుండా, కొత్త న్యాయమూర్తుల ఎంపికలో ఆయన ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నదన్నారు. వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ అమలుకు,హెల్త్‌కార్డుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వేదిక నేతలు మల్లికార్జున్, శ్రీహరియాదవ్, అయోధ్య, శ్రీనివాస్, నోముల సతీశ్,సంజయ్,సి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యా రంగంలో నూతన శకానికి
# తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నాంది

ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



**రంగారెడ్డి జిల్లా/ఆరుట్ల :** ఆరుట్లలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టిపిఎస్)ను ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి సందర్శించి పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్లాస్‌రూమ్‌లు, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్లు, డైనింగ్ హాల్స్, ఇతర మౌలిక సదుపాయాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు అయోధ్యరెడ్డి. ఈ సందర్భంగా కమిషనర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విద్యా రంగంలో నూతన శకానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నాంది పలుకుతాయని అన్నారు. పేద మరియు మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అభినందనీయమన్నారు కమిషనర్ అయోధ్య రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్సు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు స్కూల్లోనే బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడే అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు అయోధ్యరెడ్డి. ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకతలు, విద్యా విధానం, మౌలిక సదుపాయాలు, చేపడుతున్న ఏర్పాట్ల గురించి తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి,, సభ్యులు చారకొండ వెంకటేష్, జ్యోష్న శివారెడ్డి లు కమిషనర్కు వివరించారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు ఆదర్శంగా నిలిచి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రక్తదానం మహోన్నత మానవతా సేవ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రక్తదానం ఒక ప్రాణాన్ని నిలబెట్టే మహోన్నత మానవతా సేవ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కల్పిస్తూ, నిరంతరం సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలకు సిఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒకరి రక్తదానం మరొకరి జీవితాన్ని కాపాడటమే కాకుండా, వారి కుటుంబంలో కొత్త ఆశలను నింపుతుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడే ఈ మహత్తర కార్యంలో భాగస్వాములై ప్రాణదాతలుగా నిలవాలి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని, సమాజంలో మరింత మంది స్వచ్ఛందంగా ముందుకు రావాలనిసిఎం పిలుపునిచ్చారు.

## విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి ఆర్‌టిసి సిద్ధం

నేటి నుంచే ప్రత్యేక స్కూల్ బస్సులు..ఎండి వై.నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేసవి సెలవుల అనంతరం సోమవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా 2026–27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి... ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టిజిఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్లఅధికారులను ఆదేశించారు. నూతన విద్యా సంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండి సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండి నాగిరెడ్డి ఆదేశించారు.

## పరకాలలో విజిలెన్స్ దాడులు...

150 లీటర్ల స్పీడ్ పారాక్వాట్ పట్టివేత

నిషేధిత కలుపు మందు స్వాధీనం



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణంలోని ఓ ఎరువులు, పురుగుమందుల దుకాణంలో నిషేధిత కలుపు మందును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని లక్ష్మీ ఏజెన్సీలో నిల్వ ఉంచిన సుమారు 150 లీటర్ల స్పీడ్ పారాక్వాట్ (పారాకుట్) మందును అధికారులు తనిఖీల సందర్భంగా గుర్తించి పట్టుకున్నట్లు సమాచారం. భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు రైతుల ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉందన్న కారణాలతో ప్రభుత్వం ఈ మందు విక్రయాలు, వినియోగంపై నిషేధం విధించింది. అయినప్పటికీ కొందరు వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తూ రహస్యంగా విక్రయాలు కొనసాగిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది.పట్టణంలోని ఇతర ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లోనూ సమగ్ర తనిఖీలు చేపడితే మరింత పరిమాణంలో నిషేధిత మందులు బయటపడే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీ కేసులో
# రెండోసారి సిఐడి విచారణకు అభిషేక్ బెనర్జీ



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి నియామకానికి సంబంధించి శాసనసభ్యులు చేసిన సంతకాలలో ఫోర్జరీ జరిగిందన్న ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ రెండోసారి ఆదివారంనాడు కోల్‌కతాలోని సి.ఐ.డి కేంద్ర కార్యాలయానికి వెళ్ళారు. మరోవైపు ఇదే కేసులో మరో టిఎంసి నాయకుడు,శాసనసభ్యుడు కునాల్ ఘోష్ కూడా రాష్ట్ర దర్యాప్తు సంస్థ పిలుపు మేరకు భవానీ భవన్‌లోని బెంగాల్ రాష్ట్ర పోలీసు కేంద్ర కార్యాలయానికి వెళ్ళారు. డైమండ్ హార్బర్ ఎంపీగా ఉన్న అభిషేక్ బెనర్జీ ఇచ్చిన సమాధానాలపట్ల గతవారం సిఐడి అధికారులు ఎంత మాత్రం సంతృప్తి చెందకుండా మళ్ళీ విచారణకు పిలవడంతో రెండోసారి కూడా ఆయన సిఐడి కార్యాలయానికి వెళ్ళారు. తీర్మానంపై సంతకాలు చేసిన సమావేశం వివరాల గురించి అభిషేక్‌ను పదే పదే ప్రశ్నించినట్లు ఒక అధికారి చెప్పారు. ఈ కేసులో కొన్ని పత్రాలు సమర్పించాలని అభిషేక్‌ను అధికారులు కోరారు. అభిషేక్‌తోపాటు ఘోష్ చెప్పిన సమాధానాలమధ్య వ్యత్యాసాలను అధికారులు సమీక్షిస్తారు. వీరిద్దరినీ అవసరమైమే ఎదురెదురుగా కూర్చోబెట్టి మాట్లాడే అవకాశాలు కూడా ఉన్నాయి. మే ఆరో తేదీన టిఎంసి సమావేశం కోల్‌కతా కాళీఘాట్‌లోని మమతా బెనర్జీ నివాసంలో జరిగింది. ఆనాడు సోవన్‌దేవ్ ఛట్టోపాధ్యాయ పేరును ప్రతిపాదించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంఎల్‌ఎలు మూజువాణీ ఓటుతో ఆయనను ఎన్నుకున్నారు. చేతులు ఎత్తడం ద్వారా తమ సమ్మతిని తెలియజేశారు. ఐతే ఈ నిర్ణయాన్ని వెంటనే అసెంబ్లీకి మంతా బెనర్జీ తెలియజేయలేదు. మే 13,14 తేదీలలో టిఎంసి ఎంఎల్‌ఎలు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతిపక్ష నాయకుడుగా ఎవరిని నియమించారో లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరుతూ అసెంబ్లీ సచివాలయం టిఎంసిని కోరింది. దీంతో మే 19వ తేదీన శాసనసభ్యులతో టిఎంసి మరో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో 70 మంది శాసనసభ్యులు ప్రతిపక్ష నాయకుడుగా చట్టోపాధ్యాయను ఎన్నుకున్నట్లుగా సంతకాలు చేసిన పత్రాలను అసెంబ్లీకి సమర్పించారు. ఐతే తర్వాత ఈ పత్రాలలో సంతకాలలో తేడాలు ఉన్నట్లు గమనించారు. దీనిపై సందేహాలు చెలరేగాయి. ఆ తర్వాత టిఎంసిలో సంక్షోభం తలెత్తింది. ఎంఎల్‌ఎలు రాజీనామాలు చేశారు. చివరకు ఇది పెద్ద సమస్యగా మారి ఎఫ్ ఐఆర్ దాఖలుకు, ఆ తర్వాత సిఐడి విచారణ వరకూ వెళ్ళింది.

## పాక్‌ను తిప్పేసిన దీప్తి, చరణి ..
# వరల్డ్‌కప్‌ను ఘనంగా ఆరంభించిన భారత్..!

టీ20 ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో 64 పరుగుల తేడాతో పాక్‌స్థాన్‌పై విజయం



ఐసిసి టోర్నీల్లో మరోసారి భారత జట్టు జోరుకు పాకిస్థాన్ తలొగ్గింది. మహిళల టీ20 ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో 170 పరుగుల ఛేదనలో పాక్‌కు టీమిండియా స్పిన్నర్లు ముచ్చెమటలు పట్టించారు. బర్మింగ్‌హామ్‌లో స్పిన్నర్లు దీప్తి శర్మ(5–10). శ్రీ చరణి (3–21)లు దాయాది టాపార్డర్‌ను కూల్చివేయడంతో పాకిస్థాన్‌ను 64 పరుగుల తేడాతో ఓడించింది.

తొలుత ఓపెనర్ స్మృతి మంధాన(68) అర్ధ శతకంతో కదం తొక్కగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(36) కెప్టెన్ ఇన్నింగ్స్, రీచా ఘోష్() తుఫాన్ బ్యాటింగ్‌తో రెచ్చిపోయారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో భారత్ జయభేరి మోగించింది. మెగాటోర్నీలో దాయాదిపై రికార్డును కొనసాగిస్తూ హర్మన్‌ప్రీత్ సేన 64 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 171 పరుగుల ఛేదనలో ఓపెనర్ మునీబా అలీ(41) ఒక్కామే దూకుడుగా ఆడినా.. దీప్తి శర్మ(5–10), శ్రీ చరణి(3–23)లు తిప్పేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు తిప్పారు. ఓవర్లో రెండు వికెట్లు తీసిన దీప్తి ఐదో వికెట్ సాధించింది. దాంతో, పాక్ అదే తడబాటుతో 110 పరుగులకే ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాను ఆదిలోనే పాక్ బౌలర్లు కష్టాల్లోకి నెట్టారు. షఫాలీ వర్మ(5), జెమీమా రోడ్రిగ్స్(1)లు విఫలమైనా ఓపెనర్ స్మృతి మంధాన(68) నిలబడింది. దాయాది బౌలర్లను కాచుకున్న మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(36)తో కలిసి జట్టును ఆదుకుంది. కౌర్ స్టాండ్ ఇవ్వగా.. మంధాన అటాకింగ్ గేమ్‌తో పాక్ బౌలింగ్ దళాన్ని చీల్చి చెండాడింది. రెండుసార్లు మంధానను ఔట్ చేసే అవకాశాన్ని పాక్ ఫీల్డర్లు నేలపాలు చేశారు.

బౌండరీలతో విరుచుకుపడిన మంధాన అర్ధ శతకంతో జట్టుకు మంచి స్కోరందించింది. కానీ, స్వల్ప తేడాకే కౌర్, మంధాన ఔటవ్వగా.. డెత్ ఓవర్లలో రీచా ఘోష్(34) బ్యాట్ ఝులిపించింది. దీప్తి శర్మ(12)తో కలిసి ధనాదన్ ఆడిన రీచా.. తస్మియా రుబాబ్ వేసిన 19వ ఓవర్లో 4, 6, 4, 4తో 23 రన్స్ పిండుకుంది. చివరి ఓవర్లో 15 పరుగులే రావడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది.

## నెతన్యాహూ యుద్ధాలు గెలవలేరు, ధరలు తగ్గించలేరు

పదవిలో కొనసాగితే ఇజ్రాయెల్‌కు సమాజం ఉండదు : బెన్నెట్



**టెల్‌అవీవ్ :** బెంజిమన్ నెతన్యాహూ రాబోయే నాలుగు సంవత్సరాలు కూడా పదవిలో కొనసాగితే ఇక ఇజ్రాయెల్‌లో సమాజం అంటూ ఉండదని ఆ దేశ మాజీ ప్రధానమంత్రి నఫ్తాలీ బెన్నెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన యుద్ధాలు గెలవలేరు, దేశంలో ధరలు తగ్గించలేరు, నేరాలు అరికట్టలేరు, అతి సంప్రదాయవాదుల్ని సమాజంలో ఏకీకృతం చేయలేరు అని విమర్శించారు. ప్రపంచంలో ఇజ్రాయెల్ ప్రతిష్టను నిలబెట్టి, దేశ సామర్థ్యాన్ని ఇనుమడింపజేసే శక్తిసామర్థ్యాలను ఆయన కోల్పోయారన్నారు. ఇజ్రాయెల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బెన్నెట్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ ప్రస్తుతం అస్తిత్వ ప్రమాదాన్ని ఎదుర్కొంటోందన్నారు. నెతన్యాహూ మరో నాలుగు సంవత్సరాలు అధికారంలో కొనసాగితే మనకు ఆర్థికవ్యవస్థగానీ, సమాజంగానీ మిగలకుండాపోతాయని హెచ్చరించారు. హారేదీ(లౌకిక–అతిసంప్రదాయవాద జనాభామధ్య సంఘర్షణ) సమస్య మనల్ని నాశనం చేస్తుంది, అంతర్జాతీయంగా మనకు ఎక్కడా స్థానం ఉండదు, ఆయన ఏమీ చేయలేరు, ధరలను అదుపు చేయలేరు, యుద్ధాలలో గెలవలేరు అన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధ విరమణ ఒప్పందంపై సంతకాలు జరిగే తరుణంలో ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహాన్ని, సుదీర్ఘకాలం యుద్ధాలపైనే ఆధారపడటాన్ని బెన్నెట్ తీవ్రంగా ఖండించారు. నెతన్యాహూ ఇదేవిధంగా యుద్ధాలపై ఆధారపడి బ్రతికితే, ''ఇక మనకు సమాజం అంటూ ఉండదు'' అని ఆందోళన వ్యక్తం చేశారు.బెన్నెట్‌ను ఓడించి నెతన్యాహూ అధికారం చేజిక్కించుకున్నారు.నెతన్యాహూ ప్రభుత్వం అనుసరిస్తున్న యావత్ యుద్ధ విధానాలను, ఏకకాలంలో అన్ని వైపులా చేస్తున్న యుద్ధాన్ని, యుద్ధ వ్యూహాన్ని బెన్నెట్ తీవ్రంగా ఖండించారు. తాను అధికారంలోకి వస్తే ఇరాన్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న అవినీతి–అసమర్థపాలనపై వ్యతిరేకతను వేగవంతం చేస్తానని, ఇరాన్ అణ్వాయుధం సంపాదించకుండా తాను ప్రస్తావించిన అక్టోపస్ సిద్ధాంతాన్ని బహుళ సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను ముందుకు తీసుకువెళతానని ప్రజలకు వాగ్దానం చేశారు. నిరంతరం యుద్ధం చేయడం ఇజ్రాయెల్ సిద్ధాంతం కాదని, దీనివల్ల రిజరిస్టులు,ఆర్థిక వ్యవస్థ నష్టపోతాయన్నారు.



## ఒఆర్ఆర్ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం కీసర ఓఆర్ఆర్ టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం ఉదయం బాచుపల్లికి చెందిన పిట్ట కిరణ్(41) అతని స్నేహితుడు కుర్వేటి మణితేజ(24)లు ఇన్నోవా(ఏపి 39 విఎఫ్ 1679)కారు ఓఆర్ఆర్ రోడ్డు వెళ్తుండగా ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండా లైన్ మార్చడంతో ప్రమాదాన్ని తప్పించే క్రమంలో ఇన్నోవా కారు లారీని వెనకాల నుండి ఢీకొట్టింది. అదుపుతప్పిన కారు డివైడర్, రోడ్డు పక్కన రైలింగ్‌ను ఢీకొట్టడంతో పిట్ట కిరణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. స్నేహితుడు మణితేజ తీవ్ర గాయాలు కాగా బోడుప్పల్ శ్రీకర ఆసుపత్రికి తరలించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## తెలుగు చేతిరాత గుర్తింపు పరిశోధనకు డాక్టరేట్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలుగు భాషా సాంకేతికత అభివృద్ధికి దోహదపడే కీలక పరిశోధన నిర్వహించిన అనురాగ్ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థిని చంద్రకళ ముక్కుకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు.తెలుగు చేతిరాత అక్షరాలు పదాలను గుర్తించే ఆధునిక వ్యవస్థ రూపకల్పనపై చేపట్టిన పరిశోధనకు ఈ గౌరవం అభించింది. అనురాగ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ సమాచార ప్రసార ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చంద్రకళ ముక్కు ఆఫ్ లైన్ తెలుగు చేతిరాత అక్షరాలు పదాలు గుర్తింపు వ్యవస్థ కోసం ఆధునిక నమూనా రైపకల్పన అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనను డాక్టర్ సంతోష్ మిర్యాల పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ పరిశోధనకు సంబంధించిన మౌలిక పరీక్షను జూన్ 3న నిర్వహించారు. తిరుచ్చిలోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ ఎలక్ట్రానిక్స్ సమాచార ప్రసార ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ముత్తారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షకుల కమిటీ సిఫారసుల మేరకు చంద్రకళ ముక్కుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా ప్రదానం చేశారు. తెలుగు భాషలో చేతిరాత గుర్తింపు సాంకేతికత అభివృద్ధికి ఈ పరిశోధన ఉపయోగపడనుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

## హైమాస్ట్ లైట్స్ ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/బంట్వారం :** తోర్‌మామిడి గ్రామంలో సర్పంచు ఎం సంజీవయ్య అంబేద్కర్ కూడలి వద్ద హైమాస్ట్ లైట్లను బిగించి ప్రారంభించారు. సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రధాన కూడలి వద్ద హైమాస్ లైట్లతో గ్రామంలో వెలుగులు విరజిమ్ముతున్నాయని, గ్రామాభివృద్ధి కోసం సర్పంచు సంజీవయ్య చేస్తున్నా అభివృద్ధి కార్యక్రమాల పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువ జన సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

## ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించిన ఎఎంసి చైర్మన్ నర్సింహులు యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డిని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ప్రజల శాంతి భద్రతలు కాపాడాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని నూతనంగా విచ్చేసిన ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి ని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, నాయకులు కొమురయ్య, భూమేష్‌గౌడ్, లక్ష్మ న్ నాయక్ పాల్గొన్నారు.

## ఎల్లమ్మ పండగలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు అంజలియాదవ్ నివాసంలో ఆదివారం జరిగిన ఎల్లమ్మ పండగకు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ ముఖ్య అతిదిగా హజరై ఎల్లమ్మ పండగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంజలియాదవ్ మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అంజలియాదవ్ మాట్లాడుతూ ప్రజలందరిపై అమ్మవారి చల్లని చూపులు ఉండాలని, ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్, కేశవరం కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, బిఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కొంపల్లి భూమేష్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏలూరి కొమురయ్య పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలల మాయాజాలం

# అడ్డగోలు వసూళ్లతో దోపిడీ

- ఒక పాఠశాల అనుమతితో ఎక్కడ పడితే అక్కడ బ్రాంచ్‌లు
- మామూళ్ల మత్తులో విద్యాశాఖాధికారులు
- సౌకర్యాలు మాత్రం నిల్
- ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరచటంలో నిర్లక్ష్యం
- నేటి నుండి తెరుచుకుంటున్న పాఠశాలలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వేసవి సెలవుల అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు నేటి నుండి పున:ప్రారంభం కానున్నాయి. యథేచ్ఛగా కార్పొరేట్ పాఠశాలల నిలువు దోపిడీ మాయాజాలం అధికారుల కనుసన్నల్లో కొనసాగుతోంది. నిబంధనల మేరకు ప్రయివేట్ పాఠశాలలు సైతం ఈ రోజే ప్రారంభం అవాల్సి ఉన్నప్పటికి అనధికారికంగా తరగతులు సైతం కొద్ది రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులతో నిమిత్తం లేకుండా పోటాపోటీగా అడ్మిషన్లు కొనసాగించాయి. కేజి నుండి పిజి, మెడిసిన్‌లాంటి ఉపాధి సంబంధిత విద్యలకు నిలయంగా ఉన్న రాజధాని శివారు జిల్లా అయిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది ఎడాపెడా గల్లీలను సైతం విడిచి పెట్టకుండా భారీ భవంతుల్లో ఎక్కడ పడితే అక్కడ ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు జిల్లా విద్యాశాఖాధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని పుట్టగొడుగుల్లా ప్రారంభించాయి. అనుమతి లేని ప్రయివేట్ పాఠశాలల విషయంతో పాటు కనీస మౌలిక సదుపాయాలు లేక పోవటం, మరో జిల్లాలో ఒక పాఠశాలకు మాత్రమే అనుమతి తీసుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అనుమతులతో నిమిత్తం లేకుండా ఇష్టం వచ్చిన చోట అదే పేరిట పాఠశాలలు ప్రారంభించటం, వేసవి కాలంలో అడ్మిషన్లు చేపట్టటం, లక్షల రూపాయల్లో ఫీజులు వసూలు చేయటం, పుస్తకాలు, యూనిఫారాలు అమ్మటం లాంటి విషయాలపై ఏఐవైఎఫ్ లాంటి పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టి జిల్లా విద్యాశాఖాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారి చెవికెక్కక పోవటం వెనుక మాయాజాలం అర్థం కాని విషయం. విద్యాశాఖ రికార్డుల్లో ఉన్న ప్రయివేట్ పాఠశాలల సంఖ్యకు వాస్తవంగా జిల్లాలో ఉన్న పాఠశాలల సంఖ్యకు అసలు పొంతనే ఉండదు.

**దోపిడీ నిలయాలుగా ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలు**

ఎల్‌కెజి నుండి రూ.50 నుండి లక్షకు పైగా కళ్లు చెదిరేలా ఫీజులు వసూలు




చేసే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నా అధికారుల చెవులు, కళ్లు మాత్రం పని చేయనట్లు ఏ మాత్రం పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కొత్త పేర్లతో గల్లీకొకటి చొప్పున ఎసి తరగతి గదులతో భారీ భవంతుల్లో రోజురోజుకి విస్తరిస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులతో పాటు పుస్తకాలు, బస్సు రవాణా చార్జిలు, యూనిఫారాలు, ల్యాబ్, లైబ్రరీ, స్పోర్ట్స్, ప్రాజెక్టు వర్క్ అంటూ డబ్బే ధ్యేయంగా అదనపు వడ్డింపులతో వసూళ్లకు పాల్పడుతూ విద్యావిలువల్ని తుంగలోకి తొక్కేస్తున్నారు. నాలుగైదు అంతస్తుల భవనాలు, ఎసి తరగతి గదులు మినహా ఈ పాఠశాలల్లో సరైన ప్లే గ్రౌండ్ ఉండదు. ఇరుకు గదుల్లో పరిమితికి మించి విద్యార్థులతో కనీస అర్హత లేని ఉపాధ్యాయులతో చదువులు చెప్పిస్తుంటారు. ఆయా స్కూళ్లలోనే ఏర్పాటు చేసే క్యాంటిన్లలోనే ఏదైనా కావాలంటే కొనుక్కొని అడిగినంతా చెల్లించాలి. పక్కన ఉండే ఖాళీ స్థలాన్నే అడ్మిషన్ల సమయంలో తమదే అంటూ చెప్పుకోవటం పరిపాటిగా మారింది. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే ఆయా పాఠశాలలకు విద్యాశాఖాధికారులు నామమాత్రపు నోటీసులిస్తూ అటు వైపు కన్నెత్తైనా చూడరు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని ఆ నోటీసులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా తమ దోపిడీని కొనసాగిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారుల కనుసన్నల్లోనే గుర్తింపు లేని పాఠశాలలు, ఇష్టం వచ్చిన చోట ఒకే పేరిట పలు శాఖలు ఏర్పాటు చేస్తూ లక్షల్లో ఫీజులు దండుకొంటున్నాయన్న విషయం బహిరంగ ఆరోపణలే. ప్రయివేట్ పాఠశాలల విషయంలో విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించటం పట్ల పలు సందర్భాల్లో పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అనుమానాలు వ్యక్తం చేస్తూ అధికారులు కఠినంగా వ్యవహరిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ పాఠశాలల విషయంలో నిర్లక్ష్యం**

ఒక పక్క ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మెరుగుపరుస్తామంటూ ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికి మేడ్చల్ జిల్లాలో మాత్రం అధికార యంత్రాంగం ఆ దిశగా ముందుకు వెళ్లటం లేదు. ఇప్పటికీ పలు ప్రభుత్వ మండల, జిల్లా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించటంలో నిర్లక్ష్యం కనపడుతోంది. ఇరుకైన గదులు, వాన వస్తే గదుల్లో పడే వర్షపు నీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడే విధంగా లేకపోవటం, మధ్యాహ్న భోజనాలు తినేందుకు వసతి లేక పోవటం విషయమై పలు సందర్భాల్లో జిల్లా కలెక్టర్‌తో సహా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినప్పటికి ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా నేటికీ అదే పరిస్థితులు కనపడుతుంటాయి.

# గ్రామీణ క్రీడాకారులకు చేయూత

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువత క్రీడల్లో రాణించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటిలో మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కెకెఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో అలియాబాద్ మున్సిపల్ నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. విజేతగా తుర్కపల్లి జట్టు, రన్నర్‌గా యాడారం జట్టు నిలువడంతో విజేత టీమ్‌కు రూ. 20 వేలు నగదు, యాడారం టీమ్‌కు రూ. 10 వేలు నగదుతో పాటు ట్రోఫీలను ముఖ్య అతిథిగా విచ్చేసిన నక్క ప్రభాకర్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించుటకు టోర్నమెంట్‌లు దోహదపడతాయని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యువకులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో



బాగంగా అలియాబాద్ మున్సిపల్‌లోని యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, ఎన్ఎస్‌యుఐ ఇంచార్జ్ రాము, జిల్లా నాయకుడు బొమ్మక్ శ్రీనివాస్, కౌన్సిలర్లు ముద్దం సుధాకర్ రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, గూదె వెంకటేష్, నాయకులు కమఠం కృష్ణారెడ్డి, సాయి కృష్ణ, బాబు, రాంప్రసాద్, రాఘవరెడ్డి, సాయికుమార్, నాగమల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆశయాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం



కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇందిరమ్మ ఆశయ సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇళ్లులేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కొల్తూర్‌లో గనాజి మాధవి మురళీచారికి మంజూరైన ఇందిరమ్మ ఇంటికి ముగ్గుపోసి భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాల గృహ కలను నిజం చేస్తు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో లక్షాలది మంది కుటుంబాలకు ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో మేడ్చల్ నియోజకవర్గానికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మోర్సు బాయి శశిరేఖ, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు నర్సారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీశైలం, అంజనేయులు, సురేష్, బాలయ్య నరేష్, వెంకటేష్, శ్రీకాంత్, చాకలి నర్సింలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాండు, శ్రీదర్‌రెడ్డి, దత్తుగౌడ్, మల్లేష్, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్, మామిండ్ల మల్లేష్ యాదవ్, సాయి పాల్గొన్నారు.

## రక్తదాన కృషికి డా.ఎస్ఎం రాజేశ్వరరావుకు గవర్నర్ పురస్కారం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రక్తదానం పట్ల సమాజంలో చైతన్యం కల్గిస్తూ స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించటంలో విశేష కృషికి గాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ రాష్ట్ర మంత్రి జూపల్లి ఓఎస్డీ డా.ఎస్ఎం రాజేశ్వరరావును ఆదివారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం సత్కరించి పురస్కారాలు అందచేసారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా లోకభవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాలులో భారత్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన దాతలు,రక్తదాన శిబిరాల నిర్వాహకులు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద భారత్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణా రాష్ట్ర శాఖకు విశేష సహకారం అందించన సంస్థల ప్రతినిధులకు గవర్నర్ సత్కరించి పురస్కారాలు అందచేసారు. డా.రాజేశ్వరరావు 2023 మార్చి నుండి 2026 మే వరకు 113 రక్తదాన శిబిరాలు నిర్వహించి 8279 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, తలసేమియా, క్యాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడింది. దీంతో పాటు 467 ఉచిత వైద్య శిబిరాల ద్వారా 24142 మందికి పైగా



సేవలందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, శాంతి భద్రతల విభాగ డిజి మహేష్ భగవత్, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణా శాఖ ప్రధాన కార్యదర్శి, సిఈఓ శశికిరణాచారి తదితరులు పాల్గొన్నారు.

## విహార కేంద్రంగా మారనున్న హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు

### సుందరీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్ హెచ్ ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులతో ఆధునిక విహార కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. రూ.37.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పెద్దచెరువు సుందరీకరణ పనులను ఆయన నాచారం మాజీ కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్‌తో కల్సి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్, హరితవనాలు, సిట్టింగ్ ఏరియాలు, అలంకార విద్యుత్ దీపాలు, పిల్లల ఆట స్థలాలు, ఫుడ్ కోర్టుల వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాకా హెచ్‌ఎంటి నగర్ పరిసర ప్రాంత రూపురేఖలు మారి పోయి నగర ప్రజలకు ప్రధాన ఆకర్షణీయ కేంద్రంగా మారుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఏర్పాటు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** భవన నిర్మాణ కార్మిక సంఘ అనుబంధ ఏఐటియుసి నేరేడ్‌మెట్ నూతన కమిటి అధ్యక్షుడిగా బి.శంకర్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మధుసుధన్, ఉపాధ్యక్షుడిగా పోచయ్య, ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ,జాయింట్ సెక్రటరీగా తులసీరాం, కలమ్మ శాంతాబాయి, కమిటీ సభ్యులుగా పి.నరసింహ, బి.రవి, తులసి రాం రాథోడ్, సుధాకర్‌బాబు నాయక్, జవాన్ హరి నాయక్‌లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిచంద్రన్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏఐటియుసి సుదీర్ఘ పోరాటం వల్లే రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ఏర్పాటైందని, నాటి నుండి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు రావల్సిన హక్కులను ఇప్పించటంలో కృషి చేసామన్నారు. మల్కాజిగిరి మండల సిపిఐ కార్యదర్శి కాసర్ల నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు.

## చెరువు సుందరీకరణ పనులు పూర్తయ్యేనా?

# ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని సుందరీకరణ

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి చెరువు ఎనిమిదేండ్లు అయిన సుందరీకరణ పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని 58 ఎకరాల్లో విస్తరించి ఉన్న చర్లపల్లి చెరువు సుందరీకరణకు రూ.12.28 కోట్లను కేటాయించి పనులు ప్రారంభించిన కొద్దిరోజులకే నిలిపివేశారు. కేటాయించిన నిధులతో చెరువు కబ్జా కాకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్, వాకర్లు నడిచేందుకు వాకింగ్ ట్రాక్, ల్యాండ్ స్కేపింగ్, కూర్చునేందుకు వీలుగా బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు వంటి సదుపాయాలతో చెరుకు రూపురేఖలు మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. చెరువు పూడికతీత చేసి మట్టిని అమ్ముకున్నారే తప్ప పనులు పూర్తికాలేదు. చెరువు చుట్టూ గోడను నిర్మించి సుందరీకరణ మాత్రం మర్చిపోయారు. నగర్ మేయర్‌గా ఉన్న బొంతు రామ్మోహన్ చెరువును పరిశీలించడానికి రావడంతో మత్సకార ప్రతినిధులు చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని వినతి పత్రం అందజేయడంతో పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు కానీ సుందరీకరణ పనులు కళగానే నిలిచిపోయాయి. గత తొమ్మిది నెలల క్రితం జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెవెన్యూ, ఇరిగేషన్, జిహెచ్‌ఎంసి అధికారులతో కలసి చెరువును పరిశీలించి చెరువు రూపురేఖలు మారనున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కొద్ది నీరు పరిశుభ్రంగా ఉండడంతో జీవవైవిధ్యానికి అవకాశం కల్పించిందని చెరువునిండా నీరుంటే మరింత ఆహ్లాదంగా మారుతుందని చెరువును పూర్తి స్థాయి లో అభివృద్ధి చేసి పర్యాటక, విహారకేంద్రాంగా తీర్చిదిద్దాలని, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు చెరువుకట్టను బలోపేతం చేసి పాల్‌వేను అభివృద్ధి చేయడం వెంటనే పనులు చేపట్టాలని నిర్ణయించిన అది సాధ్యం కాలేదు. సోలార్ లైటింగ్ సిస్టం, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న అది సాధ్యం కాలేదు. 9 ఏండ్లు గడుస్తున్నా సుందరీకరణ పనులు పూర్తి కాకపోవడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయని ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చెరువు సుందరీకరణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు, మత్స్యకార ప్రతినిధులు కోరుతున్నారు.

**చెరువును పూడికతీత తీయాలి: పొన్నం విజయ్ సంఘం ప్రధాన కార్యదర్శి, అన్నసారం పాండు డైరెక్టర్**



చెరువు మట్టితో నిండిపోయి నీటి సామర్థ్యం తగ్గుతుందని పూడికతీత చేపడితే చెరువులో నీటి నిల్ల సావర్థ్యం పెరుగుతుందని, చెరువు కట్టను బలోపేతం చేసి లైటింగ్



సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. చెరువు పక్కన ఉన్న కాలనీవాసులు చెరువు వద్ద చెత్తను డంపింగ్ చేస్తున్నారని దాన్ని ఎత్తి వేయాలని, ప్రజలు ఉల్లాసంగా గడపడానికి అనుకూలంగా ఉంటుందని విజయ్, పాండులు కోరుతున్నారు.

**పనులు త్వరగా పూర్తి చేయాలి : రుద్రగోని రాంచందర్‌గౌడ్ సీనియర్ టిడిపి నాయకులు**



చర్లపల్లి చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు అయినా ఇంతవరకు సుందరీకరణ పనులు పూర్తికాలేదు. ప్రభుత్వాలు మారుతున్న సుందరీకరణ పనులు పూర్తి కావడం లేదు. వాకింగ్ ట్రాక్, లైటింగ్, చిన్న పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

